


శిథిలం

రూ॥90/-

పేజీలు:96

నవచేతన పబ్లిషింగ్ హౌస్

గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54

E-mail: navachethanaph@gmail.com

నవచేతన బుక్ హౌస్

బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM


అనుమతులు ఇప్పించండి

లోపలి పేజీల్లో

ప్రతిపక్షాలవి దిగజారుడు రాజకీయాలు


సంపుటి 08, సంచిక: 53 | మంగళవారం | 21-01-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00




అమెరికా 47వ అధ్యక్షుడిగా

# ట్రంప్ ప్రమాణం

## అమెరికాలో స్వర్ణయుగం షురూ : సంపన్న దేశంగా మారుస్తా

### తక్షణం అక్రమ వలసలు ఆపి నేరగాళ్ళను తరిమికొడతాం

### ప్రమాణస్వీకార ప్రసంగంలో ట్రంప్ ప్రకటన

**వాషింగ్టన్ :** అమెరికా ఫస్ట్ అనేదే తన నినాదమని, ఇప్పుడే ఈ క్షణంలోనే అమెరికాలో స్వర్ణయుగం ప్రారంభమైందని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికాను తిరిగి సంపన్నదేశంగా మారుస్తానన్నారు. అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ప్రసంగిస్తూ, తన నాయకత్వంలో అమెరికా ఘనంగా అభివృద్ధిచెంది, అంతర్జాతీయంగా ఎంతో గౌరవం సంపాదించుకుంటుందని భరోసా ఇచ్చారు. ప్రజలకు సంపదను, ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను తన పాలనలో ప్రసాదిస్తానన్నారు. దేశంలో శరవేగంగా మార్పులు తీసుకువస్తానన్నారు. లాస్ ఏంజెల్స్‌లో దావానలం బారిన పడిన ప్రజలు ఇంకెంతోకాలం ఇళ్ళు లేకుండా ఉండరని, వారికి అన్ని సదుపాయాలు సమకూరుస్తామని చెప్పారు. 2025 జనవరి 20వ తేదీ తాను ప్రమాణస్వీకారం చేసిన రోజును "విముక్తి దినోత్సవం"గా ఆయన హర్షధ్వానాలమధ్య తరువాయి 12లో

● నివాళి



ప్రపంచ దిశను మార్చిన

## వి.ఐ లెనిన్ శత వర్ధంతి

22-04-1870 – 21- 01-1924

జ్యూరిచ్ ఎయిర్ పోర్టులో

# రేవంత్, చంద్రబాబు భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్

దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులు హాజరయ్యారు. జ్యూరిచ్ చేరుకున్న ఎపి సిఎం చంద్రబాబు, మం త్రులు, అధికారుల బృందం, అదే ఎయిర్ పోర్టులో అప్పటికే అక్కడ ఉన్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు అక్కడి ప్రవాస తెలుగు ప్రజలు ఘనంగా తరువాయి 2లో



# మరణించే వరకూ జైలే

● ఆర్‌జి కర్ హత్యాచారం కేసులో సంజయ్‌రాయ్‌కు శిక్ష ఖరారు ● మృతురాలి కుటుంబానికి రూ.17 లక్షలు పరిహారం ● బెంగాల్ ప్రభుత్వానికి న్యాయమూర్తి ఆదేశం ● కోల్‌కతా హైకోర్టుకు వెళ్ళేందుకు దోషికి అనుమతి

**కోల్‌కతా :** ఆర్‌జి కర్ ప్రభుత్వ ఆసుపత్రిలో విధినిర్వహణలో ఉన్న వైద్యశిక్షణా విద్యార్థినిపై అత్యాచారం, హత్యలకు పాల్పడిన సంజయ్ రాయ్ మరణిం చేరేవరకూ చెరసాలలోనే ఉండాలని కోల్‌కతా న్యాయస్థానం తీర్పు చెప్పింది. సెషన్స్ కోర్టు ఇచ్చిన ఈ తీర్పుకు వ్యతిరేకంగా దోషికి కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించే హక్కు ఉందని, అవసరమైతే న్యాయసహాయం కూడా దోషికి లభిస్తుందని సంజయ్‌రాయ్‌కు న్యాయమూర్తి తెలియజేశారు. నేరస్థుడికి మరణశిక్ష విధించాలని న్యాయస్థానానికి సిబిఐ విజ్ఞప్తి చేసినప్పటికీ దోషికి యావజ్జీవశిక్ష పడింది. ఈ కేసు అత్యంత అరుదైన సంఘటనల పరిధిలోకి రాదని పేర్కొంటూ దోషికి మరణశిక్ష విధించకపోవడాన్ని న్యాయమూర్తి సమర్థించుకున్నారు. రాయ్‌కు రూ.50వేలు జరిమానా కూడా కోర్టు విధించింది. జరిమానా చెల్లించకపోతే ఐదు నెలలు అదనపు శిక్ష అనుభవించాలి. యావజ్జీవ కారాగారం (14 సంవత్సరాలు) తోపాటు సెక్షన్ 66 కింద మరణించే వరకూ చెరసాలలోనే ఉండేవిధంగా అదనపు శిక్ష విధించింది. దోషికి విధించిన శిక్షలన్నీ ఏకకాలంలోనే అనుభవించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు. హత్యాచారానికి గురైన వైద్య విద్యార్థిని కుటుంబానికి రూ.17 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని తరువాయి 2లో

ఆక్రమిత ప్రాంతాల నుండి

# ఇజ్రాయెల్ వైదొలగాలి



### సిపిఐ పునరుద్ఘాటన

### కాల్పుల విరమణ ఒప్పందంపై హర్షం

**న్యూఢిల్లీ :** గాజాలో యుద్ధ విరమణకు ఇజ్రాయెల్–హమాస్ సంస్థలమధ్య ఒప్పందం కుదరడంపట్ల భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) హర్షం ప్రకటించింది. సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. పాలస్తీనాలో అన్ని ఆక్రమిత భూభాగాల నుండి ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా ఖాళీచేసి వెళ్ళిపోవాలని సిపిఐ పునరుద్ఘాటించింది. గాజాలో ప్రస్తుత పరిస్థితి చేయిదాటిపోయినప్పటికీ ప్రస్తుతం కొనసాగుతున్న యుద్ధంలో చిక్కుకుని బలైపోతున్న అమాయకులైన సామాన్యప్రజల కష్టాలను తొలగించే దిశగా ఒప్పందం ప్రకారం చర్యలు తీసుకోవడం అనివార్యమైన విషయమని జాతీయ కార్యదర్శివర్గం పేర్కొంది. ఇజ్రాయెల్ అక్రమంగా వెస్ట్‌బ్యాంక్ ప్రాంత భూభాగాన్ని తరువాయి 2లో




# వేగంగా దోచేస్తున్నారు

"2024 నవంబర్‌లో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నిక తరువాత బిలియనీర్లకు మరింత అదృష్టం పట్టనుంది. ఆయన విధానాలు అసమానతలకు అగ్నికి ఆజ్యం పోసినట్లుగా మారబోతుంది - ఆక్స్‌ఫామ్"

● 2024లో మూడింతలైన ప్రపంచ బిలియనీర్ల సంపద ● 2ట్రిలియన్ డాలర్లకు చేరిక ● నాలుగు దశాబ్దాలుగా 360 కోట్ల మంది పేదరికంలోనే ● కొత్తగా 204 మంది బిలియనీర్లు ● తొలి పది మంది సంపాదన రోజుకు వంద మిలియన్‌లు ● ప్రపంచ అసమానతలపై 'ఆక్ఫ్‌ఫామ్' నివేదిక

ప్రపంచ శతకోటీశ్వరుల (బిలియనీర్ల) సంపద 2024లో శరవేగంగా పెరిగింది. క్రితం సారి (2023)కంటే గత ఏడాది వారి సంపద ఏకంగా మూడింతలు పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా వారానికి నలుగురు చొప్పున బిలియనీర్ల క్లబ్బులో 2024లో కొత్తగా 204 మంది చేరారు. ఆ ఏడాదిలో ఒక్కో బిలియనీర్ సగటున రోజుకు 2 మిలియన్ డాలర్‌లు సంపాదించారు. తొలి పది మంది బిలియనీర్ల సంపద 2024లో రోజుకు సగటున 100 మిలియన్ డాలర్లు వెనుకేసుకున్నారు. గత ఏడాది ఆక్స్‌ఫామ్ లెక్కల ప్రకారం ప్రపంచంలో తొలి ట్రిలియనీర్ (సహస్ర కోటీశ్వరుడు)ను చూసేందుకు దశాబ్దం పడుతుందని అంచనా వేసింది. అయితే 2024లో సంపాదించిన వేగాన్ని చూస్తే , దశాబ్ద కాలంలో ఐదుగురు ట్రిలియనీర్లను చూడబోతున్నామని జోశ్యం చెబుతోంది.

### సృష్టికర్తలు కాదు... స్వీకర్తలు

సాధారణంగా బిలియనీర్‌లను సంపద సృష్టికర్తలని పాలకులు ముద్దుగా, గౌరవంగా పిలుచుకుంటారు. కానీ వారు సంపద సృష్టికార్తలు కాదు.. స్వీకర్తలేనని ఆక్స్‌ఫామ్ స్పష్టం చేసింది. 'టేకర్స్... నాట్ మేకర్స్' పేరుతో 2024లో పేదరికం, నయా వలసవాదంపై నివేదికను సోమవారం విడుదల చేసింది. దీని ప్రకారం 2022–23లో 600 బిలియన్ డాలర్లుగా ఉన్న బిలియనీర్ల సంపద 2023–24లో ఏకంగా మూడింతలై 2ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ సంపదంతా తమ మేధస్సుతో పెంచుకున్నది కాదని, అందులో 60 శాతానికిపైగా వారసత్వంగా లేదా ఆశ్రితపక్షపాతం లేదా అవినీతి లేదా మార్కెట్ గుత్తాధిపత్యంతో వచ్చిందేనని ఆక్స్‌ఫామ్ తెలియజేసింది. ఒకవైపు బిలియనీర్లు ఆకాశమే హద్దుగా సంపాదిస్తుంటే, పేదల బతుకులు మాత్రం ఏమాత్రం మారడం లేదు. ప్రపంచ బ్యాంకు నివేదిక తరువాయి 2లో



ప్రియుడిని హత్య చేసిన కేసులో

# ప్రియురాలికి మరణశిక్ష

### కేరళలోని తిరువనంతపురం కోర్టు సంచలన తీర్పు

**న్యూఢిల్లీ :** ప్రియుడిని హత్య చేసిన కేసులో కేరళలోని తిరువనంతపురం న్యాయం స్థానం సంచలనతీర్పునిచ్చింది. 2022లో 23 ఏళ్ల రేడియాలజీ విద్యార్థి షారన్ రాజ్ హత్య కేసులో కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషిగా తేలిన షారన్ రాజ్ ప్రియురాలు గ్రీష్మకు న్యాయస్థానం మరణశిక్షను విధించింది. ఆమెకు సహకరించిన బంధువులకు మూడేళ్ల జైలు శిక్ష వేసింది.'షారన్‌కు గ్రీష్మ నమ్మక ద్రోహం తరువాయి 12లో

మరింత తొందరగా

# సమావేశమవ్వాలి

### కేంద్ర ప్రభుత్వాన్ని కెఎంఎం డిమాండ్

**చండీగఢ్ :** నిరసన తెలుపుతున్న రైతులతో ఫిబ్రవరి 14వ తేదీన సమావేశం కావాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించగా, ఆ సమావేశాన్ని మరింత త్వరంగా నిర్వహించాలని కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) డిమాండ్ చేసింది. అదే విధంగా ఆమరణ దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జిత్ సింగ్ డల్లేవాల్ తన దీక్షను విరమించాలని విజ్ఞప్తి చేసింది. గత 11 నెలల నుంచి ఖనౌరి, శంభు సరిహద్దు పాయింట్ల వద్ద నిరసన తెలుపుతున్న రైతులకు సంయుక్త కిసాన్ మోర్చాతో పాటు కెఎంఎం కూడా నాయకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈనెల 21వ తేదీన ఢిల్లీకి నిర్వహించిన తలపెట్టిన ర్యాలీని 26వ తేదీకి వాయిదా వేసింది. కాగా, సోమవారం శంభు ఆందోళన స్థలం వద్ద కెఎంఎం తరువాయి 12లో



# 32 ఖనిజ బ్లాకుల వేలం



### అందుకు కార్యాచరణను రూపొందిస్తున్నాం

### ఖనిజ నిక్షేపాలతో సమృద్ధిగా తెలంగాణ

### '3వ జాతీయ ఖనిజ మంత్రుల సమావేశం'లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం ఖనిజనిక్షేపాలతో సమృద్ధిగా ఉన్నదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.'2024–25, 2025( 26 సంవత్సరాల్లో లైమ్‌స్టోన్, మాంగనీస్ వంటి 32 పెద్ద ఖనిజ బ్లాకులను వేలం వేయాలని కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. ఖనిజాలు ఆర్థికాభివృద్ధి సమగ్ర వ్యూహంలో భాగస్వామ్యంగా ఉంటూ, దేశీయ పరిశ్రమను ప్రోత్సహించేందుకు, దిగుమతులపైన ఆధారపడడాన్ని తగ్గించేందుకు దోహదపడాలన్నారు. ఒడిషా రాష్ట్రంలోని కోణార్క్ లో సోమవారం జరిగిన '3వ జాతీయ ఖనిజ మంత్రుల సమావేశం'లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హాజరై, ప్రసంగించారు. 2015 నుండి ఇప్పటి వరకు రూ.5,537 కోట్లను తరువాయి 2లో

## మార్చి నుంచి నైని బ్లాక్ ద్వారా బొగ్గు ఉత్పత్తి

నైని బొగ్గు గనుల ద్వారా ఈ సంవత్సరం మార్చి నుంచి బొగ్గు ఉత్పత్తి చేస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఒరిస్సా రాష్ట్రంలోని కోణార్క్‌లో జరుగుతున్న మూడవ జాతీయ మైనింగ్ మంత్రుల సదస్సు సందర్భంగా తరువాయి 2లో





ఫార్ములా ఈ–కార్ రేస్ కేసు

# మరింత లోతుగా విచారణ

### సిద్ధమవుతున్న ఎసిబి, ఇడి అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఈ–కార్ రేస్ కేసులో మరింత లోతుగా వివరాలు సేకరించేందుకు నిందితులను మరోసారి విచారించేందుకు ఎసిబి, ఇడి అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ కేసులో ఎవరి పాపం ఎంత అనే విషయం రుడీ చేసుకునేందుకే మరోసారి విచారణకు పిలుస్తారని తెలిసింది. ఈ కేసులో ఇప్పటికే బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌తో పాటు ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్, హెచ్‌ఎండిఎ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్‌ఎన్‌రెడ్డితో తరువాయి 12లో

# తిరిగి ఇళ్ళకు చేరుకుంటున్న గాజా నిరాశ్రయులు

## ముగ్గురు మహిళా బందీలు,90 మంది ఖైదీల విడుదల






**రమల్లా :** గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి రావడంతో ఇళ్ళు వదలి పారిపోయిన నిరాశ్రయులు మెల్లిగా తిరిగి ఇళ్ళకు వెళ్ళడం ప్రారంభించారు. ఇంకోవైపు ఒప్పందం ప్రకారం మొదటి విడతగా ముగ్గురు మహిళా బందీలను హమాస్ ఉగ్రవాదులు విడుదల చేశారు. ఇందుకు బదులుగా 90 మంది పాలస్తినా ఖైదీలను ఇజ్రాయెల్ ప్రభుత్వం విడుదల చేసింది. ఇజ్రాయెల్‌లో గత ఏడాది అక్టోబరు 7న మ్యూజిక్ కాన్సెర్ట్ నుండి బందీచేసి హమాస్ తీసుకుపోయిన ముగ్గురు మహిళలు ఎమిలీ దమరి, రోమీ గోనెన్, డోరోన్ స్టెయిన్‌బ్రెచెర్‌లు ఇళ్ళకు తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు కేరింతలు కొట్టారు. మిగిలిన బందీలందరూ ఏమయ్యారని వారిపై ప్రజలు ప్రశ్నలవర్షం కురిపించారు. ఇంకా 100 మంది హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. ఒప్పందం ప్రకారం 33 మందిని మాత్రమే విడుదల చేసేందుకు హమాస్ అంగీకరించింది. అందుకు ప్రతిగా 2,000 మంది పాలస్తినా ఖైదీలను దశలవారీగా ఇజ్రాయెల్ విడుదల చేస్తుంది. ఇప్పటివరకూ 73 మందిని ఇజ్రాయెల్ విడుదల చేసింది. ఇజ్రాయెల్‌పై అనేకదాడులకు పాల్పడిన 230మంది పాలస్తీనియన్లకు జీవితకాలశిక్ష విధించింది. అదేవిధంగా గత 15 నెలల్లో గాజా నుండి 1000 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ సైన్యం అరెస్టు చేసింది. వీరందరినీ విడతలవారీగా విడుదల చేస్తారు. మరోవైపు నుండి గాజాలోకి మానవతా సహాయం, ఆహార సరఫరాలు ప్రారంభమయ్యాయి. రోజులు 600 ట్రక్కులలో ఇకమీదట ఆహార వస్తువులు, నీరు, ఇంధనం గాజాలోకి వస్తుంది. గాజాలో ఆకలికి అలమటిస్తున్న 10.10 లక్షలమంది పిల్లలను, పెద్దలను కాపాడేందుకు తక్షణం ఆహారం అవసరమని ఐక్యరాజ్యసమితి మానవతా సహాయ బృందాలు స్పష్టం చేశాయి. గాజాలో ప్రస్తుతం ఉంటున్న పిల్లలు, పెద్దలు రెండు రోజులకు ఒకసారి మాత్రమే ఆహారం తీసుకుంటున్నారు.



గడచిన మూడు నెలలుగా యుద్ధ వ్యూహంలో భాగంగా ఇజ్రాయెల్ సైన్యాలు ఉత్తర గాజాలోకి ఆహార సరఫరా జరగకుండా అడ్డుకున్నాయి. కానీ ఇప్పుడు ఆదివారం నుండీ ఆహార సరఫరా ట్రక్కులు రావడం ప్రారంభమైంది. కాగా యుద్ధంవల్ల గాజాలో 90 శాతం నివాసాలు ధ్వంసమయ్యాయి. 65 శాతం వ్యవసాయం నాశనమైంది. 80 శాతం వ్యాపారాలు నామరూపాలు లేకుండాపోయాయి. ఇదిలా ఉండగా ఎర్రసముద్రంలో ఇజ్రాయెల్‌కు చెందిన నౌకలపై మాత్రమే తమ దాడులు జరుగుతాయని యెమెన్ దేశంలో ఉన్న హౌతీ ఉగ్రవాదులు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారనాడు వారు ఈ–మెయిల్ సందేశం అందరకీ పంపారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం ప్రారంభమయ్యాక 100 వాణిజ్య నౌకలపై హౌతీ ఉగ్రవాదులు దాడులు చేశారు. రెండు నౌకలను ముంచేశారు. క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేశారు.

ప్రపంచం

# మహ్మద్‌ప్రవక్త అలా చెప్పలేదు బాలికలకు స్కూళ్ళు తెరవండి

## తాలిబన్ పాలకులకు డిప్యూటీ విదేశాంగమంత్రి విజ్ఞప్తి



**ఖోస్ట్ :** అఫ్గానిస్థాన్‌లో బాలికలకు హైస్కూళ్ళు తెరవాలని ఆ దేశ డిప్యూటీ విదేశాంగ శాఖా మంత్రి మహ్మద్ అబ్బాస్ స్టానెగ్జై తన తోటి తాలిబన్ ఉన్నత పాలకులకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అఫ్గానిస్థాన్‌లో 43 లక్షలకు పైగా జనాభా ఉన్నారనీ, వీరిలో సగానికి సగంమందిని విజ్ఞానార్జన చేయకుండా తాలిబన్ పాలకులు అడ్డుపడి అన్యాయం చేస్తున్నారని స్టానెగ్జై అన్నారు. బాలికలు, మహిళలను చదువులకు దూరం చేయాలని ఇస్లామిక్ షరియా చట్టంలో ఎక్కడా లేదని, ఈ చట్ట నిబంధనలకు విరుద్ధంగా తాలిబన్లు దేశంలో బాలికలకు విద్యను దూరం చేస్తున్నారని ఆయన అన్నారు. మహ్మద్ ప్రవక్త కాలంలో అటు పురుషులకు, ఇటు స్త్రీలకూ ఇద్దరికీ విజ్ఞాన ఆర్జనకు తలుపులు బార్లా తెరచే ఉండేవని ఆయన గుర్తుచేశారు. ఖోస్ట్‌లో జరిగిన ఇస్లామిక్ స్కూల్స్ (మదరసాలు) గ్రాడ్యుయేషన్ సెర్మనీలో మహ్మద్ అబ్బాస్ స్టానెగ్జై మాట్లాడుతూ, విద్యార్జన, జ్ఞానర్జన చేయడానికి స్త్రీ పురుష భేదం లేకుండా అందరికీ అవకాశాలు కల్పించాలని ఆయన ఆఫ్గానిస్థాన్ తాలిబన్ పాలకులకు విజ్ఞప్తి చేశారు. ''అందరికీ విద్యార్జనకు తలుపులు బార్లా తెరవాలని నేను ఇస్లామిక్ ఎమిరేట్ నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నా'' అని అన్నారు. 2021లో అమెరికా సైన్యాలు అఫ్గానిస్థాన్ నుండి వైదొలగడానికి ముందుగా దోహాలోని తాలిబన్ల రాజకీయ కార్యాలయంలో ఒక సంప్రదింపుల బృందానికి నాయకత్వం వహించి అమెరికా అధికారులతో చర్చలు జరిపిన పూర్వానుభవం స్టానెగ్జైకు ఉంది. దేశంలో స్కూళ్ళు మూసివేసి ఆడపిల్లలపై ఆంక్షలు విధించడంతో దేశంలో ప్రజలనుండి తీవ్ర వ్యతిరేకత తాలిబన్లకు ఎదురవుతున్నది. అదేవిధంగా అంతర్జాతీయంగా కూడా దేశాలు తాలిబన్లను ఏకాకులను చేశాయి. ఇస్లామిక్ చట్టాలకు, ఆఫ్గానిస్థాన్ సంస్కృతికి అనుగుణంగా తాము స్త్రీల హక్కులను గౌరవిస్తామని ప్రకటించిన తాలిబన్ పాలకుడు 2022లో స్కూళ్ళు మూసివేసి వారి హక్కులు హరించి మాట తప్పారు. తాలిబన్ల వైఖరిని అంతర్జాతీయస్థాయిలో అన్ని దేశాలూ తీవ్రంగా వ్యతిరేకించాయి.

# జైలు గదిలో ఏకాంతంగా ద.కొరియా మాజీ అధ్యక్షుడు యోల్



**సియోల్ :** దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ జైలు గదిలో ఆదివారంనాడు మొదటిరోజు ఏకాంతంగా గడిపినట్లు ఆ దేశ అధికారులు సోమవారం ప్రకటించారు. దేశంలో మార్షల్ లా విధించి తప్పుచేశారన్న ఆరోపణలపై దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను ఎట్టకేలకు అరెస్టుచేసి దర్యాప్తు అధికారులు విచారణ చేస్తున్నారు. ఆయన విచారణను కోర్టు సుదీర్ఘంగా పొడిగించడంతో ఆదివారంనాడు మొదటిరోజు జైలు గదిలో యూన్ ఏకాంతంగా గడిపారు. ప్రశ్నించి వివరాలు సేకరించేందుకు దర్యాప్తు అధికారులు అధ్యక్షుణ్ణి తమ కస్టడీలో ఉంచుకున్నారు. జైలు గదిలోకి పంపడానికి ముందుగా అధికారులు ఆయనను ఒక ఫొటో తీసి, వైద్య పరీక్షలు చేశారని జైలు అధికారి చెప్పారు. అనుమానిత నేరస్థుడు అనే ఆరోపణలపై ఆయనను జైలులో ఉంచినట్లు ఆ అధికారి చెప్పారు. ఈ విధంగా దక్షిణ కొరియా చరిత్రలో ఒక దేశాధ్యక్షుడు జైలుకు వెళ్ళడం ఇదే మొదటిసారి. 12 చదరపు మీటర్ల విస్తీర్ణం గల జైలు గదిని ఆయన అవసరాల నిమిత్తం ఆయనకు కేటాయించారు. సాధారణంగా అదే జైలు గదిలో ఆరుగురు నిందితులను ఉంచుతారు. ఆయనకు జైలు నిబంధనల ప్రకారం ఖాకీ దస్తులుతోపాటు ఒక సమచర ఖైదీని కూడా ఆయనతోపాటు ఉంచాల్సి ఉంది. ప్రస్తుతం ఆయన భోజనం చేయడానికి ఒక మీల్స్ , ఒక షింక్, ఒక టాయిలెట్ కేటాయించారు. తనపై దర్యాప్తు అక్రమమని, తన అరెస్టు కూడా న్యాయ విరుద్ధమని యోల్ వాదిస్తున్నారు. శనివారంనాడు కోర్టు వెలుపల వేలాదిమంది ఆయన అనుచరులు గుమిగూడి నిరసన ప్రదర్శన చేశారు. కోర్టు హాలులోకి దూసుకువెళ్ళి హింస సృష్టించారు.

# చైనాలో ఇద్దరికి ఉరిశిక్ష అమలు



**జుహై :** చైనాలో వేరు వేరు న్యాయస్థానాల తీర్పు మేరకు సోమవారంనాడు ఇద్దరు వ్యక్తులకు ఉరిశిక్షలు అమలు చేశారు. కారుతో బీభత్సం సృష్టించిన ఒక వృద్ధుడికి, కత్తితో పొడిచి పలువురిని చంపిన మరో వ్యక్తికీ కోర్టు తీర్పుల మేరకు ఉరిశిక్షలు అమలు చేశారు. వైన్ క్విన్ అనే 62 ఏళ్ళు వయసు గల వృద్ధుడు గత ఏడాది నవంబరు 11న జుహై నగరంలో ఒక స్పోర్ట్స్ కాంప్లెక్స్ వెలుపల ఎస్‌యువి వాహనాన్ని ఇష్టానుసారంగా నడిపి బీభత్సం సృష్టించాడు. ఈ ఘటనలో ఆనాడు 35 మంది మరణించారు. మరో 45 మంది తీవ్రంగా గాయపడ్డారు. అదేవిధంగా తూర్పు గ్జియాంగ్‌షు రాష్ట్రంలో ఒక వ్యక్తి కత్తితో దాడిచేసి ఎనిమిది మందిని హతమార్చాడు. మరో 17 మందిని గాయపరిచాడు. ఈ రెండు ఘటనలూ గత ఏడాది నవంబరునెలలోనే జరిగాయి. వైవాహికజీవితంలో అసంతృప్తి, విడాకులు రావడం, తద్వారా ఆస్తి ముక్కలైపోవడం వంటి ఘటనలతో తీవ్ర మనస్తాపంతో ఆందోళనకు గురైనా వైన్ క్విన్ తన వ్యక్తిగత ద్వేషాన్ని ఆగ్రహాన్ని, విసుగును కారు డ్రైవింగ్‌పై చూపించి బీభత్సం సృష్టించాడని కోర్టు విచారణ సందర్భంగా రుజువైంది. తానే నేరం చేశానని సదరు వృద్ధుడు కోర్టులో అంగీకరించాడు. కారుతో బీభత్సం సృష్టించిన అనంతరం ఆ వ్యక్తి తనను తాను కత్తితో అనేకచోట్ల పొడుచుకున్నాడు. పలుచోట్ల కత్తిగాయాలతో కోమాలో ఉన్న స్థితిలో ఆ వ్యక్తిని పోలీసులు ఆనాడు అరెస్టు చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు సోమవారంనాడు ఆ వ్యక్తికి ఉరిశిక్ష అమలు చేశారు. ఫాన్ వైక్వీ అనే ఒక వ్యక్తికి ఈ కేసులో విచారణ అనంతరం న్యాయస్థానం గత ఏడాది డిసెంబరునెలలో ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. ఈ ఉరి శిక్షను సోమవారం నాడు జుహై న్యాయస్థానం అమలు చేసినట్లు చైనా ప్రభుత్వ టీవీ సిసిటీవీ ప్రకటించింది. 2014 నుండీ చైనాలో ఈ విధంగా ట్రాఫిక్ ప్రాంతాలలో కారులతో బీభత్సం సృష్టించడం పలువురి మరణాలకు కారణం కావడం సర్వసాధారణంగా మారింది. ఎక్కువగా పాశ్చాత్య దేశాలలో ఇలాంటి ఘటనలు జరుగుతూ ఉంటాయి. ఐతే ఈ కకేసులో ఫాన్ వైక్వీ చేసిన చర్య మహా భయంకరంగా ఉందని, దీనివల్ల అనేక కుటుంబాలు నష్టపోయాయని న్యాయస్థానం తీర్పు సందర్భంగా ప్రకటించింది. అదేవిధంగా ఊక్సీ నగరంలోని ఒక వృత్తినైపుణ్య పాఠశాలపై దాడిచేసిన 21 ఏళ్ళు వయసుగల గ్జు జియాజిన్‌ను కూడా గడచిన డిసెంబరునెలలోనే ఉరి తీశారు.

## ఇజ్రాయెల్ వెదొలగాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆక్రమించిందనీ, తూర్పు జెరూసలెంను, సిరియాకు చెందిన గోలాన్ హైట్స్ ప్రాంతాలను ఆక్రమించిందనీ, ఈ భూభాగాల నుండి కూడా ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా ఖాళీచేసి వెళ్ళిపోవాలని సిపిఐ డిమాండ్ చేసింది. గాజాలో ప్రస్తుతం కొనసాగుతున్న మానవ విధ్వంసం, సామూహిక ఊచకోతలకుగాను ఇజ్రాయెల్‌ను జవాబుదారీగా ప్రపంచం ముందు నిలబెట్టాలని అంతర్జాతీయ సమాజానికి పార్టీ విజ్ఞప్తి చేసింది. పౌరులపై ఇష్టానుసారంగా దాడులు చేయడం, వారి ఇళ్ళను ధ్వంసం చేయడం, కీలకమైన పాలస్తినా నిర్మాణాలు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని నాశనం చేయడం వంటి చర్యలన్నీ మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాలుగానే పరిగణించాలని కోరింది. ఈ విషయంలో బాధితులకు న్యాయం జరగాలని, బాధిత కుటుంబాలకు పరరిహారాలు చెల్లించాలని, నేరస్థులకు శిక్షలు విధించాలని సిపిఐ డిమాండ్ చేసింది. పాలస్తినా–ఇజ్రాయెల్ రెండు దేశాల పరిష్కారం ఒక్కటే పశ్చిమ ఆసియా ప్రాంతంలో న్యాయమైన, దీర్ఘకాలిక శాంతికి ఉన్న ఏకైక మార్గమని భారత కమ్యూనిస్టుపార్టీ మొదటినుండీ చెబుతున్న దృఢమైన, నిస్సంకోచ వైఖరిని మరోసారి ఉద్ఘాటించింది. ఇజ్రాయెల్‌కు పొరుగునే తూర్పు జెరూసలెం రాజధానిగా శాంతి–భద్రతలతో కూడిన అవిచ్ఛిన్నమైన స్వతంత్ర, సార్వభౌమత్వ పాలస్తినా రాజ్య మనుగడను గుర్తించడం ఒక్కటే పరిష్కారమని పేర్కొంది. స్వయంనిర్ణయాధికారానికీ, స్వరాజ్య సాధనకు పాలస్తినా ప్రజలు చేస్తున్న హక్కుభుక్తమైన పోరాటానికి దృఢమైన సంఘీభావం ప్రకటించేందుకు భారత కమ్యూనిస్టుపార్టీ కట్టుబడి ఉందని పేర్కొంది.

## బొగ్గు ఉత్పత్తి

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం ఒరిస్సా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాంజీతో తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఓ లేఖను ఆయనకు అందజేశారు. ఒరిస్సా రాష్ట్రంలోని అంగూల్ జిల్లాలో నైని బొగ్గు గనిని స్థాపించేందుకు ఒడిస్సా సిఎం కార్యాలయం నుంచి అద్భుతమైన మద్దతు అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వ తరపున డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. గత ఏడాది జూలై 24న జరిగిన జరిపిన చర్చలు ఫలవంతం అయ్యాయని తెలిపారు. ''నైని క్యాప్టివ్ బ్లాక్ అయినందున బొగ్గు గని నుంచి ఉత్పత్తి చేసిన బొగ్గును తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని 800 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు సరఫరా చేయాలి. జైపూర్ విద్యుత్ ప్లాంట్ నైనీ గని నుంచి దాదాపు 1000 కిలోమీటర్ల దూరంలో ఉంది, లాజిస్టిక్స్‌లో చాలా ఇబ్బందులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సింగరేణి ఒడిశాలోని నైనా బొగ్గు గని సమీపంలో పిట్ హెడ్ ఓవర్ ప్లాంట్‌గా 1600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని భావిస్తోంది, దీని ద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గడంతో పాటు, ఉత్పత్తి అయిన బొగ్గు లాభదాయకంగా ఉపయోగించే అవకాశం ఉంటుందని భావిస్తున్నాం'' అని ఒరిస్సా సిఎంకు అందజేసిన డిప్యూటీ సిఎం తన లేఖలో తెలిపారు. 20వ ఎలక్ట్రికల్ పవర్ సర్వే (ఇపిఎస్) నివేదిక ప్రకారం రానున్న మూడు దశాబ్దాల పాటు థర్మల్ విద్యుత్‌కు భారీ డిమాండ్ ఉంటుంది. గత ఏడాది మే నెల 1వ తేదీన బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి రాసిన లేక ద్వారా గనులకు దగ్గరగా కొత్త థర్మల్ విద్యుత్ ప్లాంట్లను స్థాపించాల్సిన అవసరం ఉంది. రవాణా ఖర్చును తగ్గించడం, నాణ్యమైన విద్యుత్ సరఫరా, పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి అంశాల నేపథ్యంలో గని నుంచి విద్యుత్తు ఉత్పత్తి లాభదాయకంగా ఉంటుంది'' అని డిప్యూటీ సిఎం లేఖలో వివరించారు. సింగరేణి అధికారుల బృందం, ఒడిస్సా అధికారుల బృందంతో జరిగిన చర్చల్లో భాగంగా జరపాడ, తుకుడ, హండప్ప, బని నాలిని సైట్లు రెండు రాష్ట్రాలకు చాలా ప్రయోజనకరమైనవి, ఇవి ఉపాధి అవకాశాలను సృష్టించడంతోపాటు సానుకూల మౌలిక సదుపాయాల అభివృద్ధిని అందిస్తాయని డిప్యూటీ సిఎం లేఖలో పేర్కొన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని నైని బొగ్గు గని సమీపంలో సింగరేణి ఆధ్వర్యంలో 1600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టును స్థాపించడానికి తగిన భూమిని కేటాయించేందుకు, ఏర్పాట్లు చేసేందుకుకు సంబంధిత అధికారులను ఆదేశించాలని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క తన లేఖలో కోరారు.

## చంద్రబాబు భేటీ

(మొదటి పేజీ తరువాయి)

స్వాగతం పలికారు. తెలుగు రాష్ట్రాల ఇద్దరు సిఎంలు, మంత్రులు ఒకే చోట కలిసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వివిధ పెట్టుబడులపై ఇద్దరు ముఖ్యమంత్రులు కాసేపు చర్చించుకున్నారు. చిత్రంలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, ఎపి సిఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, శ్రీధర్ బాబు, కేంద్ర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు ఉన్నారు. మంత్రి శ్రీధర్ బాబు భుజంపై చేతులేసి, చంద్రబాబు షేక్ హ్యాండ్ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాలకు పెట్టుబడులపై లక్ష్యంగా తెలంగాణ, ఎపి రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారుల బృందం దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైంది. ఈనెల 23 వరకు రేవంత్ రెడ్డి దావోస్‌లో పర్యటించనున్నారు. దేశ, విదేశాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తలతో తెలంగాణ రైజింగ్ బృందం చర్చించనుంది. సోమవారం పెట్టుబడిదారులతో చంద్రబాబు బృందం సమావేశం కానుంది.

## అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

### హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందని హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియని, చివరి లబ్ధిదారుని వరకు అందిస్తామని తెలిపారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం మంత్రి డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి హైదరాబాద్ నగర పరిధిలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే పురోగతిపై జిహెచ్‌ఎంసి కమిషనర్ కె. ఇలంబర్తి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రేషనింగ్ అధికారి జిల్లా సరఫరా అధికారికి జోనల్ కమిషనర్లు, ఆయా ఉన్నతాధికారులతో సమీక్షించి, దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరామ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామన్నారు. ఇంటి స్థలం ఉన్న వారితో పాటు ఇంటి స్థలం లేని వారికి ఇందిరామ్మ ఇళ్లు అందించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రేషన్ కార్డులకు ఇప్పటి వరకు దరఖాస్తు చేయనివారు వార్డు సభలలో దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. వార్డు సభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు గతంలో ప్రజాపాలన సేవా కేంద్రాలలో వచ్చిన దరఖాస్తులను, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులను ఇవ్వడం జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రేషన్ కార్డుల మంజూరికిగాను దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు స్పష్టంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, వెంకన్న, ఉపేందర్ రెడ్డి, ఎన్. రవికిరణ్, అదనపు కమిషనర్ అలివేలు మంగ తాయారు, శివ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా దోచేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం 1990లో ప్రపంచవ్యాప్తంగా ఎంత మంది పేదలు ఉన్నారో, నాలుగు దశాబ్దాల తరువాత ఇప్పటికీ ఆ సంఖ్య మారలేదని ఆక్స్‌ఫామ్ వెల్లడించింది. నాడు 360 కోట్ల మంది దారిద్ర్య రేఖ దిగువన ఉండగా, ఇప్పటికే రమారమి అదే సంఖ్యలో ఉన్నారు. అంటే జనాభాలో పేదలు 44 శాతం మంది ఉన్నారు. అదే సమయంలో ఒక్క శాతం ధనికుల చేతుల్లో 45శాతం సంపద పోగుపడి ఉంది. ప్రపంచ వ్యాప్తంగా పేదలు బహుళ సంక్షోభాలు ఏదుర్కొంటుందని నివేదిక పేర్కొంది. తిరిగి చెల్లించని అప్పులు, తక్కువ వేతనాలు, అధిక ఆహార ధరలతో కొవిడ్ మహమ్మారి గాయాలు ఇప్పటికీ మానలేదని, వందల కోట్ల మంది జీవనం కోసం నిత్య సంఘర్షణ చేస్తున్నారని వ్యాఖ్యానించింది.

**దక్షిణ భూగోళాన్ని దోచేస్తున్న ఉత్తరం**

వలసవాద రోజుల్లోనే కాదు.. ఇప్పటికీ దక్షిణ భూగోళ సంపదను ఉత్తర భూగోళ వాసులు తరలించుకుపోతున్నారు. ఉత్తర భూగోళానికి చెందిన ఒక్క శాతం ఐశ్వర్యవంతులు గంటకు 30 బిలియన్ డాలర్ల చొప్పున ఏడాది కాలంలో దక్షిణ భూగోళం నుంచి 263 బిలియన్ డాలర్లు సంపాదించారని ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది. వారిలో 68 శాతం మంది ఉత్తర భూగోళంలోనే నివసిస్తుండడం విశేషం. కాగా, ఉత్తర భూగోళంలో ఐదో వంతు ప్రపంచ జనాభానే ఉంటుంది. ఇదంతా కూడా నయా వలసవాదాన్ని సూచిస్తుందని ఆక్స్‌ఫామ్ పేర్కొంది.

**బ్రిటీషర్‌ల చేతుల్లో భారతీయుల సంపద**

1765 నుంచి 1900 మధ్య భారత నుంచి బ్రిటీషర్‌లుదోపిడీ చేసిన సంపద ప్రస్తుత లెక్కల ప్రకారం సుమారు 65 ట్రిలియన్ డాలర్లు అని, అందులో పది మంది యుకె ధనికుల చేతుల్లో 33.8 ట్రిలియన్‌ల భారత సంపద ఉన్నదని ఆక్స్‌ఫామ్ వెల్లడించింది. ఆ మొత్తాన్ని లండన్ వీధుల్లో 50 పౌండ్ల నోట్లతో పరిస్తే, నాలుగుసార్లు ఆ నగరమంతా పరచవచ్చని పేర్కొంది.

## మరణించే వరకూ జైలే

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ''శిక్షణపొందుతున్న వైద్యురాలు ప్రభుత్వ పని ప్రదేశంలో మరణించినందువల్ల ప్రభుత్వమే మృతురాలి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని న్యాయమూర్తి దాస్ స్పష్టం చేశారు. ఇందులో అత్యాచారానికిగాను రూ.7 లక్షలు, మరణం పొందినందుకుగాను రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరింది.

దోషి తుది ప్రకటనలను, అతడి తరపు న్యాయవాది వాదనలను , మృతురాలి కుటుంబం తరపు న్యాయవాది వాదనలు , సిబిఐ వాదనలు ఆసాంతం విన్న తర్వాత న్యాయమూర్తి ఈ శిక్ష ఖరారు చేశారు. అంతకుముందు దోషి సంజయ్ రాయ్ న్యాయమూర్తికి తన గోడు విన్నవించారు. ''తనను ఈ కేసులో ఇరికించారనీ, తాను నేరం చేయలేదని, తప్పుగా తనను నేరస్థుడుగా నిర్ధారించారనీ సంజయ్‌రాయ్ వాదించారు. ''నన్ను ఈ కేసులో ఇరికించారు, నేను ఏ నేరం చేయలేదు, నేను ఏమీ చేయలేదు, ఐనాగానీ నన్ను ఇప్పటికీ నేరస్థుడుగానే చూస్తున్నారు'' అని కోర్టుకు తొలుత చెప్పారు. దోషికి అంతిమశిక్షగా మరణదండన విధించాలని సిబిఐ వాదించింది. ఈ ఘటన చాలా అరుదైన వాటిల్లో ఎంతో అరుదైన ఘటన అని మృతురాలి కుటుంబం తరపు న్యాయవాది వాదించారు. కోల్‌కతా ఆర్.జి.కార్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రి ఔట్‌పోస్టులో పోలీస్ విధులు నిర్వహించే సివిల్ వాలంటీర్ సంజయ్‌రాయ్‌ను ఈ కేసులో జనవరి 18న దోషిగా నిర్ధారించిన సీల్దా అదనపు జిల్లా–సెషన్స్ న్యాయమూర్తి అనిర్బన్ దాస్ సోమవారంనాడు శిక్ష ఖరారు చేశారు. సంజయ్ రాయ్ 2023 ఆగస్టు 9వ తేదీన విధినిర్వహణలో ఉన్న పోస్టు గ్రాడ్యుయేట్ వైద్యశిక్షణా విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె మెడకు ఉచ్చు బిగించి చంపాడు. ఇంతటి దారుణమైన నేరం జరగడంతో పశ్చిమ బెంగాల్‌లో విద్యార్థులు వేలాదిమంది వీధుల్లోకి వచ్చి సుదీర్ఘపోరాటం చేశారు. ఈ ఘటనతో జాతీయస్థాయిలో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది.

**పోరాటం కొనసాగిస్తాం**

ఆర్.జి.కార్ ఆసుపత్రిలో జరిగిన అత్యాచారం, హత్యకేసు అరుదైన కేసుల్లో అరుదైనది కాదని న్యాయమూర్తి చెప్పి తన తీర్పును సమర్థించుకోవడంపట్ల మృతురాలి తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ''ఇది అరుదైన కేసులో ఎందుకు అరుదైన కేసు కాదు?'' అని వారు ప్రశ్నించారు. ఈ తీర్పుపట్ల తాము తీవ్ర దిగ్భ్రాంతి చెందామన్నారు. తమకు ఎలాంటి నష్టపరిహారం అవసరం లేదని, న్యాయం కావాలని మృతురాలి తండ్రి అన్నారు. న్యాయంకోసం పై కోర్టును ఆశ్రయిస్తామని, చివరి వరకూ పోరాడతామని తల్లిదండ్రులు చెప్పారు. ఈ కేసులో అంతిమ స్థాయి శిక్ష మరణదండనను దోషికి విధించాల్సి ఉందని వారు పేర్కొన్నారు. న్యాయస్థానం ప్రకటించిన నష్టపరిహారంపట్ల కూడా వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏదో తూతూ మంత్రంగా దర్యాప్తు చేశారని, హృదయపూర్వకంగా సర్వశక్తులూ ఒడ్డి చిత్తశుద్ధితో ఈ కేసును దర్యాప్తు చేయలేదని మృతురాలి తల్లిదండ్రులు విమర్శించారు. విధినిర్వహణలో ఉన్న వైద్యవిద్యార్థినిని రేప్ చేసి క్రూరంగా హత్యచేస్తే ఈ కేసు ఎందుకు అరుదైన వాటిల్లో అరుదైన కేసు కాకుండా పోతుందని ప్రశ్నించారు. తాము పోరాటం కొనసాగిస్తామన్నారు.

**పోలీసులు దర్యాప్తుచేస్తే మరణశిక్ష పడేది: మమత**

సంజయ్ రాయ్ కేసులో న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపట్ల పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేసును పశ్చిమ బెంగాల్ పోలీసులు దర్యాప్తు చేసి ఉంటే దోషికి ఖచ్చితంగా మరణశిక్ష పడి ఉండేదని, సిబిఐకి ఈ కేసు దర్యాప్తు అప్పగించారని ఆమె విమర్శించారు. మొదట ఈ కేసును బెంగాల్ పోలీసులే చేపట్టారు. అత్యాచారం, హత్య చేసిన నేరానికి పాల్పడినందుకుగాను భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) చట్టంలోని సెక్షన్ 64 (అత్యాచారం), సెక్షన్ 66 (హత్యచేసినందుకు శిక్ష), 103 (1) (హత్య) కింద సంజయ్‌రాయ్‌పై కోల్‌కతా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత ఈ కేసును న్యాయస్థానం సిబిఐకి స్వాధీనం చేసింది. సిబిఐ ఈ కేసును చిత్తశుద్ధితో దర్యాప్తు చేయలేదని తల్లిదండ్రులు కూడా విమర్శించారు. సంజయ్‌రాయ్‌కు మరణశిక్ష పడాలని దేశం అంతా కోరుకుందని ఆమె అన్నారు. కానీ కోర్టు అతడికి మరణించేవరకూ చెరసాల శిక్ష విధించిందని విమర్శించారు. ఈ కేసును బలవంతంగా తమ పోలీసుల దగ్గర నుండి సిబిఐ లాక్కుందని మమతా బెనర్జీ విమర్శించారు. ఈ కేసు దర్యాప్తు బాధ్యత బెంగాల్ పోలీసుల చేతుల్లో ఉండి ఉంటే ఖచ్చితంగా మరణశిక్ష పడేదన్నారు. కాగా బిజెపి ఈ కేసులో ఆనాటి కోల్‌కతా పోలీస్ కమిషనర్ పాత్రను తప్పుపట్టింది. మమతాబెనర్జీ కూడా ఈ కేసులో సాక్ష్యాలను మాయం చేశారని బిజెపి ఐటి విభాగం అధిపతి అమిత మాల్వియా విమర్శించారు.

## 32 ఖనిజ బ్లాకుల వేలం

(మొదటి పేజీ తరువాయి)

వసూలు చేశామని, ఈ నిధిని ప్రభుత్వ పాఠశాలలతో పాటు పలు ప్రాధాన్యత రంగాల్లో వినియోగిస్తున్నామని వివరించారు. తెలంగాణలో లైమ్ స్టోన్, ఐరన్ ఓర్, మాంగనీసు, క్వార్డజ్, గ్రానైట్, రోడ్డు మెటల్, డోలమైట్ తదితర పెద్ద, చిన్న ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని, రాష్ట్రంలో 2014లో ఖనిజ ఆదాయం రూ.1,958 కోట్ల ఉండగా 2023–24 నాటికి రూ.5,540 కోట్లకు పెరిగిందని తెలిపారు. భారతదేశంలో ఖనిజ రంగం అనేది ఎంతో ప్రత్యేకమని, ఈ రంగంలో అనేక అవకాశాలను మన ముంగిట్లోకి తీసుకొస్తుందన్నారు. ఖనిజాలు అనేవి విలువైన ప్రకృతి సంపదలు అని, అవి ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ముడిసరుకుగా ఉంటాయని, ఖనిజాల అన్వేషణ, అకర్షణ, నిర్వహణ అనేవి జాతీయ, రాష్ట్ర లక్ష్యాల ప్రకారం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఆచార్య కౌటిల్యుడు, క్రీస్తు పూర్వం 4వ శతాబ్దంలో, తన అర్థశాస్త్రంలో, ఖనిజ సంపదలు దేశం యొక్క శక్తి, శౌర్యాన్ని సూచిస్తాయి అని పేర్కొన్న విషయాన్ని సమావేశంలో ప్రస్తావించారు. ఖనిజాలు అనేవి మన రోజువారీ జీవితంలో ప్రధాన ,అవసరమైన ముడిసరుకులుగా ఉంటూ, ఆర్థిక, సామాజిక, సాంకేతిక అభివృద్ధికి కీలకంగా నిలుస్తాయన్నారు. రాష్ట్రంలో మొత్తం 2,552 మైనింగ్, ఖనిజ గనుల లీజులు ఉన్నాయని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో నది తీరంలోని మట్టి/మెట్ట ఖనిజాల కోసం ప్రత్యేకమైన విధానాన్ని రూపొందించిన విషయాన్ని భట్టి వివరించారు. పర్యావరణ, ఇతర నియమ నిబంధనలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ అనుమతితో ఇసుకను తవ్వడం, ప్రజలకు పారదర్శకంగా,ఆన్‌లైన్‌లో అందుబాటులో పెట్టామన్నారు. 2024లో సూర్యాపేట జిల్లాలో లైమ్‌స్టోన్‌బ్లాక్లను వేలం వేసి విజయవంతమైన బిడ్డర్లకు పత్రాలను జారీ చేసినట్టు తెలిపారు. చిన్న ఖనిజాల లీజుల మంజూరు విషయంలో, అవసరమైన అనుమతులతో కూడిన బ్లాక్‌ల వేలం విధానాన్ని రాష్ట్రం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఖనిజ వనరుల ఆడిట్ కోసం డిజిపిఎస్ సర్వే,ఇటిఎస్ సర్వే పూర్తయ్యాయని వివరించారు. ఒఎంఇపిపిఎస్ ద్వారా ఆన్‌లైన్ మినరల్ ఈపేమెంట్ ,ఈ పర్మిట్ వ్యవస్థ గత పదేళ్లుగా అమలవుతోందన్నారు. ప్రభుత్వం నిర్మాణ పనుల్లో ఉపయోగించే రోడ్ మెటల్ వంటి ఖనిజాల కోసం జిరో పర్మిట్ విధానం గత సంవత్సరం నుంచి అమలు జరుగుతున్నట్టు వివరించారు.అపిల్ అప్లికేషన్లను ఆన్‌లైన్‌లో ప్రాసెస్ చేయడం, త్వరితగతంగా పరిష్కరించడం కూడా గత సంవత్సరం నుంచే అమలు చేస్తున్నామన్నారు.ఈ సమావేశం ఖనిజ సంపదల అన్వేషణ, వినియోగం, అభివృద్ధి, ఖనిజ రంగంలో దేశ వ్యాప్తంగా ప్రగతి సాధించడంలో కీలకంగా ఉంటుందని భావిస్తున్నామని భట్టి విక్రమార్క అన్నారు.

ప్రజాపక్షం
మంగళవారం, జనవరి 21

# గాజాలో 'శాంతి' అంకురం

పాలస్తీనియన్ తీవ్రవాదుల గ్రూపు హమస్–ఇజ్రాయెల్ మధ్య అంతర్జాతీయ ఒత్తిడివల్ల కుదిరిన మూడు దశల కాల్పుల విరమణ ఒప్పందంలో తొలిదశ అమలు ఆదివారం ప్రారంభం కావటంతో శాంతి పునరుద్ధరణకు అంకురార్పణ జరిగింది. ఒప్పందం అమలులో భాగంగా తాము తొలిరోజు విడుదల చేయాల్సిన ముగ్గురు బందీల పేర్లను అందజేయటంలో హమస్ మూడుగంటలు ఆలస్యంచేయగా, ఆ సమయంలో యూదు జాత్యహంకార ఇజ్రాయెల్ విమానాలు బాంబులు వేసిన దురహంకార పూరిత ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోవటం ఈ ఒప్పందం ఎంత సున్నితమైందో, ఎన్ని అవరోధాలతో కూడినదో తెలియజేస్తున్నది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా ఒత్తిడిపై ఈ ఒప్పందాన్ని అంగీకరించి నందుకు నిరసనగా మితవాదుల్లో కెల్లా మితవాది, జాతీయ భద్రత (రక్షణ)మంత్రి ఇటామర్ బెన్‌జివిర్, ఆయన నేషనలిస్ట్ – రెలిజియస్ పార్టీకి చెందిన మరో ఇద్దరు మంత్రులు సంకీర్ణ మంత్రివర్గం నుంచి వైదొలిగారు. అయితే నెతన్యాహు ప్రభుత్వానికి ప్రస్తుతానికి ప్రమాదం లేదు. కాగా ఆర్థికమంత్రి బెజావెల్ స్మోట్రిచ్ రాజీనామా చేయలేదుగాని,'గాజాలో తమ లక్ష్యాలు సాధించకముందే యుద్ధం పూర్తి విరమణకు అంగీకరించే పక్షంలో తాను, తన రెలిజియస్ జియొనిజం పార్టీ సంకీర్ణ ప్రభుత్వం నుంచి వైదొలుగుతుందని'' ప్రకటించారు. కాబట్టి పూర్తిగా యుద్ధవిరమణ లక్ష్యసాధనకోసం శాంతిస్థాపనకై – సంవత్సరంపైగా చర్చలద్వారా ప్రస్తుత ఒప్పందాన్ని సాధ్యం చేసిన అమెరికా, కటార్, ఈజిప్టు ఎంతో శ్రమించాల్సి ఉంటుంది.

> గాజా ఆక్రమిత ప్రాంతాలనుంచి ఇజ్రాయెల్ సంపూర్ణ ఉపసంహరణ, ఆహారం, పునరావాసాలకు అంతర్జాతీయ సహాయం అత్యవసరం.

మూడు దశల్లో అమలు జరగాల్సిన కాల్పుల విరమణ ఒప్పందానికున్న సమయం 42 రోజులు. తొలిదశలో హమస్ 33మంది 'బందీ'లను విడుదల చేయాలి, ఇజ్రాయెల్ 1000 మంది పాలస్తీనియన్ 'ఖైదీలను' విడు ద ల చేయాలి. రెండవదశలో రెండు వైరిపక్షాలు మరింత మంది బందీలు, ఖైదీలను విడుదల చేసి కాల్పులకు శాశ్వత ముగింపును ప్రకటించాలి. 'తర్వాత ఏమిటన్న' దానిపై మూడవదశలో చర్చలు ప్రారంభం కావాలి. ఇది మరీ క్లిష్టమైన, కష్టమైన దశ. గాజా ఏలుబడి బాధ్యత ఎవరి చేతిలో ఉండాలనేది కూడా చర్చనీయాంశం. ఇజ్రాయెల్ గాజాపై యుద్ధం ఆరంభించినపుడు రెండు లక్ష్యాలు ప్రకటించింది – హమస్‌ను నాశనం చేయటం, బందీలను విడిపించుకోవటం. గడచిన 15మాసాల్లో అది హమస్‌ను కొంత దెబ్బతీయగలిగింది. కాని ఆ సంస్థ మనుగడ సాగిస్తున్నది, కొత్త రిక్రూట్‌మెంట్లు చేసుకుంది. గాజా ఆక్రమిత ప్రాంతాలనుంచి ఇజ్రాయెల్ సంపూర్ణ ఉపసంహరణ, ఆహారం, పునరావాసాలకు అంతర్జాతీయ సహాయం అత్యవసరం.

అయితే 15 మాసాలుగా వేలమంది ఆప్తులను కోల్పోయి, నివాసాలు, స్కూళ్లు, ఆసుపత్రులు ధ్వంసమై అరచేతిలో ప్రాణాలు బిగబట్టుకుని జీవిస్తున్న గాజా వాసులకు, వలసపోయిన లక్షలాదిమందికి ఈ కాల్పుల విరమణ పెద్ద ఊరట. కాల్పుల విరమణ ఒప్పందం ప్రకటించగానే వేలాదిమంది ఆనందంతో వీధుల్లోకి రావటం, ప్రవాసుల్లో కొందరు పెట్టిబేడా సర్దుకుని తమ శిథిల ఆవాసాలను వెదుక్కునేందుకు తిరుగు ప్రయాణం కావటం వారు పొందిన ఉపశమనానికి నిదర్శనం. డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షునిగా ప్రమాణస్వీకారం చేసేలోపు కాల్పుల విరమణకై ఇజ్రాయెల్‌పై తెచ్చిన ఒత్తిడివల్ల ఈ ఒప్పందం జరిగి ఉండవచ్చు. అయితే ఇది యుద్ధం ముగింపు, పశ్చిమాసియాలో శాశ్వత శాంతి స్థాపనకు నాంది కాదు. పశ్చిమాసియా వెన్నెముకలో బాకులా ఆవిర్భవించిన ఇజ్రాయెల్ ఏకుమేకైనట్లు అరబ్ భూభాగాలను ఆక్రమించుకుని తన రాజ్యాన్ని విస్తరించుకుంది. పాలస్తీనీయులను పదుల లక్షల సంఖ్యలో పాలద్రోలి వారికి మాతృదేశం లేకుండా చేసింది. ఇదంతా అమెరికా అండదండలు, ఆయుధ సరఫరావల్లే సాధ్యమైంది. ఒకనాడు ఇజ్రాయెల్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన అరబ్ రాజ్యాలు కూడా టెల్ అవీవ్‌తో సహజీవనానికి, రెండు రాజ్యాల గుర్తింపుతో పాలస్తీనా సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని బలపరుస్తున్నాయి. కాబట్టి పాలస్తీనా అడ్మినిస్ట్రేటివ్ ప్రాంతాలను ఏకం చేయటం, రెండు స్వతంత్ర రాజ్యాలను పరస్పర గుర్తింపుతో నెలకొల్పటం ఒక్కటే శాశ్వత శాంతికి పరిష్కారం. ట్రంప్ ఆ దిశగా కృషిచేస్తే ప్రపంచం హర్షిస్తుంది.

## కాన్పూర్ మహాసభ అధ్యక్షుడు, సిపిఐ తొలి చైర్మన్

# మైలాపురం సింగారవేలు చెట్టియార్



మైలాపురం సింగారవేలు చెట్టియార్ 1860 ఫిబ్రవరి 18న మద్రాసులో జన్మించారు. ఎం. సింగారవేలు, సింగారవేలార్‌గా ఆయన్ను ఎక్కువగా పిలుస్తారు. దక్షిణభారతదేశంలో తొలి కమ్యూనిస్టుగా చరిత్రపుటలకెక్కారు. ఆయన సంపన్న మత్స్యకార కుటుంబానికి చెందినవారు. ఆయన తండ్రి వేంకటాచల చెట్టియార్, తల్లి వల్లియమ్మాయి. ట్రిప్లికేన్‌లోని హిందూ హైస్కూల్లో ప్రాథమిక విద్య. మద్రాసు క్రిష్టియన్ కాలేజీ, ఆ తర్వాత ప్రెసిడెన్సీ కాలేజీనుండి ఎఫ్ఎ, 1894 లో మద్రాసు యూనివర్శిటీనుంచి బిఎ పట్టా పొందారు. మద్రాసు హైకోర్టులో లాయర్‌గా ప్రసిద్ధి పొందారు. 1889 లో అంగమ్మాళ్‌ను వివాహమాడారు. ఆయన మేనకోడలు కుమార్తె సీత 1939లో ప్రసిద్ధ మీరట్ కుట్రకేసు ఖైదీల్లో ఒకరైన ఫిలిప్ స్ప్రాట్‌ను వివాహమాడారు.

సింగారవేలు 1900 సంవత్సరంలో మద్రాసులో దక్షిణ భారత బౌద్ధ సమాజాన్ని ఏర్పాటు చేశారు. అనేక ఇతర సామాజిక సంస్థలతోనూ ఆయనకు సంబంధం ఉంది. ఆయన పుస్తకాల పురుగు. లండన్, న్యూయార్క్ తదితర ప్రదేశాల నుంచి పుదుచ్చేరి గుండా పుస్తకాలు తెప్పించేవాడు.

ఆ సమయానికి సింగారవేలుకు కాంగ్రెస్ రాడికల్ నాయకులు సుప్రసిద్ధ కవి సుబ్రమణ్య భారతి, కార్మిక నాయకుడు చక్కరాయ్ చెట్టియార్, విఒ చిదంబరం పిళ్లయ్ (విఒసి) తదితరులతో సంబంధం ఏర్పడింది. వారు సూరత్ కాంగ్రెస్ సభ (1907)కు హాజరైనారు, బాలగంగాధర్ తిలక్ అనుయాయులు.

కార్మికవర్గ ఉద్యమంకూడా ఉధృతమవుతున్నది. టుటికోరన్‌లోని బ్రిటిష్‌వారి కోరల్ మిల్లు కార్మికులు సమ్మె చేశారు. సుబ్రమణ్య భారతి మద్రాసు నుండి 'ఇండియా' అనే తమిళ పత్రిక ప్రారంభించారు. ప్రసిద్ధ విప్లవకారుడు ఎంపిజిటి ఆచార్య కూడా దానితో సంబంధం పెట్టుకున్నారు. 1919 ఏప్రిల్‌లో లెనిన్‌ను కలుసుకున్న బహుకొద్ది మందిలో ఆచార్య వున్నారు. ఈ సంబంధాల ద్వారా సింగారవేలు కార్మికోద్యమంలోకి వచ్చారు.

1918లో భారతదేశంలో తొలి ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేసిన ఖ్యాతి సింగారవేలుకు దక్కింది. అది బ్రిటిష్‌వారి యాజమాన్యంలోని బకింగ్ హాం కర్నాటక్ మిల్స్‌లో మద్రాసు లేబర్ యూనియన్. ఆయన, టివి కళ్యాణ సుందరం మొదలియార్ (తిరు వి.క.) తదితరులతో కలిసి ఎంఎస్ఎం వర్కర్స్ యూనియన్, ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్, ట్రాంవే వర్కర్స్ యూనియన్, పెట్రోలియం ఎంప్లాయీస్ యూనియన్, ప్రింటింగ్ వర్కర్స్ యూనియన్, అల్యూమినియం వర్కర్స్ యూనియన్, కోయంబత్తూరు వర్కర్స్ యూనియన్, మదురై వర్కర్స్ యూనియన్ వగైరా స్థాపించారు.

1919లో మద్రాసులో బహిరంగసభ జరిపి జలియన్ వాలాబాగ్ కాల్పులను ఖండించారు. సింగారవేలు, తిరు వి.క., చక్కరాయ్, సుబ్రమణ్య శివ తదితరులు నాయకత్వం వహించి బహిరంగ సభలో ప్రసంగించారు.

సింగారవేలు 1922లో కాంగ్రెస్ గయ సభకు హాజరైనారు, ఎఐసిసి సభ్యుడిగా ఎన్నికైనారు. ఆ సమావేశంలో ఆయన ఎస్ఎ. డాంగే ను కలుసుకున్నారు. సింగారవేలు ఆ సభలో కమ్యూనిస్టులాగా ప్రసంగించారు, కమ్యూనిస్టులు నెలకొల్పిన నూతన సామాజిక వ్యవస్థకు ప్రతినిధిగా తనను తాను ప్రకటించుకున్నారు. ఎంఎన్‌రాయ్ ఇందుకు ఆయన్ను అభినందిస్తూ తన 'వ్యాన్‌గార్డ్' (మార్చి 1, 1923, బెర్లిన్) పత్రికలో రాశారు. 'తాష్కెంట్ పార్టీ', ఇసిసిఐ(ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్) ఆయనతో సంబంధం ఏర్పరుచుకునేందుకు ప్రయత్నించినట్లు డాంగే రాశారు. సింగారవేలు తదితరులతో డాంగే సంబంధం నెలకొల్పుకోవాల్సి వుంది. ఎంఎన్‌రాయ్, అబనీ ముఖర్జీ ఆయనతో సంబంధం కలిగి ఉన్నారు. ఆయన్ను కలుసుకోవటానికి ముఖర్జీ మద్రాసు వస్తుండేవారు.

**మద్రాసులో 1923లో మేడే ఎర్రజెండా రెపరెపలు:** ఎం.సింగారవేలు చొరవతో భారతదేశంలో తొలిసారి మే దినోత్సవం 1923లో మద్రాసులో జరిగింది. లేబర్ కిసాన్ పార్టీ ఏర్పాటు ఆ రోజున ప్రకటించబడింది. మే డే జరపాల్సిందిగా ఝూరియాకు చెందిన దీనానంద్ ను కూడా ఆయన కోరారు.




మేడే రోజున మద్రాసు బీచ్‌లో రెండు సభలు జరిగాయి ఒకటి, సింగారవేలు అధ్యక్షతన హైకోర్టు బీచ్ వద్ద, రెండోది లేబర్ కిసాన్ పార్టీ అధ్యక్షుడు ఎంఇఎస్ వేలాయుధం అధ్యక్షతన ట్రిప్లికేన్ బీచ్‌లో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్య శివ, కృష్ణస్వామి శర్మ కూడా పాల్గొన్నారు.

మే డే రోజును సెలవుదినంగా ప్రకటించాలని ఆ సభల్లో తీర్మానం ఆమోదించబడింది.

**లేబర్ కిసాన్ పార్టీ:** సింగారవేలు 1923లో లేబర్ కిసాన్ పార్టీ ఏర్పాటు చేశారు. దాని మ్యానిఫెస్టోపై ఇలా రాశారు. ఎం.సింగారవేలు (ఇండియన్ కమ్యూనిస్టు), అధ్యక్షుడు, మహాబోధి సొసైటీ, మద్రాసు. 1923 అక్టోబర్ నుంచి 'లేబర్ కిసాన్ గెజిట్' కూడా ప్రచురించసాగారు.

**1924లో కాన్పూర్ కుట్ర కేసు:** ఎస్.ఎ.డాంగే, ముజఫర్ అహ్మద్, నళినీగుప్తా, ఆర్‌సిఎల్ శర్మ, సౌకత్ ఉస్మాన్, ఎం.సింగారవేలు తదితరులపై కుట్ర కేసులు బనాయించబడినాయి. డాంగే, సింగారవేలులను 1923లో అరెస్టు చేశారు. మిగతావారిని తర్వాత అరెస్టు చేశారు. అటు తర్వాత, సింగారవేలు తీవ్ర అస్వస్థుడు కావటంతో బెయిలుపై విడుదల చేశారు. అటు తర్వాత కేసు నుండి నిర్దోషిగా ప్రకటించారు.

**1925లో సిపిఐ ఏర్పాటు:** సింగారవేలు 1918 నుండి మార్క్సిజంతో గాఢంగా ప్రభావితమైనారు. 1920లో ఎఐటియుసి వ్యవస్థాపన సందర్భంలో ఆయన సోషలిజాన్ని బలపరిచారు. మార్క్సిస్టు సాహిత్యం అధ్యయనం చేశారు. డాక్టర్ మణిలాల్, ఎంపిఎస్ వేలాయుధన్, డాంగే తదితర అనేక మంది కమ్యూనిస్టులు, విప్లవకారులతో సంబంధం ఏర్పరుచుకున్నారు. ఎస్.ఎ.డాంగే 'ది సోషలిస్టు' ప్రచురణ ప్రారంభించాక మద్రాసు గ్రూపు ఆయనతో సంబంధం ఏర్పరుచుకుంది. 1923 జనవరి 29న డాంగే సింగారవేలుకు రాసిన లేఖలో ఎంఎన్‌రాయ్‌ని ప్రస్తావించి ఇలా అన్నారు: యూరప్‌లో కమ్యూనిజం వెతుక్కుంటూ వెళ్ళటం భారత కమ్యూనిస్టుల పిచ్చి ప్రయత్నం. వారు దేశంలోపలే దాన్ని నిర్మించాలి.

భారత కమ్యూనిస్టుల వ్యవస్థాపక మహాసభ 1925 డిసెంబర్ 25–26 తేదీల్లో కాన్పూర్‌లో జరిగింది. దానికి షాపూర్జి షకలత్ వాలా అధ్యక్షత వహించాల్సి ఉండింది. అయితే బ్రిటిష్ ప్రభు త్వం ఆయనకు దేశాగమన అనుమతి నిరాకరించటంతో అధ్యక్షత వహించాల్సిందిగా ఎం.సింగారవేలును కోరటం జరిగింది. ఆ మహాసభ డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏర్పాటును ప్రకటించింది. సింగారవేలు ఉత్తేజకరమైన ప్రసంగం చేశారు. లెనిన్, తిలక్ తదితరుల మరణానికి సంతాపం తెలిపారు. కారల్ మార్క్స్ సూత్రాలను వక్కాణించారు. కమ్యూనిస్టులు కార్మికులు, కర్షకుల మధ్య పనిచేయాల్సిన ఆవశ్యకతను వక్కాణించారు. ఆనాటి సిపిఐ నిబంధనావళి ప్రకారం, మహాసభ అధ్యక్షుడు పార్టీ ఛైర్మన్ అవుతారు. ఆ విధంగా ఎం. సింగారవేలు సిపిఐ మొట్టమొదటి ఛైర్మన్. కాన్పూర్ కమ్యూనిస్టు మహాసభ వెనువెంటనే 1926 జనవరి 9, 10 తేదీల్లో ఎఐటియుసి మహాసభ మద్రాసులో జరిగింది. వి.వి.గిరి అధ్యక్షత వహించారు. సింగారవేలు, చక్కరాయ్, తిరు.వి.క. క్రియాశీల పాత్ర పోషించారు.

షకలత్ వాలా 1927లో భారత్‌లోకి వచ్చారు. ఫిబ్రవరి 24న మద్రాసు రాగా హృదయపూర్వక స్వాగతం లభించింది. కార్మికుల సమావేశాల్లో, బహిరంగ సభలో ఆయన ప్రసంగాలను సింగారవేలు తమిళంలోకి అనువదించారు. 'యంగ్ కామ్రేడ్స్ లీగ్' ఏర్పాటైంది.

**మద్రాసులో కాంగ్రెస్ సభ:** కాంగ్రెస్ 42వ సభ 1927 డిసెంబర్‌లో మద్రాసులో జరిగింది. అందులో ప్రతిపాదించే తీర్మానాలపై చర్చించటానికి కమ్యూనిస్టు ప్రతినిధులు సింగారవేలు ఇంట్లో సమావేశం జరిపారు. ఆయన ఇల్లు పార్టీకి తాత్కాలిక కేంద్ర కార్యాలయమైంది. సిపిఐ కేంద్ర కార్యవర్గం కూడా అక్కడ జరిగింది. దానిలో సింగారవేలు పాల్గొన్నారు.

**మద్రాసులో సిపిఐ నిర్మాణం:** అమీర్ హైదర్‌ఖాన్ 1932లో యంగ్ వర్కర్స్ లీగ్‌ను నిర్మాణం చేసి అప్పటికే సన్నాహక కృషి ప్రారంభించారు. సింగారవేలు, రష్యా మాణిక్యం, రాజా వడివేలు, పి. సుందర య్య, ఎఎస్‌కె అయ్యంగార్ తదితరులు లేబర్ ప్రొటెక్షన్ లీగ్ పేరుతో చిన్న కమ్యూనిస్టు గ్రూపుగా ఏర్పడ్డారు.

1936 నవంబర్‌లో 'ఆత్మగౌరవ సోషలిస్టు మహాసభ'కు డాంగే వచ్చారు. ఎస్‌వి.ఘాటే 1936 లో మద్రాసు ప్రెసిడెన్సీలో సిఎస్‌పి (కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ) నిర్మాణం చేశారు. కమ్యూనిస్టు పార్టీ కేంద్రం ఏర్పాటైంది. మద్రాసు కమ్యూనిస్టు గ్రూపుకు సిఎస్.సుబ్రమణియం కార్యదర్శి. కె.మురుగేశన్, పి.జీవానందం, ఎఎస్‌కె అయ్యంగార్, బి.శ్రీనివాసరావు తదితరులు సింగారవేలు కలిసి పనిచేశారు. ఎంఎన్ రాయ్ కూడా 1936లో మద్రాసు వచ్చి సింగారవేలు ఇంట్లో ఉన్నారు. అప్పటికి ఆయన కమ్యూనిస్టు ఉద్యమంనుండి బయటకు వెళ్లారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పడటంతో,1937లో 'జనశక్తి' వారపత్రికను ప్రారంభించారు. పి.జీవానందం దాని సంపాదకుడు. సింగారవేలు తదితరులు రచనలు అందించారు. అప్పటికి సింగారవేలు అస్వస్థతకు గురై దీర్ఘకాలం ఇంటికే పరిమితమైనారు. ఆయన ఇంటినుండే రచనలు చేయటం, ఇతర కార్యకలాపాలు నిర్వహించారు.

ఎం.సింగారవేలు 1946, ఫిబ్రవరి 11న మరణించారు.

# ఈశాన్య భారతంలో మూడు రాష్ట్రాల అవతరణ

సువిశాల భారతం విభిన్న సంస్కృతులు, సాంప్రదాయాల సమ్మేళనం, భిన్నత్వంలో ఏకత్వమే భరతమాత విలక్షణత. భాషలు, యాసలు, కులమతాలు, జీవన విధానాలు, సామాజిక ఒడుదుడుకులు, సంస్కృతికి విలక్షణతలు వేరైనా ఒకే దేశంగా సగర్వంగా నిలబడిన ప్రపంచంలోనే అత్యంత పెద్ద ప్రజాస్వామిక దేశం నా సుందర హిందూస్థానం. బ్రిటీష్ వలస పాలన నుంచి 1947లో విముక్తమై, స్వతంత్ర భారతంగా ఊపిరి పీల్చుకున్న సమయంలో నాడు 565 రాజరిక రాష్ట్రాలు లేదా ప్రిన్స్‌లీ స్టేట్స్తో పాటు 14 రాష్ట్రాలు, 7 ప్రొవిన్సులు, 6 కేంద్ర పాలిట ప్రాంతాలు ఉండేవి. నేటి భారత దేశం 28 రాష్ట్రాలు, 8 కేంద్రకాల్తో ప్రాంతాలుగా తన మనుగడను కొనసాగిస్తున్నది. గత 78 ఏండ్లలో సమయానుకూలంగా, స్థానిక అవసరాలు, భాష ప్రాతిపదికలు, పాలన సౌలభ్యాలు, ప్రజాభిప్రాయాలను బట్టి ప్రిన్స్‌లీ స్టేట్స్, ప్రొవిన్సులను విలీనం చేసుకొని, మరో 14 రాష్ట్రాలు, రెండు కేంద్రకాలకి ప్రాంతాలుగా విభజించడం లేదా విస్తరించడం జరిగింది. ఇదే క్రమంలో 21 జనవరి 1972న ఈశాన్య ప్రాంతాలైన త్రిపుర, మణిపూర్, మేఘాలయాలను రాష్ట్రాలుగా ఏర్పాటు చేయడానికి ఈశాన్య ప్రాంతాల పునర్వ్యవస్థీకరణ చట్టం, 1971 చేయడం, 27వ రాజ్యాంగ సవరణ చేయడంతో ఈ మూడు రాష్ట్రాలు ఆవిర్భవించాయి.

**త్రిపుర, మణిపూర్, మేఘాలయ గత చరిత్ర:**

1947లో మహారాజా ఆఫ్ మణిపూర్ పాలనలో ఉన్న మణిపూర్, స్వతంత్రం రాగానే భారత్‌లో విలీనం కావడానికి అంగీకరించడం, 1948లో రాజ్యాంగ రాచరికంలో ఏలుబడి జరిగి, 1949లో భారత్‌లో విలీనం అయ్యింది. 1956లో కేంద్ర పాలిత ప్రాంతంగా గుర్తించబడి, 1972లో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయబడింది. ఇంఫాల్ రాజధానిగా 37.56 లక్షల జనాభా కలిగిన మణిపూర్ నేడు కొండ ప్రాంత కుకీలు, లోయ ప్రాంత మైథీల మధ్య విభేదాలతో ఉద్రిక్తతల నడుమ ఒకే రాష్ట్రంగా కొనసాగుతున్నది. తనకంటూ ఒక ప్రత్యేక సంస్కృతి వారసత్వ సంపదలతో మణిపురీ నాట్యం, విలక్షణ పండుగలతో విరాజిల్లుతున్నది.

1947లో రాచరిక పాలనలో ఉన్న త్రిపుర ప్రాంతం కంచన్ ప్రభ రాణి చొరవతో 1949లో భారత్‌లో విలీనం అయ్యింది. ఒకప్పుడు మనీషా రాజవంశం పాలించిన త్రిపుర ప్రాంతం 1956లో కేంద్ర పాలిట ప్రాంతంగా, 1972లో రాష్ట్రంగా పునర్వ్యవస్థీకరించబడింది. అగర్తలా కేంద్రంగా పాలన కోనసాగుతున్న త్రిపుర రాష్ట్ర జనాభా నేడు దాదాపు 43 లక్షలు ఉన్నది.

1947లో మేఘాలయా ప్రాంతం 'ఘోర ఖాసీ'ల ఏలుబడిలో ఉన్నది. 1970లో ఈ ప్రాంతం అస్సామ్‌లో భాగంగా ఉన్నప్పటికీ 1972లో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి తన ప్రత్యేకతను నిలుపుకుంది. మేఘాల నిలయంగా పేరొందిన మేఘాలయా ప్రాంత సహజ ప్రకృతి అందాలు, ప్రత్యేక సాంస్కృతిక సంపదలతో తన విలక్షణతలు నిలుపుకుంటున్నది. 'స్కాట్‌లాండ్ ఆఫ్ ఈస్ట్'గా పిలువబడే షిల్లాంగ్ కేంద్రంగా పాలన కొనసాగుతున్న మేఘాలయాలో నేడు 39.2 లక్షల జనాభా ఉన్నది. ఈశాన్య భారతంలో ప్రకృతి అందాలు, కొండలు కోనలు, లోయ ల సహజ సంపదలతో విరాజిల్లుతున్న త్రిపుర, మణిపూర్, మేఘాలయా రాష్ట్రాలు 21 జనవరి 2025న తమ 53ల రాష్ట్ర అవతరణ దినోత్సవాలను ఘనంగా జరుపుకొని ఆయా ప్రాంతాల అభివృద్ధికి మరోసారి ప్రజలు పునరంకితులు కావాలని కోరుకుందాం. ఈశాన్య భారత అందాలను ఇనుమడింపజేస్తున్న ఈ రాష్ట్రాల్లో శాంతి, సంపదలు రాజ్యమేలాలని ఆశిద్దాం.

**(21 జనవరి త్రిపుర, మణిపూర్, మేఘాలయ రాష్ట్రాల అవతరణ దినోత్సవం సందర్భంగా)**

# డొనాల్డ్ ట్రంప్ 2.0లో అమెరికా తీరు ఏమిటో?



డా.బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

డొనాల్డ్ ట్రంప్ ఈజ్ బ్యాక్ అగైన్. అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండవసారి 20 జనవరి 2025న శ్వేతసౌధంలోకి అడుగిడి పదవీ బాధ్యతలు స్వీకరించనున్న వేళ పలు సవాళ్లు ఆయన పాలనకు ప్రధాన అంశాలుగా నిలువనున్నాయి. అమెరికాకు అనుకూలంగా తమ అంతర్గత సమస్యలకు పరిష్కారాలను చూపుతూనే విదేశీ సవాళ్లకు పరిష్కారాలు చూపుతారని ప్రపంచ ప్రజలు టెంపరి ట్రంప్ ను విశ్వసిస్తున్నారు. ట్రంప్ 2.0 పాలనకు గీటురాయిగా నిలువనున్న ప్రధాన అంశాలను ప్రస్తావించే ప్రయత్నం చేద్దాం.

**రష్యా–ఉక్రేన్ యుద్ధం ముగింపు:**

ట్రంప్ పదవీ భాద్యతలు తీసుకోవడానికి కొన్ని గంటల ముందే ఇజ్రాయిల్, హమాస్‌ల మధ్య గత 15 నెలలుగా జరుగుతున్న యుద్ధానికి సంబంధించిన కాల్పుల విరమణ, యుద్ధ ముగింపుకు అంగీకారం కుదరడం, తొలి దశ ఒప్పందం అమలులోకి రావడం జరుగుతున్నది. గత 1059 రోజులుగా జరుగుతున్న ఉక్రేన్‌పై రష్యా దండయాత్ర లక్షల మందిని పొట్టన పెట్టుకోవడం, గాయాల పాలు చేయడం, కనీసం పది మిలియన్ల ఉక్రేనియన్లు నిరాశ్రయులుగా మారి ఆకలి చావుల అంచున ఉన్నారు. నేడు మాస్కో, కీవ్ నగరాల మధ్య చర్చలు ప్రారంభమై, రెండు దేశాల మధ్య కనీసం సుహృద్భావ వాతావరణంలో ఓ అంగీకారానికి రావడానికి ట్రంప్ చొరవ చూపాల్సి ఉంది. కాల్పులు/యుద్ధ విరమణ చర్చలను ఉక్రేన్ అంగీకరిస్తున్నప్పటికీ రష్యా మాత్రం ససేమిరా అంటున్నది. ఉక్రేన్‌కు బాసటగా నిలుస్తూనే రష్యాను ఒప్పించడం కొంత కష్టంగానే తోస్తున్నది.

**అమెరికా చుట్టూ ఇనుప గోపురం శైలిలో రక్షణ:**

సమీప దేశాల నుంచి అక్రమ వలసలను నిరోధించడానికి సరిహద్దు చుట్టు ఇనుప గోపుర శైలిలో కంచెలు నిర్మిస్తామని ట్రంప్ ఇప్పటికే తెలియజేయడం విన్నాం. మెక్సికో, కెనడాల నుంచి అక్రమ వలసలను, మాదకద్రవ్యాల అక్రమ రాకను కట్టడి చేయడానికి కఠిన చర్యలు తీసుకోవడం, బహిష్కరణ వేటు వేయడం, అనధికార వలసదారులకు కళ్లెం వేయడం, కఠిన శిక్షలు విధించడం, వీరిని ఆయా దేశాలకు తిరిగి అప్పగించడం జరుగుతుందని తెలిపారు. కెనడాను అమెరికాలో ఒక రాష్ట్రంగా విలీనం చేసుకుంటామని, ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడోను ఆ రాష్ట్ర గవర్నర్‌గా నియమిస్తామని ఎగతాళి కూడా చేయడం చూసాం. విదేశాల అక్రమ మానవ వలసలను ఖచ్చితంగా నివారించడానికి చర్యలు తీసుకోనున్నారు.

**విదేశీ వస్తువులపై అధిక పన్నులు విధించడం:**

మేడిన్ ఇన్ అమెరికా నినాదాన్ని కార్యరూపం దాల్చడానికి విదేశీ వస్తువులపై, ముఖ్యంగా చైనా వస్తువుల వరదలపై 10–60 శాతం వరకు పన్నులు విధిస్తామని తెలియజేశారు. అమెరికా ఫస్ట్ అనే నినాదంతో స్వదేశీ వస్తువుల ఉత్పత్తి, వాణిజ్యానికి ఊపును తీసుకురావాలని చూస్తున్నారు.

**జనవరి 06, 2021 అలజడి చేసిన వారిని క్షమించడం:**

డొనాల్డ్ ట్రంప్ ఓటమి సమయంలో 06 జనవరి 2021 రోజున క్యాపిటల్ భవనంపై దాడిచేసిన దాదాపు 1,000 మంది ట్రంప్ అభిమానులు లేదా అనుచరులపై పెట్టిన కేసులను తొలగించి, వారిని దేశభక్తులుగా విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ ఘటనలో తీవ్ర నేరాలు చేసిన వారికి మాత్రం శిక్షలు పడతాయని కూడా తెలిపారు.

**వాతావరణ మార్పులు – ఎనర్జీ పాలసీలు:**

ప్రపంచమే అగ్నిగుండం అయిపోతున్నది. భూతాపం భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నది. పారిస్ ఒప్పందానికి లోబడి కార్బన్ ఉద్గారాల వాడకాన్ని తగ్గించి విద్యుత్తు వాహనాలకు పట్టం కట్టాల్సి ఉంది. అధిక కార్బన్ ఉద్గారాలకు కారణమైన అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాలు వాతావరణ ప్రతికూల మార్పులకు చెక్ పెట్టడానికి నిర్దిష్ట ప్రణాళికలను అమలు చేయాల్సి ఉన్నది.

అబార్షన్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయడం, అమెరికా అభివృద్ధికి దోహదపడే రంగాలకు పన్నుల్లో రాయితీలు లేదా తగ్గించడం, ఎల్‌జిబిటిక్యూ లేదా ట్రాన్స్‌జెండర్ వర్గాలకు చట్టపరమైన రక్షణలు కల్పించడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేయడం, సామాజిక భద్రతకు పెద్దపీట వేయటం, ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం, అమెరికా రక్షణ రంగాన్ని బలోపేతం చేయడం, గృహ నిర్మాణ రంగానికి ఊపిరులూదడం, సెమీకండక్టర్ చిప్‌ల తయారీకి యుఎస్, చైనా, థైవాన్‌ల సహకారం పెంచుకోవడం, ఎఐ క్వాంటమ్ సైన్స్ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడం, ఎగిరే కార్లను ప్రవేశపెట్టడం లాంటి ఎజెండాతో ట్రంప్ 2.0 పాలన ప్రారంభం కానుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# అతిగా తినేస్తున్నాం!

భారతీయులు అతిగా తినేస్తున్నారా? ఈ ప్రశ్నకు సమాధానం ఇచ్చే ముందు 2008 మే 3న, అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ చే సిన వ్యాఖ్యలను ఒకసారి గుర్తుచేసుకోవాలి. భారతీయులు ప్రపంచ ఆహారాన్ని తినేస్తున్నారని, ముడి చమురు (పెట్రోలియం)ను తాగేస్తున్నారని బుష్ మండిపడ్డాడు. కొంత విపరీతంగా అనిపించినా, ఈ విమర్శలో అర్థం ఉంది. సాధారణ భారతీయుడు రోజూ మూడుపూటలు భోజనం చేస్తాడు. అదీగాక, ఉదయం అల్పాహారం... సాయంకాలం స్నాక్స్. ఖాళీ దొరికిందని, పని భారం పెరిగిందని, ఎండలు మండుతున్నాయని, వర్షం పడుతున్నదని, చలి ముదిరిందని, స్నేహితులు లేదా బంధువులు వచ్చారని, ఆదివారాలని, పండగలని... ఇలా ఏదో ఒక కారణాన్ని వెతికిపట్టుకొని మరీ తినే చిరుతిళ్లకు.. టీ కాఫీలకు అంతేలేదు. కదుపు ఉబ్బరంగా ఉందంటూ కూల్‌డ్రింక్స్ తాగడం ఇక్కడి జీవితంలో ఒక అంతర్భాగమైంది. అయితే, ఆహారం రూపంలో ఎన్ని క్యాలరీలు తీసుకుటు న్నాం.. వ్యాయామంతో ఎన్ని క్యాలరీలు ఖర్చు చేస్తు న్నాం అని లెక్కలు వేసుకునేవారు చాలా తక్కువ. 14వ శతాబ్దం వరకూ మన దేశంలో ఉదయాన్నే అల్పాహారం ఉండేది కాదు. పనులు నిమిత్తం బయటకు వెళ్లేవారు ఉదయాన్నే భోజనం చేసేవారు. సాంకేతిక విప్లవంతో వివిధ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా, వివిధ పనులు చేయడానికి ఉద్యోగాల్లో చేరడం ప్రారంభమైంది. అప్పటినుంచే ఆహారపు అలవాట్లు మారుతూ వచ్చాయి. ఈస్ట్ ఇండియా కంపెనీ పుణ్యాన మనకు టీ, కాఫీలతోపాటు అల్పాహార ఆలోచననూ మోసుకొచ్చింది. టిఫిన్ అనేది స్టేటస్ సింబల్ గా మారింది. భారతీయులు తినే తిండిలో కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. కాలక్షేపానికి తినడం అనేది కేవలం మన దేశంలో మాత్రమే కనిపిస్తుంది. తక్కువ పోషకపదార్థాలున్న ఆహారం మనకు నచ్చదు. ఎలాంటి భోజనం రకరకాల జబ్బులకు కారణమవుతుందో.. అలాంటి భోజనాన్నే కోరుకుంటాం. వారంలో ఏదో ఒక రోజున 'ఉపాసం' ఉండడం ఒక ప్రహసనంగా మారింది. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన తిండి క్రమంగా పూటకూళ్లకు మారింది. హోటళ్లు, టిఫిన్‌బండ్ల రంగ ప్రవేశం తో రోడ్డెక్కింది. ఇప్పుడు స్విగ్గీలు, జొమాటోలు వచ్చి హోటళ్లను ఇంట్లోకి తెచ్చాయి. కోట్లాది మంది ఒకపూట తిండి కూడా లేకుండా అల్లాడుతుంటే, ఉన్నవాడేగాక, దిగువ మధ్యతరగతి వాళ్లు కూడా విలాసాలతో రెచ్చిపోవ డం.. ఆహారాన్ని వృథా చేయడం మనకు మాత్రమే పరిమితం. ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్న భయం లేదు.. ఈ అరాచకపు ఆహార అలవాట్లను, విధానాలను ఎంత త్వరగా మార్చుకుంటే అంత మంచిది.... ఇటు మనకు... అటు దేశానికి కూడా.



ఎస్వీఆర్

# గాజా ఊపిరి పీల్చుకుంది.. మరి ఉక్రేన్ మాటేమిటి?

24 ఫిబ్రవరి 2022న ప్రారంభమైన ఉక్రేన్‌పై రష్యా దాడులు పూర్తియుద్ధంగా మారి గత వెయ్యి రోజులు దాటుతూ 1058వ రోజు దాటుతున్న వేళ, ఈ యుద్ధ మారణహోమానికి ముగింపే కనిపించడం లేదు. గత 15 మాసాలుగా జరిగిన ఇజ్రాయిల్ –పాలస్తీనా యుద్ధ కాల్పుల విరమణ, యుద్ధ ముగింపుకు అంగీకారం కుదర డం హర్షదాయకం. ఉక్రేన్–రష్యా యుద్ధంలో ఇరు పక్షాలకు చెంది న లక్షల మంది సైనికులు, సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోగా, మిలియన్ల కొద్దీ గాయపడడం, పది మిలియన్లకు పైగా ఉక్రేనియన్లు నిర్వాసితులుగా మారడంతో శరణార్థి శిబిరాల్లో అమానవీయ దుస్థితుల్లో బలవంతంగా ఊపిరి పీల్చుకుంటున్నారు. వివిధ అంచనాల ప్రకారం ఇప్పటి వరకు లక్ష వరకు ఉక్రేనియన్ బలగాలు చనిపోగా, 4 లక్షలకు పైగా గాయపడ్డారు. అదే విధంగా కనీసం 1.5 లక్షల మంది రష్యా బలగాలు ప్రాణాలను కోల్పోయారని తెలుస్తున్నది. రష్యా ఆక్రమించిన భూభాగాన్ని వెనక్కి తీసుకోవడానికి ఉక్రేన్, ఉక్రేన్‌ను ఆక్రమించాలని రష్యా తమతమ పోరాటాలను ఉధృతం చేస్తున్నాయి.

**ఉక్రేన్ గత చరిత్ర – యుద్ధం ప్రారంభం:** 1700ల్లో రష్యా సామ్రాజ్య పాలనలో ఉన్న ఉక్రేన్ 1917లో రష్యా ఉద్యమంతో రష్యా సామ్రాజ్య పాలన నుంచి విముక్తమై 1922లో సోవియట్ యూనియన్‌లో భాగమైపోయింది. 1930ల్లో మిలియన్ల ఉక్రేనియన్లు కరువుకాటకాలతో ప్రాణాలు కూడా కోల్పోవడం జరిగింది. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో ఉక్రేన్ స్వతంత్ర దేశంగా నిలబడింది. రష్యాలోని మెజారిటీ ప్రజలే కాకుండా పుతిన్ లాంటి నాయకులు కూడా ఉక్రేన్ తమ దేశంలో భాగమే అని భావించడంతో రెండు దేశాల మధ్య విభేదాలు రోజు రోజుకు పెరగడం, చివరకు 24 ఫిబ్రవరి 2022న రష్యా పూర్తి స్థాయి దాడి చేయడంతో యుద్ధం అనివార్యం అయ్యింది. 2019లో ఉక్రేన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో పాటు అమెరికా, యూరోప్ దేశాల సహకారంతో యుద్ధం మారణహోమంగా మారింది. రష్యా పక్షాన చైనా, ఇరాన్, ఉత్తర కొరియాలు నిలవడంతో నువ్వా నేనా అనే రీతిలో మారణహోమం కొనసాగుతున్నది.

**సమీపంలో కానరాని యుద్ధ విరమణ ఆలోచనలు:**

నేడు ఉక్రేన్–రష్యా యుద్ధం కాల్పుల విరమణ లేదా ముగింపుకు రావాలంటే ఇరు పక్షాలను చర్చలకు కూర్చోబెట్టాల్సి ఉంది. ఇది చాలా కష్టసాధ్యమని ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ఈ యుద్ధానికి చరమగీతం పాడడానికి నాలుగు మార్గాలు కనిపిస్తున్నట్లు విశ్లేషిస్తున్నారు. వీటిలో యుద్ధం దీర్ఘకాలం కొనసాగడం, యుద్ధ తీవ్రత తగ్గడం, యుఎస్ యూరోప్‌ల సహకారంతో ఉక్రేన్ గెలవడం, లేదా రష్యా గెలుపు బాటన నిలవడం లాంటి పరిష్కార మార్గాలు కనిపిస్తున్నాయి. డొనాల్ ట్రంప్ కూడా యుద్ధ ముగింపు ను కోరుతున్నప్పటికీ రష్యా ఆధిపత్యాన్ని అంగీకరించడం అసాధ్య మే. యుఎస్, యూరోప్‌ల మిలటరీ, ఆర్థిక సహకారంతో మాత్రమే ఉక్రేన్ పై చేయి సాధించగలదు. కాల్పుల విరమణ లేదా యుద్ధ విరమణ చర్చలకు ఉక్రేన్ అంగీకరిస్తున్నప్పటికీ ఈ ప్రతిపాదనలను రష్యా వ్యతిరేకిస్తున్నది.

ఎవరు పట్టు వారిది. యుద్ధ భూమిలో పోతున్న ప్రాణాలు ఇరువురివి. ఇరు దేశాలు పౌర సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. దౌత్య పరమైన ప్రతిపాదనలు ఆదిలోనే తుంచబడుతున్నాయి. జెలెన్‌స్కీ, పుతిన్‌లు మంకుపట్టు పట్టుకొని మారణహోమం చూస్తున్నారు. మరణాల లెక్కలను సవరించుకుంటున్నారు. ఆకలి కేకలను మించి యుద్ధ మోతలు మోగిస్తున్నారు. రష్యా గెలుపు పశ్చిమ దేశాలకు ఓటమితో సమానం. ఉక్రేన్ గెలుపు రష్యా–చైనాలకు తలవంపులు అవుతున్నది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే మారణహోమ మరుభూమి తప్ప అభివృద్ధి ఆనందాలు కనిపించవు. యుద్ధం కొనసాగితే ఇరుదేశాల ప్రజలే కాకుండా ప్రపంచవ్యాప్త 840 కోట్ల ప్రజలు దాని దుష్ప్రభావ వేడికి ప్రభావితం అయ్యారు, అవుతూనే ఉంటారు. గాజా మారణోమ అంతానికి మార్గం దొరికినట్లు, రష్యా దండయాత్రకు కూడా ఓ పరిష్కారం సత్వరమే దొరకాలని కోరుకుందాం.

# ‘ఢిల్లీ ఎయిమ్స్’కు బడ్జెట్‌లో నిధులు



కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జెపి.నడ్డా, ఢిల్లీ సిఎం ఆతిశీకి కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ లేఖలు
హాస్పిటల్ ఫుట్‌పాత్, సబ్‌వే వద్ద రోగులు, వారి కుటుంబసభ్యులు అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన
అసెంబ్లీ ఎన్నికల తరుణంలో చలికాలంలోనూ... ‘హస్తినలో హాట్ పాలి‘ట్రిక్స్’

**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చలికాలంలోనూ ‘హస్తిన’ రాజకీయాలు బాగా వేడెక్కుతున్నాయి. ఢిల్లీ పీఠాన్ని దక్కించుకునేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు తమ ప్రత్యర్థులపై ఒకవైపు రాజకీయ విమర్శల దాడిని తీవ్రతరం చేస్తూనే, మరోవైపు ప్రజల సమస్యలపై హఠాత్ ప్రేమ ప్రదర్శిస్తున్నారు. ఇప్పటివరకూ ఢిల్లీ ప్రజలను, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోని రాజకీయ పార్టీల ముఖ్యనేతలు హఠాత్తుగా ఢిల్లీ ప్రజల సమస్యలపై నిశిత దృష్టిని సారించడం మరోపక్క చర్చనీయాంశమవుతోంది. ప్రజారోగ్య వ్యవస్థను పటిష్టపరిచేందుకు రానున్న బడ్జెట్‌లో అవసరమైన నిధులను పెంచేలా చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ ముఖ్య నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి.నడ్డా, ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీకి లేఖలు రాశారు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఫుట్ పాత్, మెట్రోస్టేషన్ కిందనున్న సబ్ వే వద్ద వందలాది రోగులు, వారి కుటుంబ సభ్యులు పడుతున్న అవస్థల దయనీయపరిస్థితిని ఆయన ప్రధానంగా ఈ లేఖల్లో ప్రస్తావించారు. ఈ మానవతా సంక్షోభం పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని రాహుల్ గాంధీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అభ్యర్థించారు. ఆయన తన ‘ఎక్స్’ హిందీ పోస్ట్‌లో తన ఆవేదనను తెలియజేశారు. ‘నేను ఢిల్లీ ముఖ్యమంత్రి, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రికి రాసిన లేఖల్లో దేశవ్యాప్తంగా ఎయిమ్స్ హాస్పిటల్‌కు తరలివస్తున్న రోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యసేవలు కల్పించాలని అభ్యర్థించానని తెలియజేశారు. ‘ఢిల్లీ మెట్రో స్టేషన్, సబ్‌వే వద్ద పలుచటి దుప్పట్లు కప్పుకుని తీవ్ర చలిలోనే రోగులు, వారి కుటుంబసభ్యులు గజగజవణుకుతూ నిద్రిస్తుండడాన్ని నేను గమనించాను. వారికి అక్కడ తాగునీరు,టాయిలెట్ల సౌకర్యాన్ని కల్పించకపోవడం బాధాకరం. వారి చుట్టూ భారీ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ దుస్థితి ఢిల్లీ ఎయిమ్స్‌కు భారీ సంఖ్యలో తరలివస్తున్న రోగుల దయనీయపరిస్థితికి అద్దం పడుతున్నది. వారి నివాసానికి అవసరమైన మంచి నాణ్యమైన, ఆరోగ్య వసతులు కల్పించడం లేదనే విషయాన్ని ప్రస్ఫుటం చేస్తుంది’ అని రాహుల్ గాంధీ చెప్పారు. ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి.నడ్డా ఇరువురూ తన లేఖలను గమనించి పరిగణనలోనికి తీసుకోవడం ద్వారా ఈ మానవతా సంక్షోభాన్ని వెంటనే పరిష్కరించాలి’ అని రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని ఎయిమ్స్ వెలుపల ఉన్నటువంటి బాధాకరపరిస్థితిని తమరి దృష్టికి తీసుకురావాలని తాను కోరుకుంటున్నానని నడ్డాకు రాసిన లేఖలో తెలిపారు. ‘భారతదేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వైద్య సంస్థ ఎయిమ్స్ వద్ద ప్రజలు అష్టకష్టాలు పడటం నన్ను చలించివేసింది. నాఅభ్యర్థనను మీరు తప్పకుండా అంగీకరించి పరిష్కరిస్తారన్న నమ్మకం ఉన్నదన్నారు. రోగులు ఎదుర్కొంటున్న లెక్కలేనన్ని కష్టాలు, బాధలను పరిష్కరించే విషయంలో మీకు నా పూర్తి మద్దతు ఎల్లవేళలా ఉంటుంది అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీకి రాసిన లేఖలో రాహుల్‌గాంధీ అభ్యర్థిస్తూ ఈ చలికాలంలోనే తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు. రోగులకు మరిన్ని వసతి సౌకర్యాలు కల్పించే అన్వేషణ సాగించాల్సిన అవసరాన్ని రాహుల్ గాంధీ నొక్కి చెప్పారు. ఎయిమ్స్, భారత ప్రభుత్వం, చారిటబుల్ సంస్థల భాగస్వామ్యంలో మంచి వసతులను రోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సూచించారు. కాంగ్రెస్ ముఖ్య నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అయిన రాహుల్‌గాంధీ గురువారం ఎయిమ్స్ చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్నటువంటి రోగులు, వారి కుటుంబసభ్యుల వద్దకు స్వయం గా వెళ్లి కలుసుకుని వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ కేంద్ర, రాష్ట్ర ప్రభుతాలపై ఆరోపణలు గుప్పించారు. ఈ దుస్థితికి వారే బాధ్యులని ఆమ్ ఆద్మీపార్టీ, బిజెపిలపై తీవ్రస్థాయిలో ఆయన మండిపడ్డారు. శనివారం నాడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ పూర్తిగా నాశనమైందని ఆరోపించారు. ఎయిమ్స్‌లో తగిన చికిత్స తక్కువ ధరకు లభిస్తుందన్న రోగులు, వారి కుటుంబ ఆశలు అడియాసలు అయ్యాయని నిప్పులు చెరిగారు. దీనికి సంబంధించి రాహుల్‌గాంధీ ఎయిమ్స్ వద్ద రోగులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వీడియోను ప్రజల కోసం షేర్ చేశారు.

### రోడ్డు భద్రతపై.. ఎంవిఎ నిబంధనల అమలు

# సమ్మతి నివేదికలు దాఖలు చేయండి

23రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలకు ‘సుప్రీం’ ఆదేశం
రహదారి భద్రతపై 2012లో దాఖలు చేసిన ‘పిల్’పై విచారించిన అత్యున్నత న్యాయస్థానం



**న్యూఢిల్లీ :** ఎలక్ట్రానిక్ పర్యవేక్షణ, రహదారి భద్రతా చర్యలపై చట్టబద్ధమైన నిబంధనలతో పాటు మోటారు వెహికిల్ చట్టంలోని ఇటీవల నిబంధనల అమలును సూచిస్తూ సమ్మతి నివేదికలను దాఖలు చేయాలని సుప్రీంకోర్టు సోమవారం 23రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత (యుటి) ప్రాంతాలను ఆదేశించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, ఉజ్జల్ భుయాన్ ప్రాతినిధ్యం వహించిన ద్విసభ్య ధర్మాసనం 6రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం వారి నివేదికలను దాఖలు చేశాయని తెలిపింది. పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, కేరళ, ఢిల్లీలు తమ సమ్మతినివేదికలను దాఖలు చేసినట్లు ధర్మాసన ం పేర్కొంది. మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 136ఎ అమలపై సుప్రీంకోర్టు 2024, సెప్టెంబరు 2న ఆదేశాలు జారీ చేసింది. ఇది మోటారు వాహనాల చట్టం (ఎంవిఎ) నిబంధనలలోని రూల్ 167ఎను ఉటంకించింది. ఇది వేగంగా వెళ్లే వాహనాలను అధికారులు ఎలక్ట్రానిక్‌గా పర్యవేక్షించేందుకు అనుమతిస్తున్నది. బెంచ్ ఇప్పుడు 23రాష్ట్రాలను, 7కేంద్ర పాలిత ప్రాంతాలను సమ్మతి నివేదికలు దాఖలు చేయాలని కోరింది. ఈ సమ్మతి నివేదికలను రహదారి భద్రతపై సుప్రీంకోర్టు కమిటీతో పంచుకోనుంది. ఎలక్ట్రానిక్ మోనిటరింగ్, రోడ్డు భద్రతా చర్యలపై ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలను రూపొందించడంలో కేంద్రం పరిగణించగల అన్ని అంశాలను పరిశీలించి, అవసరమైన ఇన్‌పుట్‌లను సుప్రీం కోర్టు ప్యానెల్ అందజేస్తుంది అని ధర్మాసనం తెలిపింది. ధర్మాసనానికి అమికస్ క్యూరీగా సహకరిస్తున్న సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ మాట్లాడుతూ 6రాష్ట్రాలు వాటి నివేదికలను ఇప్పటికే దాఖలు చేశాయని, వాటికి సంబంధించి అవసరమైన ఆదేశాలను ఆమోదించవచ్చని ధర్మాసనానికి వివరించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం రోడ్డు భద్రతకు సంబంధించిన ఒక ప్యానెల్‌ను మార్చి 25న పరిశీలిస్తామని, ఈలోగా నివేదికలపై చర్చించేటప్పుడు ఆరుగురి సహాయం తీసుకోవచ్చని ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. 2021లో మోటార్ వాహనాల చట్టంచే ప్రవేశపెట్టబడిన సెక్షన్ 136ఎ ముఖ్యోద్దేశం ట్రాఫిక్ నిర్వహణను నిర్ధారించడానికి స్పీడ్ కెమెరాలు, క్లోజ్డ్ సర్క్యూట్ టెలివిజన్ కెమెరాలు (సిసిటివి), స్పీడ్ గన్స్, బాడీ వార్న్ కెమెరాలు, ఆటోమేటిక నంబర్ ప్లేట్ రికగ్నేషన్ సిస్టమ్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ట్రాఫిక్ చట్టాల అమలుచేయడంలో లక్ష్యంగా పెట్టుకుంది. ఇది జాతీయ రహదారి, రాష్ట్ర రహదారులు, మిలియన్ కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలలోని పట్టణ రహదారులపై ఎలక్ట్రానిక్ పర్యవేక్షణను నొక్కిచెబుతోంది.హైరిస్క్ కారిడార్‌లు, ప్రధాన జంక్షన్లు, 10లక్షల జనాభా ఉన్న ప్రధాన నగరాలలో రాష్ట్ర ప్రభుత్వాలు పరికరాలను సమకూర్చుకోవాల్సిన అవసరంఉందని ధర్మాసనం పేర్కొంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉపయోగించే బాడీవోర్న్ కెమెరాల వంటి పరికరాలు కొనసాగుతున్న రికార్డు గురించి నేరస్తులకు తప్పకుండా తెలియజేయాలి. ఉల్లంఘనలకు సంబంధించిన వివరాలతో పాటు ఫోటోగ్రాఫ్ సాక్ష్యం, తేదీ, సమయం, లొకేషన్ స్టాంపులతో కూడిన ఎలక్ట్రానిక్ చలాన్‌లు జారీచేయబడతాయి. ఇదిలాఉంటే ట్రాఫిక్‌తో సంబంధం లేని నిఘా ప్రయోజనాల కోసం ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వినియోగంపై కోర్టు స్పష్టతను ఇచ్చింది. రోడ్డు భద్రతపై 2012లో దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం(పిల్)పై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు విచారించింది.

### తక్కువ రోజులు శాసనసభల

# సమావేశాలు ఆందోళనకరం



85వ ఎఐపిఒసి ప్రారంభ సమావేశంలో లోక్‌సభ స్పీకర్ బిర్లా

**న్యూఢిల్లీ :** శాసనసభల సమావేశాల సంఖ్య తగ్గుతుండడం పట్ల లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లా సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సమస్య పరిష్కారానికి కృషి చేయవలసిందిగా సభాపతులకు ఆయన విజ్ఞప్తి చేశారు. 85వ అఖిల భారత సభాపతుల సమ్మేళనం (ఎఐపిఒసి) ప్రారంభ సమావేశంలో బిర్లా ఆ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ శాసనసభ తన పూర్తి ఐదు సంవత్సరాల హయాంలో కేవలం 74 సమావేశాలు నిర్వహించిందనే వార్తల మధ్య ఆయన ఆ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో అంతరాయాల యోచన పట్ల కూడా లోక్‌సభ స్పీకర్ ఆందోళన వ్యక్తం చేశారు. సభ గౌరవాన్ని పరిరక్షించేందుకు మార్గదర్శక సూత్రాలు రూపొందించవలసిందిగా రాజకీయ పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ‘స్టాండింగ్ కమిటీలు మినీ పార్లమెంట్‌లు. వాటి పని తీరును పటిష్ఠం చేయవలసిన ఆవశ్యకత ఉంది’ అని ఓమ్ బిర్లా సూచించారు. 85వ ఎఐపిఒసికి రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, బీహార్ అసెంబ్లీ స్పీకర్ నంద్ కిశోర్ యాదవ్, బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, దేశం అంతటి నుంచి రాష్ట్ర శాసనసభల అధిపతులు హాజరయ్యారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సోమవారం ఉదయం ఓమ్ బిర్లాతో భేటీ అయ్యారు. కానీ ‘75వ రాజ్యాంగ వార్షికోత్సవం: రాజ్యాంగ విలువల పటిష్ఠతలో పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల కృషి’ అంశంపై రెండు రోజుల సమ్మేళనానికి ఆయన గైర్హాజరయ్యారు. పిఆర్‌ఎస్ లెజిస్లేటివ్ అధ్యయనం ప్రకారం, కాలపరిమితి ముగుస్తున్న ఢిల్లీ శాసనసభ తన ఐదు సంవత్సరాల హయాంలో 74 సమావేశాలు నిర్వహించింది. అంటే సగటున ఏడాదికి 15 రోజుల సమావేశం అయిందన్నమాట. సభ సమావేశమైన రోజుల్లో అది సగటున మూడు గంటలు భేటీ అయింది. సభ తన హయాంలో కేవలం 14 బిల్లులు ఆమోదించింది. పూర్తి కాలం పనిచేసిన గత ఏ అసెంబ్లీకైనా అది అత్యల్ప సంఖ్య.

### ఇండియన్ ఆర్మీ

# ‘డేర్‌డెవిల్స్’ వరల్డ్ రికార్డు



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని కర్తవ్యపథ్ ఈ నెల 26న జరిగే 76వ గణతంత్ర దినోత్సవాలకు ముస్తాబవు తోంది. ఈ వేడుకలకు విదేశీ ప్రముఖులతో పాటు పారాలింపిక్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, ఉత్తమ పని తీరు కనబరచిన గ్రామాల సర్పంచ్‌లు, చేనేత కళాకారులు, అటవీ, వన్య ప్రాణి సంరక్షకులు ఇలా దాదాపు 10,000 మంది ప్రత్యేక అతిథులను కేంద్రం ఆహ్వానించింది. ఇక గణతంత్ర వేడుకల్లో భాగంగా భారత ఆర్మీ ఇప్పటికే పలు విన్యాసాలు చేస్తోంది. ఈ క్రమంలో భారత ఆర్మీకి చెందిన డేర్ డెవిల్స్ టీమ్ సరికొత్త రికార్డు సృష్టించింది. కదులుతున్న బైక్స్‌పై అత్యంత ఎత్తైన మానవ పిరమిడ్ (20.4 అడుగులు)ను నిర్మించి ప్రపంచ రికార్డు సృష్టించింది. తద్వారా అసాధారణమైన ఫీట్‌ను సాధించింది. ఏడు మోటార్ సైకిళ్లపై 40 మంది 2 కిలోమీటర్ల మేర ప్రయాణించడం ద్వారా ఈ ఘనతను అందు కుంది. ఆర్మీలోని మోటార్ సైకిల్ రైడర్ డిస్‌ప్లే టీమ్‌ను ‘డేర్ డెవిల్స్’ అని పిలుస్తారు. ఈ టీమ్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. అంతేకాదు.. తమ ప్రదర్శనలతో అంతర్జాతీయ ప్రశంసలు కూడా అందుకుంది. ఈ టీమ్ ఇప్పటికే ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సహా 33 ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. 1935 నుంచి ఇప్పటి వరకూ డేర్‌డెవిల్స్ టీమ్.. గణతంత్ర దినోత్సవ పరేడ్‌లు, ఆర్మీ డే పరేడ్‌లు సహా ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల్లో దాదాపు 1,600 మోటార్ సైకిల్స్ ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

## దైవదూషణ పేరుతో పాప్ సింగర్‌కు ఉరి

**టెహ్రాన్ :** మహ్మద్ ప్రవక్తను అవమానించాడన్న ఆరోపణలపై పాప్ స్టార్ సింగర్ అమిర్ టాటాలూ (38) కు ఇరాన్ ప్రభుత్వం మరణశిక్ష అమలు చేసింది. దైవ దూషణ చేసినందుకు ఐదు సంవత్సరాలు జైలుశిక్ష సరిపోదని ప్రాసిక్యూషన్ తీవ్ర అభ్యంతరం చెప్పడంతో సుప్రీంకోర్టు అందుకు అంగీకరించి టాటాలూకు మరణశిక్ష విధించింది. ఆదివారంనాడు (జనవరి 19) టాటాలూను ఉరి తీశారు. టాటాలూ అసలు పేరు అమిర్ హుస్సేన్ మఘసూద్లూ. ఇరాన్‌లో జన్మించి పాప్‌సింగర్‌గా ఎదిగాడు. పాటల రచయితగా, ర్యాపర్‌గా పేరు సంపాదించుకున్నాడు. పాప్‌స్టార్‌గా ఎదిగాడు. బాల్యంలో కుటుంబ పరిస్థితులవల్ల 14 ఏళ్ళ వయసులోనే వడ్రంగిగా పనిచేశాడు. ఆ తర్వాత ఒక కిరాణా దుకాణంలో పనిచేశాడు. హైస్కూలు చదువు తర్వాత గాయకుడుగా ఎదిగాడు. ప్రముఖ సంగీత విద్యాంసుల వద్ద పని చేశాడు. శరీరంలో అణువు అణువునా టాటూ ముద్రలు వేయించుకున్న అత్యంత ప్రజాదరణపొందిన గాయకుడుగా, పాటల రచయితగా అంతకుమించి వివాదాస్పద కళాకారుడుగా అందరిదృష్టినీ ఆకర్షించాడు. ఆయన మొత్తం 21 ఆల్బమ్‌లను విడుదల చేశారు. 2016 నుండి 2018 వరకు టాటాలూను ఇరాన్ ప్రభుత్వం అనేకసార్లు అరెస్టు చేసింది. నెలల తరబడి ఆయన జైలులో గడిపాడు. ఆ తర్వాత ఆయన టర్కీకి పారిపోయి విజయవంతమైన గొప్ప గాయకుడుగా ఎదిగాడు. తన కెరీర్‌ను నిర్మించుకున్నాడు. పెద్ద పెద్ద సంగీత సభలను విజయవంతంగా నిర్వహించాడు. కానీ 2023 వరకూ ఆయనను ఇరాన్‌కు రానివ్వలేదు. కాలం చెల్లిన ఇరాన్ పాస్‌పోర్టుతో స్వదేశానికి బయలుదేరిన టాటదాలూను మొదట టర్కీ అధికారులు 2023లో ఇస్తాంబుల్ విమానాశ్రయంలో అరెస్టు చేశారు. ఆ తర్వాత ఇరాన్ ప్రభుత్వానికి అప్పగించారు. అప్పటికే టాటాలూపై ఇరాన్‌లో తీవ్రమైన ఆరోపణలపై కేసులు నమోదై ఉన్నాయి. ఈ పాత కేసులదృష్ట్యా టాటాలూను పోలీసులు వెంటనే అరెస్టు చేశారు. ఈ ఆరోపణల్లో దైవ దూషణ చేశారనీ, మహ్మద్ ప్రవక్తను అవమానించారనీ, తరచు ఇస్లామిక్ పాలక ప్రభుత్వాలను తీవ్రంగా దూషించేవాడనీ ఆయనపై కేసులు నమోదు చేశారు. కేసుల విచారణ చేశారు.

## రాజ్యాంగంపై దాడి జరుగుతోంది!

**ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ క్షమాపణలు చెప్పాల్సిందే : కాంగ్రెస్**

**న్యూఢిల్లీ :** రాజ్యాంగంపై దాడి జరుగుతోందని కాంగ్రెస్ మరోమారు ఆరోపించింది. స్వాతంత్రోద్యమంపై దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందుకు ఆర్‌ఎస్‌ఎస్ మోహన్ భగవత్ క్షపమాణలు చెప్పాల్సిందేనన్న తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. మహాత్మాగాంధీని అవమానిస్తున్నారని, అంబేద్కర్‌పై దాడి చేస్తున్నారని ప్రతిపక్షపార్టీ మండిపడింది. కాగా, మంగళవారం ‘జై బాపు, జై భీమ్, జై సంవిధాన్’ ర్యాలీని కాంగ్రెస్ పార్టీ కర్నాటకలోని బెల్గావ్‌లో నిర్వహించనుంది. నిజానికి ఈ ర్యాలీని గత డిసెంబరు 27వ తేదీనే నిర్వహించాల్సి ఉండగా, మాజీ ప్రధాని మన్మోహసింగ్ మృతి చెందడంతో వాయిదా వేసినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ సోమవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. డిసెంబరు 26, 1924న మహాత్మాగాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బెల్గావ్‌లో బాధ్యతలు చేపట్టారని జైరామ్ గుర్తుచేశారు. భారత రాజ్యాంగంపై దాడి జరుగుతోందని, మహాత్మాగాంధీని అవమానిస్తున్నారని, అంబేద్కర్‌పై కూడా దాడికి దిగుతున్నారని విమర్శించారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ వారసత్వాన్ని పరిరక్షించడం, ప్రోత్సహించాలనే కాంగ్రెస్ దృఢ సంకల్పానికి బెళగావి ర్యాలీ పునరుద్ఘాటన అని ఆయన అన్నారు. ఇదే తరహా ర్యాలీని ఈనెల 27వ తేదీన అంబేద్కర్ జన్మభూమి అయిన మావ్‌లో కూడా నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 14వ తేదీన మోహన్ భగవత్ చేసిన దారుణమైన, జాతీ వ్యతిరేక వ్యాఖ్యలకు గానూ ఆయన క్షమాపణ చెప్పి తీరాల్సిందేనన్నారు. అదే విధంగా డిసెంబరు 17వ తేదీన పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్‌నుద్దేశించి చేసిన దారుణమైన వ్యాఖ్యలకు ఆయన రాజీనామా చేయాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### అమిత్ షాపై వ్యాఖ్యల కేసులో

# రాహుల్‌కు భారీ ఊరట

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, బిజెపిపై చేసిన వ్యాఖ్యలకు గానూ దాఖలైన పరువు నష్టం కేసులో ఆయనపై క్రిమినల్ విచారణను సుప్రీంకోర్టు నిలిపివేసింది. 2019లో బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా ఓ హత్య కేసులో నిందితుడని రాహుల్ ఆరోపించారు. ఆ ఘటనలో రాహుల్‌పై క్రిమినల్ డిఫమేషన్ కేసు బుక్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలపై బిజెపి కార్యకర్త నవీన్ ఝా పరువునష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై ట్రయల్ కోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్న రాహుల్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీంతో రాహుల్.. జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. జార్ఖండ్ కోర్టు నిరాకరించింది. దీంతో రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

### అంకాపూర్‌లో భారీ కుంభకోణం..

# ఆదర్శ గ్రామానికి అవినీతి మరక

మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా మక్కల కొనుగోళ్లలో రూ.కోట్లు స్వాహా ?
అవినీతిపై ఆరా తీస్తున్న ఇంటెలిజెన్స్ వర్గాలు




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జాతీయస్థాయిలో ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన అంకాపూర్ గ్రామంలో అవినీతి కుంభకోణం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. అంకాపూర్ పిఎసిఎస్ చైర్మన్ కోట్లు స్వాహా ఉదంతంతో ఆదర్శ గ్రామానికి అవినీతి మరక అంటుకుంది. బయట పడిన స్థానిక పిసిఎసిఎస్ చైర్మన్ మార గంగారెడ్డి అవినీతి భాగోతం అంత ఇంత కాదని అంకాపూర్ గ్రామ రైతాంగానికి తలవంపులు తెచ్చేదిగా ఉందంటూ ప్రతిపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్‌చైర్మన్‌గా ఉన్న గంగారెడ్డి మక్కల కొనుగోళ్లలోనూ రూ.కోట్లలో కుంభకోణానికి పాల్పడ్డారని ఇదివరకే ఆరోపణలు మూట గట్టుకున్నారు. తాజాగా అంకాపూర్ పిఎసిఎస్ చైర్మన్‌గా అవినీతికి పాల్పడి రూ.30 లక్షలు కొట్టేసిన వైనం వెలుగు చూసింది. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా సొసైటీ గోదాంను మార గంగారెడ్డి అమ్ముకున్నారని ఆయనపై వచ్చిన తాజా అభియోగం. నాలుగు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన ప్రస్తుత ఆర్మూర్ బిజెపి ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి రూ.25 లక్షలకు గోదాంను కొనుక్కున్నారు. దీంతో ఆగ్రహం కట్టలు తెంచుకున్న కొందరు అంకాపూర్ రైతులు అమ్మడానికి చైర్మన్ గంగారెడ్డి ఎవరు ? కొనుక్కోవడానికి ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఎవరు ? అని నిలదీస్తున్నారు. వారిద్దరూ అంకాపూర్ ఆదర్శం గ్రామ తులసివనంలో గంజాయి మొక్కలని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా గోదాం అమ్మితే వచ్చిన రూ.25 లక్షలకు లెక్క చెప్పని చైర్మన్ గంగారెడ్డి గురడిరెడ్డి సంఘం సొసైటీకి వచ్చిన మరో రూ. 5 లక్షలను కూడా మాయం చేశారని, దీంతో కలిపి మొత్తం రూ.30 లక్షలను మార గంగారెడ్డి స్వాహా చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సొసైటీ చైర్మన్ నిర్వాకంపై అంకాపూర్ రైతాంగం రగిలిపోతోంది. ఈ నేపథ్యంలో రూ.30 లక్షలకు లెక్కలు చూపాలని సొసైటీ డైరెక్టర్ వినోద్‌రెడ్డి నిలదీశారు. ఆయన చైర్మన్ గంగారెడ్డి అవినీతి భాగోతంపై సొసైటీ కార్యదర్శికి ఫిర్యాదు కూడా చేశారు. దీంతో తనపై ఫిర్యాదు చేసిన వినోద్‌రెడ్డిపై చైర్మన్ గంగారెడ్డి గుర్రుగా ఉన్నారు. అంతా నా ఇష్టం లెక్కలు చెప్పను, ఏం చేసుకుంటావో చేసుకో అని గంగారెడ్డి అహంకారం ప్రదర్శించాడు. దీనిపై ఏ మాత్రం వెనక్కి తగ్గని వినోద్‌రెడ్డి లెక్కలు చూపాల్సిందేనని పట్టుబట్టాడు. దీంతో నెల రోజుల తర్వాత లెక్కలు చెబుతానని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చిన మార గంగారెడ్డి నెల గడిచినా లెక్కలు చెప్పకపోవటంతో వినోద్‌రెడ్డి మహర్షి సినిమా తరహాలో ఆందోళనకు దిగాడు. ఒంటరిగానే నడి గ్రామంలో నిరాహార దీక్ష చేపట్టాడు. నిరాహార దీక్షకు దిగిన వినోద్‌రెడ్డిపై విడిసి చైర్మన్ దీక్షా శిబిరం వద్దకు వచ్చి బెదిరింపులకు దిగాడు. అవినీతిని ప్రశ్నించినందుకు రూ.12 వేల జరిమానా విధిస్తున్నట్లు ప్రకటించాడు. ఇదిలా ఉండగా బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అంకాపూర్ పిఎసిఎస్ చైర్మన్‌గా ఆ తర్వాత మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పదవులు సాధించి కోట్ల రూపాయలు కూడబెట్టుకున్న మార గంగారెడ్డి తన అవినీతి భాగోతాన్ని కప్పి పుచ్చుకునేందుకు అధికార కాంగ్రెస్ పంచన చేరారు. పేరుకు అధికార కాంగ్రెస్‌లో ఉన్నా స్థానిక బిజెపి ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డితో సఖ్యతగా ఉంటూ ఇద్దరు అవినీతి సొమ్మును పంచుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. గంగారెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్న ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్ రెడ్డికి కూడా గంగారెడ్డి అవినీతిలో వాటా ఉన్నదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో అంకాపూర్ అవినీతిపై సిఎం రేవంత్ సీరియస్‌గా ఉన్నట్లు కాంగ్రెస్ కార్యకర్తలు సైతం చర్చించుకుంటున్నారు. అసలు గంగారెడ్డిని పార్టీలోకి ఎందుకు తీసుకొచ్చారని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డిపై కాంగ్రెస్ పెద్దలు అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. గంగారెడ్డి అవినీతిపై ఇంటలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం. కాగా అనుమతి లేకుండా గోదాం అమ్మి రూ.25 లక్షలు, గురడిరెడ్డి సంఘం ఇచ్చిన మరో రూ.5లక్షలు స్వాహా చేసిన మార గంగారెడ్డి అవినీతి భాగోతంపై వెంటనే ప్రభుత్వం విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని అంకాపూర్ గ్రామ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### పూర్తయిన సర్వేలు...

# నేటి నుంచి గ్రామ సభలు

పేదరికానికి పని దినాలు ప్రామాణికమా...?
రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులకు లబ్ధిదారుల ఎంపిక



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నాలుగు పథకాలను అమలు చేయనుంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్‌కార్డులు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికకు చేపట్టిన సర్వే పూర్తయింది. ఈ సర్వే ఆధారంగా ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో బహిర్గత పరిచి గ్రామసభ ఆమోదం తీసుకుంటారు. అర్హత కలిగిన వారు లబ్ధిదారులుగా ఎంపిక కాకపోతే గ్రామసభలో పరిశీలించి తగు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల పాటు గ్రామసభలు నిర్వహించనున్నారు. ఈనెల 21, 22, 23 తేదీలలో వివిధ సమయాల్లో జరిగే గ్రామ సభలకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు నేతృత్వం వహించనుండగా ప్రత్యేకాధికారులు లబ్ధిదారుల ఎంపికలో కీలక భూమిక పోషించనున్నారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి సర్వేలే ప్రామాణికం కానున్నాయి.

**రైతు భరోసా :** జనవరి 26 నుంచి రైతు భరోసా పథకాన్ని అమలు చేయనున్నారు. భరోసా అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని కోణాల్లో కసరత్తు చేసిన తర్వాత సాగుకు అనుకూలమైన భూమికి రైతు భరోసాను వర్తింపజేయనుంది. ఇందుకు సంబంధించి రెవెన్యూ గ్రామాల వారీగా వ్యవసాయ అధికారులు సర్వే చేసి రైతుభరోసా లబ్ధిదారుల జాబితా సిద్ధం చేశారు. ఆ జాబితా గ్రామసభలో చదివి వినిపిస్తారు. అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితాను సిద్ధం చేస్తారు. భూమికి పరిమితి లేకుండా సాగు చేస్తున్న భూమికి ఎకరాకు రూ. 12వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

**ఇందిరమ్మ ఆత్మీయ భరోసా :** భూమి లేని నిరుపేదల ఖాతాల్లో ఏడాదికి రూ.12వేల చొప్పున రెండు దఫాలుగా జమ చేయనున్నారు. ప్రభుత్వ లక్ష్యం గొప్పదే అయినా పథకం లబ్ధిదారుల ఎంపికకు తీసుకున్న నిబంధనలు సరికావని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదరికానికి జాతీయ ఉపాధి హామీ పనులు కొలబద్ద కాదని ఆర్థికస్థితి గతుల ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరుతున్నారు. రోజు కూలీ డబ్బులు వస్తే తప్ప పూట గడవని నిరుపేదలు జాతీయ ఉపాధి హామీ పథకానికి వెళ్లటం లేదు. కూలీ గిట్టుబాటు కాకపోవడం, కూలీ డబ్బులు సకాలంలో రాకపోవడం, నిరుపేద వ్యవసాయ కూలీలు ఉపాధి హామీ పనుల పట్ల ఉత్సుకత ప్రదర్శించ లేదు. జాతీయ ఉపాధి హామీ పథకంలో ఏడాదికి 20 రోజులు పనిచేస్తేనే నిరుపేదలు వారికే పథకాన్ని వర్తింపజేస్తామన్న విధానం అర్థం లేనిది. భూమి, ఇతర ఆదాయ మార్గాలు లేకుండా కేవలం కూలీపై ఆధారపడి జీవించే వారికి వర్తింపజేయాలని పేదలు డిమాండ్ చేస్తున్నారు. 20 రోజుల పని దినాల మాటున లబ్ధిదారుల సంఖ్యను తగ్గించే ప్రయత్నం తప్ప మరొకటి కాదన్న విమర్శ వ్యక్తమవుతుంది.

**ఇందిరమ్మ ఇండ్లు :** సొంత స్థలాల్లో ఇండ్లు నిర్మించుకుంటే ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించింది. ప్రతి నియోజకవర్గంలోనూ ఏడాదికి 3,500 ఇండ్ల చొప్పున తొలి ఏడాదిలో రాష్ట్ర వ్యాప్తంగా 4,16,500 ఇండ్లను నిర్మించనున్నారు. నిరుపేదలను తొలి దశలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా ఎంపిక చేయనున్నారు. ప్రభుత్వ లక్ష్యం ప్రశంసనీయమే అయినా గ్రామస్థాయిలో రాజకీయ జోక్యంతో పథకం పేదల దరిచేరే అవకాశం లేకుండాపోయే ప్రమాదం ఉందని పేదలు ఆందోళన చెందుతున్నారు. రాజకీయ జోక్యాన్ని నివారించి పేదలకు లబ్ధిచేకూరేలా ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

**నూతన రేషన్ కార్డులు :** నూతన రేషన్‌కార్డులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశంసించక తప్పదు. దశాబ్ద కాలానికి పైగా రాష్ట్రంలో రేషన్ కార్డులు జారీ చేయలేదు. పెళ్లిళ్లు అయి వేరు కాపురాలు పెట్టిన రేషన్‌కార్డులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగినప్పటికీ రేషన్‌కార్డులో నమోదు చేయించుకునే అవకాశం రాలేదు. ఇప్పుడు ఈ రెండింటికి రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. అర్హతలు కలిగిన వారికి నూతనంగా రేషన్‌కార్డులను జారీ చేయనున్నారు. అయితే ప్రజాపాలనలో రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోగా సర్వేలో ఆ దరఖాస్తులు వెలుగుచూడలేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రతిష్ఠాత్మక పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఎలాంటి పైరవీలకు తావులేకుండా నిర్వహించి అసలైన అర్హులకు లబ్ధిచేకురేలా జాబితాను రూపొందించాలని కోరుతున్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికా రులకు సూచించారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన తహ సీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్‌తో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 25వరకు అధికారులు ఆయా గ్రామా ల్లో సర్వే చేపట్టి అర్హులను గుర్తించి గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాల న్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సి పల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

## టిబిని సకాలంలో గుర్తిస్తే నివారించొచ్చు

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం



ప్రజాపక్షం/సూర్యాపేట(పెన్‌పహాడ్): టిబి వ్యాధిని సకాలంలో గుర్తిస్తే నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. సోమవారం మండలంలోని చెట్లము కుందాపురం గ్రామంలో డాక్టర్ స్రవంతి ఆధర్యంలో నిక్షయ శివర్ క్యాంపు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యపానం, ధూమ పానం, పోషకాహార లోపంతో బరువు తక్కువగా ఉన్న 35 మందిని గుర్తించి వారి నుండి కళ్ళె(తే మద) నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు తెలి పారు. 76 మందికి ఎక్స్ రే నిర్వహించి తేమడ పరీక్షలో క్షయ వ్యాధి నిర్ధార ణ అయిన వారికి ఆరు నెలలు ఉచితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా మందులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నజియా, డాక్టర్ శ్రీశైలం, ఎంపిహెచ్‌ఈఓలు బూతరాజు శ్రీనివాసులు, టి చంద్రశేఖర్ రాజు, ఎల్‌టి లింగాల రాజు, సీనియర్ టిబి సూపర్‌వైజర్ ప్రిన్సి, ఎంపిహెచ్‌ఎలు ఇందిరా, సునీత, ప్రసాద్, మాధవరెడ్డి, నాగలక్ష్మీ, లుర్థమ్మ, రాధా, పంచాయతీ కార్యదర్శులు జానకిరాములు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యారంగ అభివృద్ధికి 'సువెన్' కృషి భేష్

### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



ప్రజాపక్షం/చివ్వెంల: విద్యారంగ అభివృద్ధికి సువెన్ ఫార్మసుటికల్ చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ పాఠశాల మరమ్మతులు, మరుగు దొడ్ల నిర్మాణం, ద్యూయల్ డేంచెస్ డార్మెంట్ రూమ్స్, డ్రైనేజీతో పాటు పలు మరమ్మతుపనులకు పరిశీలించారు. వాటికి సంబంధించిన ఖర్చును అంచనా వేసి త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సువెన్ ఫార్మసుటికల్ ప్రతినిధుల బృందం, ఉపాధ్యాయులు ఉన్నారు.

## బ్యాంకింగ్ సేవలు అభినందనీయం

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: ఉద్యోగులు, కలె క్టరేట్‌కు వివిధ పనుల కో సం వచ్చే వారి కోసం ప్ర త్యేకంగా సమీకృత కలెక్ట రేట్ కార్యాలయంలో ఎస్ బిఐ బ్రాంచీని ఏర్పాటు చే సి ప్రత్యేక సేవలు అం దిం చడం అభినందనీ యమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్‌బిఐ ఇంటెన్సివ్ బ్రాంచీని అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బ్యాంకు ద్వారా ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నగదు లావాదేవీలు, సాయంత్రం 6 గంటల వరకు క్యాస్‌లెస్ లావాదేవీలు జరుగుతాయని తెలి పారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాల న్నారు. ట్రజరీ ద్వారా ప్రభుత్వ లావాదేవీలు ఈ బ్యాంకు ద్వారా జరపాల న్నారు. బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఉపేంద్రభాస్కర్, ఎల్‌డిఎం బాపూజీ, బ్యాంకు మేనేజర్ అఖిల, సిబ్బంది ఉన్నారు.

## సర్వేను పగడ్బందీగా చేయాలని ఆర్‌డిఒకు వినతి



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండలంలోనీ గ్రామాలలో సర్వేను పకడ్బం దీగా చే యాలని సిపిఐ ఆధ్వ ర్యంలో ఆర్‌డిఒ వి.శేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాలలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అవకతవకలకు పాల్పడకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ మండల సహాయ కార్యద ర్శులు చిలివేరు అంజయ్య, పొట్ట శంకరయ్య, కలకొండ సంజీవ, కొండూరు విప్లవ్ వీరమల్లయాదయ్య, పల్లెమల్లారెడ్డి,యాదగిరి,పెంటయ్య పాల్గొన్నారు.

## అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే సామ్యూల్



ప్రజాపక్షం/అడ్డగూడూరు: తు ంగతుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. సోమ వారం మండలంలోని ధర్మారం గ్రామం లో ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్ నిధుల తో చేపట్టిన రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం శంకుస్థాపనకు ము ఖ్య అతిథులుగా విచ్చేసి శంకుస్థాపన చేసారు. ఆయన మాట్లాడుతూ తన గ్రామాన్ని అభివృద్ధితో పాటు నియోజక వర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపి స్తా నన్నారు. కొందరు చిల్లపనులు చేస్తు న్నారని మానుకోవాలని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో ధర్మారం గ్రా మ కాంగ్రెస్ నాయకులు కత్తుల రమేష్, లాదినేని పూర్ణచందర్, ముత్తయ్య, నాగయ్య, నాగయ్య, చంద్రయ్య, కొము రయ్య, యాదయ్య, నర్సహ్మ, వెం కన్న, నర్సింగరావు, సైదులు, గం గయ్య, మండల నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### మంత్రి కోమటిరెడ్డి
### పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు శంకుస్థాపన



ప్రజాపక్షం /నల్లగొండ (తిప్పర్తి): దేశానికి రైతు వెన్నె ముక అన్నది నిజం చేసి రైతుల సంక్షేమానికి కృషి చేస్తు న్న ప్రభుత్వం తమదేనని రాష్ట్ర రోడ్లు ,భవనాలు ,సిని మాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నా రు. సోమవారం ఆయన తిప్పర్తి మండలంలో పలు అభి వృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు శంకు స్థాపన చేశారు. ముందుగా మంత్రి తిప్పర్తి మం డలం పర్యారులో పిఎసిఎస్ భవనాన్నీ , ప్రాథమిక వై ద్య ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనం తరం పిఎసిఎస్ గోడౌన్ ప్రారంభించారు. నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, డిసిసిబి నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతు దేశానికే వెన్నెముక అనే నానుడిని నిజం చేసేలా తమ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నదని, దీనిలో భాగంగా ఉచిత విద్యుత్తు, రైతు రుణ మాఫీ చేశామని, ఈనెల 26 నుండి రైతు భరోసా కార్యక్రమాలను అమలు చేయనున్నదని చెప్పారు. తిప్పర్తి జంక్షన్ అభివృద్ధికి రూ.తొమ్మిది కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రైతు రుణమాఫీలో నల్లగొండ జిల్లానే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. రైతులు కిసాన్ క్రెడిట్ కార్డులను ఉపయోగించుకోవాలని, త్వరలోనే తిప్పర్తి సహకార బ్యాంకుకు స్థలాన్ని మంజూరు చేస్తా మని కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సంపత్ రెడ్డి ,ఆర్ అండ్ బి అధికారులు,ఆర్డిఓ అశోక్ రెడ్డి ,తహసిల్దార్ ,మాజీ జెడ్పిటిసి రామ్‌రెడ్డి ఉన్నారు .



## దేవాలయ అభివృద్ధికి సహకారం ఎప్పుడు ఉంటుంది

ప్రజాపక్షం/నల్లగొండ (కనగల్ ): కనగల్ మండలం లోని ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంక టరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ దేవాలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకా రోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాలకవర్గం చైర్మన్, డైరెక్టర్లు బాధ్యతగా పనిచేయాలని, దేవునికి సేవ చేస్తూనే భక్తు లకు సౌకర్యా లు కల్పించాలని, దేవాలయాన్ని, పరిస రాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కనగల్ మండ లంలో రహదారుల అభివృద్ధికి గాను రోడ్లు, భవనాల శాఖ ద్వారా సుమారు రూ.100 కోట్లను ఇది వరకే మంజూరు చేసామని, దోరేపల్లి నుండి పగిడి మర్రి, కుర్రంపల్లి వరకు రూ.50 కోట్లు, పగిడిమర్రి నుండి సోమన్నవాగు, సాగర్ రోడ్డు వరకు రూ.40 కోట్లు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. 26 నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయ నున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అందరికీ అంద జేస్తామని మంత్రి తెలిపారు. ప్ర భుత్వం కొత్తగా 40 లక్షల రేషన్ కార్డులు ఇవ్వనున్నదని, 27నుండి రేషన్ కార్డులతో పాటు ,ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వనున్నామని, పాత రేషన్ కార్డులు అలాగే కొన సాగుతాయని, కొత్త కార్డులు 40లక్షలు ఇవ్వనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. కాగా దర్వేసిపురం రేణుక ఎల్లమ్మ నూ తన పాలకమండలి చైర్మన్ గా వెంకట్ రెడ్డి, డైరెక్టర్లు ప్ర మాణం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వై.అశోక్‌రెడ్డి , ఆర్ అండ్ బి అధి కారులు, తహసీల్దార్, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జాబితాలోపేర్లు లేకుంటే ఆందోళన వద్దు

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నల్లగొండటౌన్: ఈనెల 26 నుండి అత్యంత ప్రతి ష్టాత్మకంగా అమలు చేయనున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు నిరంతరం కొనసాగే పథకాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా గతంలో ఈ పథకాలకు దర ఖాస్తు చేసుకుని ఉండి, అర్హుల జాబితాలో పేర్లు లేనట్లయితే ఆందోళన పడాల్సిన అవసరం లేదని,21 నుండి 24 వరకు నిర్వహించనున్న గ్రామసభలలో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె స్పష్టం చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆమె కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సంద ర్భంగా జిల్లా అధికారులతో గ్రామ సభల నిర్వహణ విషయమై ఆమె మాట్లాడుతూ గ్రామ సభలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్యను ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాలలో గ్రామస భలు నిర్వహించే విషయాన్ని ప్రజలకు తెలపాలని, రైతు భరోసా పథకంలో భాగంగా గ్రామ సభలలో వ్యవసాయ యోగ్యం కానీ, అర్హతలేని జాబితాను చదివి వినిపించాలని చెప్పారు. అలాంటి వాటిపై ఏవైనా అభ్యంతరాలు వచ్చినట్ల యితే నమోదు చేసుకొని గ్రామసభ తీర్మాణం మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ కార్డులకు సంబంధించి కొత్తగా దర ఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఎంపిడిఒ లాగిన్ ద్వారా జిల్లా స్థాయికి, తద్వారా రాష్ట్ర స్థాయికి పంపించాలని, ఇదివ రకే ఉన్న రేషన్ కార్డులలో కొత్తగా పేర్లను జోడించేందుకు తహసీల్దారు లాగిన్ ద్వారా డిఎస్ఒ, జిల్లా కలెక్టర్ నుండి రాష్ట్రస్థాయికి పంపించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో పేర్ల జోడింపుకు సుమారు 77,000 దరఖాస్తులు లాగిన్‌లో ఉన్నా యని, వీటన్నింటిని గ్రామసభలలో చదివి వినిపించి ఒకవేళ ఎవరైనా లేనట్లయితే గ్రామసభ ఆమోదంతో అలాంటి పేర్లు తీసివేయాలన్నారు. అలాగే రేషన్ కార్డుల కోసం ఎవరైనా దర ఖాస్తు చేసుకుంటే తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామసభలను పకడ్బందీగా నిర్వహిం చేందుకు ముందుగా అన్ని బృందాలకు వెంటనే శిక్షణ కార్య క్రమాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ సభల నిర్వహణలో ఏలాంటి ఒడిదుడుకులు లేకుండా నిర్వహించాలన్నారు. ప్రత్యేక కలెక్టర్ నటరాజ్, డిఆర్‌డిఒ శేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవ సాయ అధికారి శ్రవణ్, గృహ నిర్మాణ పిడి రాజ్ కుమార్, డిఎస్ఒ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు ఉన్నారు.

## ఘనంగా కామ్రేడ్ బొడ్డుపల్లి శేఖర్ వర్ధంతి

### విద్యార్థుల పోరాటపు విప్లవ బావుటా అమరజీవి బొడ్డుపల్లి శేఖర్




ప్రజాపక్షం/దేవరకొండ : నల్గొండ జిల్లా దేవర కొండ నియోజకవర్గంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేసి మతో న్మాదుల చేతిలో హత్యగావించబడ్డ ఎఐఎస్ఎఫ్ మాజీ నల్గొండ జిల్లా సహాయ కార్య దర్శి అమర జీవి బొడ్డుపల్లి శేఖర్ 23వ వర్ధంతిని సోమవారం ఎఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ సమితి ఆధ్వర్య ంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండలోని బొడ్డుపల్లి శేఖర్ స్మారక స్థూపం వద్ద శేఖర్ చిత్రపటానికి ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్య క్షులు వలమల్ల ఆంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.జిల్లా అధ్యక్షులు మాట్లాడు తూ అలుపెరుగని పోరాట యోధుడు కామ్రేడ్ బొ డ్డుపల్లి శేఖర్‌ని విద్యార్థుల హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం రాజీలేని అలుపెరుగని పోరాటం నిర్వహించిన వీరుడు అని అన్నారు. దేవరకొండ ప్రాంతంలో విద్యార్థుల తలలో నాలుగ లాగా నిరంతరం సమస్య ఎక్కడ ఉంటే బొడ్డుపల్లి శేఖర్ అక్కడ ఉండి పరిష్కారం అయ్యే వరకు రాజీలేని పోరాటం నిర్వహించాడని వారు కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ఎఐఎస్ఎఫ్ సంఘం పునరంకితమై మరిన్ని పోరాటాలు, మరింత ఉత్తేజంతో విద్యార్థుల కోసం ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం పెం డింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షి ప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చే శారు. ఎఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు సురిగి విన య్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, రైతు సం ఘం మండల కార్యదర్శి పల్లా రంగారెడ్డి, ఎఐఎస్ ఎఫ్ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శంషోద్దీన్, డివిజన్ కోశా ధికారి శివకుమార్, గర్ల్స్ కన్వీనర్ జ్యోతి, కో కన్వీనర్ స్వాతి, వీణ, మండల కార్యద ర్శి దినేష్, పట్టణ కార్యదర్శిసిద్దార్థ్, పాల్గొన్నారు.

## గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కృషి

### దేవరకొండ ఎంఎల్ఏ బాలునాయక్



ప్రజాపక్షం/చింతపల్లి : గ్రామాలలో మౌలిక వసతులు కల్పించి, వాటి అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ శాసనస భ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. మం డల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్ గౌడ కొండ్లలో సిసి రోడ్ల నిర్మాణ పనులకు బాలునా యక్ సోమవారం శంకుస్థాపన చేశారు. బాలు నాయక్ మాట్లాడుతూ ప్రతి గ్రామం నుండి మండల కేంద్రానికి బిటి రోడ్లను ఏర్పాటు చేస్తా మన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్ప డిన అనతికాలంలోనే ఘనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. అదే విధంగా దేవరకొండ నియోజకవర్గాన్ని కూడా అభివృద్ధిపథంలో నడి పించేందుకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. తదనంతరం మదనాపురం గ్రామ పరిధిలోని శ్రీ లక్ష్మీ నర్సింహ్మా స్వామి దేవాలయ నూతన పాల కవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బాలునా యక్ పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాం క్షలు తెలిపారు. అనంతరం లక్ష్మీ నర్సింహ్మా స్వా మిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో మాల్ వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నాగభూ షణం, మాజీ ఎంపిపిలు భవాని పవన్‌కుమార్, రవినాయక్, యాదగిరిగౌడ్, ముచ్చర్ల యాద గిరి, వెంకటయ్యగౌడ్, దోతిరెడ్డి, నర్సింహారెడ్డి, హరినాయక్, నర్సింహ్మా, గోవర్ధన్, వెంకటయ్య, భాస్కర్, శ్రీనివాస్‌యాదవ్, కొండల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం




ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చింతలచెరువు రోడ్డులో నిర్వహి స్తున్న మహాత్మ జ్యోతిరావుపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల(మద్దిరాల) విద్యాలయంలో 9వ తరగతి చదు వుతున్న విద్యార్థిని వల్లపు హర్షిత సోమవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ప్రిన్సిపల్ జ్యోతి తెలిపిన వివరాల ప్రకారం సంక్రాంతి సెలవులకు తన స్వంత గ్రామమైన చివ్వెంల మండలంలోని బిబిగూడెంకు వెళ్లిన హర్షిత తిరిగి పాఠశాలకు చేరుకున్న అర్ధగంట వ్యవధిలోనే హాస్టల్ గదిలోని ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకోగా ఆ గదివైపు వెళ్లిన కొంత మంది విద్యార్థినీలు చూసి సమాచారం అందించడ ంతో ఉరివేసుకోని వేలాడుతున్న ఆమెను కిందకు దిం పారు. వెంటనే చికిత్స కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం హర్షిత జనరల్ ఆసుపత్రిలోని ఐసియు లో చికిత్స పొందుతుంది. కాగా కుటుంబ సభ్యులు మాత్రం ప్రిన్సిపల్ వేధింపులతోనే ఆమె ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు ఆరోపించారు.

## పంటచేతికి రాలేదని రైతు ఆత్మహత్య



ప్రజాపక్షం/మానవపాడు/ఉండవెల్లి : అప్పుల బాధతో ఆత్మహత్య బి.శేఖర్ రెడ్డి (32) అనే యువ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జోగు లాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మానవపాడు గ్రామా నికి చెందిన బొంకూరు శేఖర్ రెడ్డి గత మూడేళ్ళ నుంచి పంటలు పండిస్తూ, దిగుబడులు రాక అప్పుల్లో కూరుకుపోయినట్లు తెలిపారు. ఈ సారైనా పంటలు బాగా పండితే అప్పులు తీర్చుదామని అనుకున్నాడు. ఆర్డీఎస్‌కు సాగునీరు రాకపో వడం మిర్చి పంటకు పూర్తిగా తెగులు వ్యాపించడంతో మిర్చి పంట పూర్తిగా నష్టం వాటిల్లింది. ఈ సంవత్సరం కూడా పంటలు రాకపోవ డంతో అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపం చెంది తన సొంత పంట పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పంట పొలంలో ఉన్న రైతును గమ నించి హూటాహూటిన మానవపాడు ఆసుపత్రికి తరలించారు. దీంతో అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం అలంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆస్పత్రి అధి కారులు తెలిపారు. ఈ విషయం గురించి పోలీసులకు వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం రాలేదని సమాచారం రాగానే తెలియజేస్తామని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నట్లు సమాచారం.

## వదంతులు నమ్మొద్దు



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: ప్రజా సంక్షేమం కోసమే పథకాలు అమలు చేస్తున్నామని అర్హులందరికీ ప్రతి సంక్షేమ పథకం అందుతాయని జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మండలంలోని కప్రాయిపల్లి గ్రామంలో పథకాల అర్హుల పరిశీలన సర్వేను సోమవారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించనున్న నాలుగు సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరిని అర్హులు చేసే విధంగా గ్రామసభలను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు తెలిపారు. గ్రామంలో రేషన్ కార్డులో పేరు రాని వారిని తిరిగి అప్లికేషన్ చేసుకునే విధంగా తగిన సూచనలు అందించాలని కోరారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా గ్రామసభల ద్వారా ప్రజలకు అనుమానాలు అపోహలు నివృత్తి చేసి దానికి అనుగుణంగా వ్యవహరించాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారి సునంద, ఇన్చార్జి ఎమ్మార్వో నాగేశ్వరరావు, ఎంపీడీవో రాపర్తి భాస్కర్, గిర్దవార్ వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, సర్వే సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పోలీస్ క్రీడాకారుల ఎంపిక



ప్రజాపక్షం/సూర్యాపేట: తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీ డలకు 5వ జోనల్ పోలీస్ క్రీడాకారులను అడిషనల్ ఎస్పి నాగేశ్వర్‌రావు, ఎఆర్ అదనపు ఎస్పి జనార్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో సోమవారం ఎంపిక చేశా రు. సూర్యా పేట, నల్ల గొం డ జిల్లాల పోలీస్ సిబ్బం దికి క్రీడలు నిర్వహించి రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025కు ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లా పోలీస్ ఫరేడ్ గ్రౌండ్‌లో క్రీడలు నిర్వహించి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక చేశారు. ఎం పికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారుల జట్లు రాష్ట్ర స్థాయిలో పాల్గొనున్నట్లు వారు తెలిపారు. పురుషులు, మహిళల విభాగంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, జావె లిన్‌త్రో, హైజంప్, లాంగ్ జంఫ్, షాట్ పుట్, ఫుడ్ బాల్, బాట్మింటన్, పరు గు పందెలు, టగ్ ఆఫ్ వార్ జట్లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎ ఆర్ డిఎస్‌పి నర్సింహ్మాచారి, నల్లగొండ ఆర్ఐలు హరిబాబు, శ్రీనివాస్, ఆర్ ఎస్ఐలు సురేష్, రాజశేఖర్, ఎం అశోక్, కె అశోక్, సాయిరాం పాల్గొన్నారు.

## సిపిఐ నేత సత్యంకు పరామర్శ



ప్రజాపక్షం/మునుగోడు: ఇటీవల అనా రోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాతృమూర్తి నెల్లికంటి పార్వతమ్మ చిత్ర పటానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ స భ్యులు ఈటి నరసింహ,హైదరాబాద్ జి ల్లా కార్యదర్శి ఛాయాదేవి,సహాయ కార్య దర్శి బి స్టాలిన్,నరేష్ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిధి లోని ఎల్లగలగూడెం గ్రామంలో సత్యం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సూరిగి చలపతి, బి లాలు, ఈధులకంటి కైలాస్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామకార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి



ప్రజాపక్షం/మిర్యాలగూడ: గ్రామపంచాయతీ విధులను దుర్వినియోగం చేస్తూ అవినీతి, అక్ర మాలకు పాల్పడుతున్న మిర్యాలగూడ మం డలం అవంతీపురం గ్రామపంచాయతీ కార్య దర్శి సోమిరెడ్డి గాయత్రిపై తగు చర్యలు తీసు కోవాలని అవంతీపురం గ్రామవాసులు సోమ వారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు విన తిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులను సొంత ప్రయోజనాలకు వాడుకోవడంతోపాటు అక్రమ లేఅవుట్‌లను ప్రోత్సహిస్తూ గ్రామపంచాయతీ ఆదాయా నికి గండి కొడుతున్న గాయత్రి విధుల పట్ల పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. గ్రామపంచా యతీ పరిధిలోని పలు భూములకు ఇష్టానుసారంగా రిజిస్ట్రేషన్ చేయిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని, గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్, ట్రాలీలకు రిజిస్ట్రేషన్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేయించకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని తెలిపారు. గ్రామంలో అందుబాటులో ఉండకుం డా తనకిష్టమైన సమయంలో గ్రామపంచాయతీకి రావడంతోపాటు సిబ్బందిపై పలుమార్లు ఒత్తిడికి గురి చేసినట్లు ఆరోపిం చారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారి లో వల్లపుదాసు సురేష్, నాగరాజు, చిరంజీవి, కుమార్ తదితరులు ఉన్నారు.

## రాధేయ సాహిత్య కృషి అజరామరం



ప్రజాపక్షం/నల్లగొండటౌన్: తెలుగు సాహిత్యంలో మాతృ కవి రాధేయ విశిష్టమైన సేవ లు అందించారని ఉస్మా ని యా విశ్వవిద్యాలయం తెలు గు శాఖ పూర్వ అధ్యక్షులు ఆర్షకవి ఆచార్య మసన చెన్న ప్ప అన్నారు. రాచమల్ల చారి టబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నల్లగొండలో జరిగిన మాతృమూర్తి రాచమల్ల లచ్చమ్మ మాతృకవి రాధేయ స్మారక పురస్కార ప్రదానోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసం గించారు. డాక్టర్ ఎం.పురుషోత్తమాచార్య అధ్య క్షతన జరిగిన ఈ సభలో ఆచార్య చెన్నప్ప మాట్లాడుతూ అమ్మను అంబేద్కర్‌ను, అన్న ను అత్యున్నతంగా ఆరాధిం చిన వాడు రాధేయ అని కొనియాడారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య సూర్య ధనంజయకు మాతృమూర్తి లచ్చమ్మ పురస్కారాన్ని,న ల్లగొండకు చెందిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ చింతోజు మల్లికార్జు న్‌కు మాతృకవి రాధేయ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో రాచమల్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆచార్య రాచమల్ల శ్యాంసుందర్, విశ్రాంత ఇంగ్లీష్ ప్రొఫసర్ టి.వెంకట రాజయ్య, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, పెరుమాళ్ళ ఆనంద్, రాధే య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో దుండగుల కాల్పులు హైదరాబాద్ యువకుడు రవితేజ మృతి



ప్రజాపక్షం/హైదరాబాద్: అమెరికాలో నెల రోజుల క్రితం తెలంగాణకు చెందిన ఓ విద్యార్థి దుండగుల కాల్పుల్లో మృతి చెందాడు. ఈ వార్త మరవక ముందే మరో హైదరాబాదీ యువకుడు కాల్పుల్లో మృతి చెందడం అతని కుటుంబంలో విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ చైతన్యపురి పరిధిలోని ఆర్‌కెపురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీ రోడ్ నంబర్ 2లో నివసిస్తున్న కొయ్యడ చంద్రమౌళి కుమారుడు రవి తేజ 2022 మార్చిలో అమెరికా వెళ్లాడు. అక్కడ అతను మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. ఈ క్రమంలోనే పార్ట్‌టైమ్ జాబ్ కోసం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో చేరాడు. ఈ క్రమంలో అమెరికా వాషింగ్టన్‌లో దుండగులు జరిపిన కాల్పుల్లో రవితేజ మృతి చెందాడు. ఈ సమాచారం తెలియటంతో ఆ యువకుడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో చైతన్యపురిలోని గ్రీన్ హిల్స్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, అమెరికాలో తరచూ జరిగే కాల్పుల్లో భారత్‌కు చెందిన యువకులు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. రవితేజ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని బంధువులు కోరుతున్నారు.

## గవర్నర్ అవార్డుల జాబితా విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్: గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్2024'ను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా అవార్డులకు ఎంపికైన 8 మంది జాబితాను విడుదల చేసింది. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో ఉత్తమ సేవలందిన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులను అందజేస్తారు. ఇక ఎంపికైన వారికి ఈ నెల 26న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అవార్డులను ప్రదానం చేయనున్నారు. అవార్డు కింద రూ.2 లక్షలు నగదు, జ్ఞాపికను ఇవ్వనున్నారు. దుశర్ల సత్యనారాయణ, అరికపూడి రఘు, పారా ఒలింపిక్ విజేత జీవాంజి దీప్తి, ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు, పి.బి.కృష్ణభారతికి సంయుక్తంగా ఎంపిక, ధ్రువాంశు ఆర్గనైజేషన్, ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రి, ఆదిత్య మోహతా ఫౌండేషన్, సంస్కృతి ఫౌండేషన్ అవార్డులకు ఎంపికై వారు.

## మందుబాబులకు శుభవార్త.. యూబీ కంపెనీ బీర్లు పునరుద్ధరణ

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో మందు బాబులకు బీర్ల సరఫరా సంస్థలు శుభవార్త చెప్పాయి. నిలిచిపోయిన బీర్ల సరఫరాను పునరుద్దిస్తున్నట్లు సంస్థలు వెల్లడించాయి. తెలంగాణలో బీర్ల ధరలు పెంచాలని, పాత బకాయిలు విడుదల చేయాలని డిమాండ్‌తో బీర్ల సరఫరాను వారం క్రితం నుంచి నిలిపివేసిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలో బీర్ల నిల్వలు భారీగా పడిపోయాయి. దీనిపై స్పందించిన యునైటెడ్ బ్రూవరీస్ సంస్థ బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపింది. సెబి రెగ్యులేషన్స్‌కి అనుగుణంగా తెలంగాణ బీవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కి బీర్ల సరఫరాను తక్షణమే అమలులోకి తీసుకొస్తున్నట్లు యూబీ సంస్థ ప్రకటించింది. తాము టిజిబిఎల్ తో నిర్మాణాత్మక చర్చలు జరుపుతున్నామని, బీర్ల ధరల పెంపు, పాత బకాయిల విడుదల వంటి సమస్యలను బేవరేజెస్ కార్పొరేషన్ సమయానుకూలంగా స్పందిస్తామని హామీ ఇచ్చిందని తెలిపింది. ఈ చర్చలు మరింత కాలం కొనసాగుతాయని, వినియోగదారులు, కార్మికులు, వాటాదారుల ప్రయోజనాల దృష్ట్యా ప్రస్తుతానికి టిజిబిఎల్‌కు బీర్ల సరఫరాను పున ప్రారంభించాలని నిర్ణయించినట్లు యూబీ సంస్థ ప్రకటించింది.

## 'కోకాపేట్, నియోపోలిస్'లలో హెచ్ఎండిఎ కమిషనర్, జలమండలి ఎండి పర్యటన

ప్రజాపక్షం/హైదరాబాద్ : నియోపోలిస్, కోకాపేట్ ప్రాంతాల్లో హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి సోమవారం పర్యటించారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాల్లో నీటి అవసరాల దృష్ట్యా రిజర్వాయర్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. గోదావరి ఫేజ్2 ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకుని ఖానాపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు తరలించడానికి నియోపోలిస్‌లో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పంప్ హౌజ్, స్థానిక అవసరాల కోసం రిజర్వాయర్ నిర్మాణానికి స్థలం కావాలని కోరారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా పరిసర ప్రాంతాలకు సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఖానాపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద మంజీరా, కృష్ణా, గోదావరి పథకాల ద్వారా ఎక్కడి నుంచి వచ్చే నీటినైనా ఇక్కడ నుంచి గ్రావిటీ ద్వారా నగరానికి సరఫరా చేసే అవకాశం ఉన్నందున, భవిష్యత్తు అవసరాల కోసం ఇక్కడ రిజర్వాయర్, నీటి శుద్ధి కేంద్రాలు నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గండిపేట్ కాండ్యూట్‌కు రెండు వైపులా మెయింటెనెన్స్ రోడ్లు ఉన్నందున, ఆ భాగం వరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కడైనా కాండ్యూట్ కబ్జాకు గురైనట్లు గమనిస్తే, జలమండలి విజిలెన్స్ అధికారుల సాయంతో తొలగించాలన్నారు. తర్వాత కోకాపేట్ గ్రామంలోని జలమండలి రిజర్వాయర్ ప్రాంగణంలో నిర్మిస్తున్న ప్రెజర్ ఫిల్టర్స్‌ను పరిశీలించారు. ఫిబ్రవరి 15 లోపు వీటి నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ ఫిల్టర్స్ ద్వారా నేరుగా కాండ్యూట్ నుంచి నీటిని సేకరించి శుద్ధి చేసి పరిసర ప్రాంతాలకు సరఫరా చేసే వెసులుబాటు ఉందన్నారు. వేసవి అవసరాల కోసం ఇక్కడ ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, సిజిఎం రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## బిసి కమిషన్‌తో తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక (కటిక్) సంఘ భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : అరె కటిక కులం పేరును యాదావిధిగా కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక (కటిక్) సంఘ ప్రతినిధుల బృందం బిసి కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బిసి కమిషన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక (కటిక్) సంఘ ప్రతినిధులతో బిసి కమిషన్ సమావేశమైంది. ఈ సందర్భంగా అరె కటికల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా తమ కులం పేరును ఆరె కటిక గానే కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న వివిధ కమేళాలను వేలం ద్వారా ఆరకటికేతరులకు కేటాయించడం ద్వారా ఆరె కటికలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్‌ను దక్కించుకున్న వారు ప్రతి మేకను కోయడానికి ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, కొన్ని జిల్లాలలో గ్రామ అభివృద్ధి కమిటీల వారు ఆరెకటికలతో దౌర్జన్యం చేస్తూ వారు చెప్పిన ధరకే మాంసం అమ్మాలని ఒత్తిడి తెస్తున్నారని ప్రతినిధుల బృందం కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఇతర కులాల వారికి కల్పిస్తున్న సౌకర్యాలను ఆరెకటికులకు కూడా కల్పించాలని, ఈ వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరికి రెండు లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఆరెకటికలు ఎక్కడ సంతలు, జాతరలు జరిగితే అక్కడికి వెళ్లి కొంత కాలం పాటు తాత్కాలిక నివాసాలు ఏర్పరుచుకొని మాంసాన్ని విక్రయిస్తారు కాబట్టి వారిని కూడా సంచార జాతులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

## క్యాడర్ మార్పునకు విద్యాశాఖ అనుమతి

ప్రజాపక్షం/హైదరాబాద్: స్పౌస్ గ్రౌండ్ ప్రాతిపదికన లోకల్ క్యాడర్ మార్పునకు విద్యాశాఖ అనుమతినిచ్చింది. లోకల్ క్యాడర్ కోసం దరఖాస్తు చేసుకున్న 834 దరఖాస్తులకు ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు సంబంధిత జిల్లాల్లో ఖాళీ పోస్టుల ఆధారంగా వారిని రిలీవ్ చేయాలని ఆదేశించారు. విద్యాశాఖ డైరెక్టర్ ఇ.వి.నర్సింహా రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్పౌస్ గ్రౌండ్ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, రిలీవ్ చేయాలని, అనంతరం ఏర్పడే ఖాళీలలో కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసుకోవాలని విద్యాశాఖ స్పష్టం చేసింది.

## అధికారులందరూ జవాబుదారీతనంతో పని చేయాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : క్షేత్రస్థాయి ఉద్యోగులు మొదలు అత్యున్నతాధికారుల వరకు జవాబుదారీతనంతో పనిచేయాలని అప్పుడే రైతులకు ప్రయోజనం చేరుకూరుతుందని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశా నిర్దేశనం చేశారు. సోమవారం మార్కెటింగ్ శాఖ ద్వారా చేపట్టిన వివిధ పనుల పురోగతిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులు ఉదయ్ కుమార్‌తో కలసి రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లాల వారిగా మార్కెట్లవారీగా పనుల పురోగతి, పత్తి ,మిర్చి పంటల కొనుగోళ్లకు సంబంధించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మార్కెట్లకి సంబంధించి మీడియాలో వార్తలు వస్తే తక్షణమే స్పందించాలని, ఒకవేళ పరిష్కారం సంబంధిత అధికారి స్థాయిలో లేకపోతే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని అదేశించారు. మార్కెటింగ్ ఇంజనీరింగ్ విభాగంలో చేపట్టిన పనుల పురోగతి అంత ఆశాజనకంగా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాముఖ్యతను బట్టి పనులను పూర్తిచేయాలని, పనుల పురోగతిని ప్రతినెల సమీక్షించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. పత్తి సేకరణకు సంబంధించి 25 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 18 లక్షల మెట్రిక్ టన్నులు మద్ధతు ధరకు సేకరించామని అధికారులు మంత్రికి వివరించారు. దీంతో రైతుల వద్ద మిగిలిన పత్తిని సైతం తక్షణమే సేకరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సూచించారు. ప్రతి మార్కెటింగ్ కార్యదర్శి ఒక పత్తి సేకరణే కాకుండా ప్రతిరోజు మార్కెట్లకు వచ్చే వివిధ రకాల పంట ఉత్పత్తుల అమ్మకాలలో రైతుల పక్షాన ఉండి, వారికి గిట్టుబాటు ధరలు కల్పించే విషయంలో చొరవ చూపాలని, ఫిర్యాదుల విభాగానికి అందిన సమస్యలకు వెంటనే పరిష్కారించాలని ఆదేశించారు. అదేవిధంగా ఫిర్యాదులలో ఎవరిదైనా తప్పని తేలితే తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కమీషన్ ఏజెంట్స్, జిన్నింగ్ మిల్లుల లైసెన్సులు రద్దు చేయడం, ఒకవేళ ఉద్యోగస్తుల ప్రమేయం ఉన్నట్టు తేలితే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి కూడా ఈ ప్రభుత్వం వెనుకాడదని స్పష్టం చేశారు.

## పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తాం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



ప్రజాపక్షం/హైదరాబాద్: పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తామని, పేద ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీనిచ్చారు. రివిజన్‌కు సంబంధించి హాస్పిటళ్లు లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించేందుకు కమిటీ ఏర్పాటు చేసి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని, ఇతర సమస్యలను కూడా పరిష్కరించే బాధ్యత తమదని భరోసానిచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్చించేందుకు వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి, ఆరోగ్యశ్రీ సిఇఒతో సమావేశాన్ని ఏర్పాటు చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పలు హాస్పిటళ్లు ఆరోగ్యశ్రీ సేవలను (నాన్ ఎమర్జెన్సీ) సేవలను నిలిపివేసిన నేపథ్యంలో హాస్పిటల్స్ యాజమాన్యాలతో మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, ఆరోగ్యశ్రీ నెట్వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ రాకేశ్, జనరల్ సెక్రటరీ హరిప్రకాశ్, డాక్టర్ సౌజన్య, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎంప్యానల్‌మెంట్ ఎంఒయూను సవరించాలని, ఆరోగ్యశ్రీ ప్యాకేజీల రేట్లను రివైజ్ చేయాలని వారు కోరారు. ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ చర్చలకు మంత్రి ఆహ్వానించడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో తమతో ఎవ్వరూ ఇలా మాట్లాడలేదన్నారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, జెహెచ్ఎస్ సేవలు యథావిధిగా కొనసాగిస్తామని వెల్లడించారు. గతంలో ఆరోగ్యశ్రీ కింద నెలకు సగటున రూ.50 కోట్ల వరకు విడుదల చేస్తే, ప్రస్తుతం నెలకు సుమారు రూ 100 కోట్ల వరకూ విడుదల చేస్తున్నందుకు వారు ప్రజా ప్రభుత్వానికి దన్యవాదాలు తెలిపారు.

## క్రీడల ద్వారా సమష్టితత్వం, పోరాట స్ఫూర్తి అలవడతాయి

ప్రజాపక్షం/హైదరాబాద్: క్రీడలు వ్యక్తుల మానసిక వికాసానికి, శారీరక వికాసానికి తోడ్పడుతాయని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం గోషామహల్ పోలీసు స్టేడియంలో హైదరాబాద్ పోలీసుల స్పోర్ట్స్ మీట్ 2025 ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పోలీస్ క్రీడాకారులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్‌ను భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు సైనా నెహ్వాల్ , పి.కష్యప్, పోలీసు కమిషనర్ సివి ఆనంద్‌లు క్రీడా జెండాను ఎగురవేయడంతో పాటు, అకాశంలోకి పావురాలను, బెలూన్లను ఎగురవేయగా పోలీస్ క్రీడల జ్యోతి ప్రజ్వలన చేసినారు. ఈ క్రీడల ప్రారంభోత్సవం సందర్భంగా పురుషుల, మహిళలకు ఏర్పాటు చేసిన క్రీడలను, ఆటలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సివి ఆనంద్ మాట్లాడుతూ.. ఈ క్రీడా పోటీల ద్వారా వివిధ పోలీస్ విభాగాల మధ్య సుహృద్భావ వాతావరణం, సమష్టితత్వం ఏర్పడుతుందన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌లో 14 జట్లు పాల్గొనడం ఇదే మొదటిసారి. సైనా నెహ్వాల్ క్రీడాకారిణి.. మాట్లాడుతూ నాకు స్పోర్ట్స్‌లో ఎలాంటి ఆటలు అయినా చాలా ఇష్టం. నేను భారతదేశం తరుపున ఆడినప్పుడు చాలా గర్వంగా ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమములో ఐపిఎస్ అధికారులు విక్రమ్ సింగ్ మాన్, పి.విశ్వప్రసాద్, రక్షిత కృష్ణ మూర్తి, క్రీడల్లో పాల్గొన్న పోలీస్ సిబ్బంది హాజరయ్యారు.

## ఇది హమాలీ కార్మికుల విజయం

ప్రజాపక్షం/హైదరాబాద్ : సివిల్ సప్లయిూస్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న హమాలీలకు ఒప్పందం ప్రకారం సవరించిన హమాలీ ఛార్జీలను పెంచుతూ ఎట్టకేలకు ప్రభుత్వం జిఓను జారీ చేయడం పట్ల ఎఐటియుసి సివిల్ సప్లయిూస్ హమాలీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ధన్యవాదాలు తెలిపారు. ఇది హమాలీ కార్మికుల విజయమని, ఈ పోరాటానికి సహకరించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, హామీల బాధను అర్థం చేసుకుని జిఓ జారీకి చర్యలు తీసుకున్న పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత ఏడాది జనవరి 2వ తేదీతో ఒప్పందం ముగియగా ఆ వెంటనే కొత్తగా ఒప్పందం చేసుకుని హమాలీ ఛార్జీలను సవరించాల్సి ఉండగా, అధికారులు పట్టించుకోకపోవడంతో కార్మికులు వివిధ రూపాల్లో అనేక పోరాటాలు నిర్వహించగా, గత అక్టోబర్ 4వ తేదీన సివిల్ సప్లై కమిషన్ కార్మికుల సంఘాలతో సమావేశమై అప్పటి వరకు ఉన్న క్వింటాలకు రూ.26 లు ఉన్న హమాలీ ఛార్జీలను రూ.29కి పెంచడం జరిగిందని తెలిపారు. అయితే జనవరి వరకు సైతం జిఓ విడుదల చేయకపోవడంతో కార్మికుల నిరవధిక సమ్మె బాట పట్టడంతో ప్రభుత్వం ఎట్టకేలకు జిఓను జారీ చేసిందని తెలిపారు. ఒప్పందం ప్రకారం అంగీకరించిన వాటికి జి.ఓ.విడుదల చేసినందుకు సివిల్ సప్లయిూస్ కమిషనర్ చౌహన్, ఇతర అధికారులకు బాల్ రాజు కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే పెంచిన హమాలీ రేట్ల బకాయిలను తక్షణమే రేట్లను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.అదేవిధంగా సమాన పనికి సమాన వేతనం ఉండాలన్న సుప్రీం కోర్టు తీర్పును సివిల్ సప్లయిూస్ అధికారులు ధిక్కరించి గోడౌన్లలో పని చేస్తున్న మహిళా కార్మికులకు ఇష్టానుసారంగా వేతనాలు పెంచడం దారుణమన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం మహిళలందరికి ఒకే రకమైన వేతనం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరా రు.

దసరా పండుగ సందర్భంగా ఇచ్చే బోనస్, ఇన్సెంటీవ్ గతంలో ఇచ్చిన రూ.6500ల నుండి రూ.7500లకు స్వీటు బాక్స్ రేటును రూ.800ల నుండి రూ.900లకు, రెండు జతల యూనిఫాం ధర రూ.1300ల నుంచి రూ.1600 లకు పెంచడం హర్షనీయమన్నారు. అయితే మహిళలకు బ్లౌజులు కుట్టుకూలీ కోసం 2 బ్లౌజులకు 200లు చెల్లించటం అన్యాయమని తెలిపారు. హమాలీ కార్మికుల దహన సంస్కారాలకు రూ.20 వేలు గతంలో చెల్లిస్తుంటే కొత్త జి.ఓ.లో ఆ విషయాన్ని పొందుపర్చకపోవటాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రభుత్వం వెంటనే జి.ఓ.ను సవరించి రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచి ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లిస్తున్నట్లు చెల్లించాలని ఆయన కోరారు.

## పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవలతో కూడిన.. వినూత్న ప్రాజెక్ట్ 'సిప్.. సేవ్.. స్టైల్'



ప్రాజెక్ట్ గురించి కమిషనర్‌కు వివరించిన విద్యార్థులు... అభినందించిన జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్ : పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవలతో కూడిన వినూత్న ప్రాజెక్ట్ 'సిప్, సేవ్, స్టైల్'ను చేపట్టిన భారతీయ విద్యా భవన్, ఆత్మకూరి రామా స్కూల్ విద్యార్థులు సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఇలంబర్తిని కలిసి ప్రాజెక్ట్‌పై వివరించారు. విద్యార్థులు వారి ప్రాజెక్ట్‌లో ఉపయోగించిన పాల ప్యాకెట్‌లను పారవేయకుండా, వాటిని ఒక దృఢమైన ఫ్యాబ్రిక్‌గా మార్చి, బ్యాగులు, పెన్సిల్ పౌచ్‌లు, ఫోల్డర్ల వంటి పునర్వినియోగ ఉత్పత్తులను తాయారు చేశారు. పర్యావరణ హితం, సామాజిక బాధ్యతతో కూడిన ఈ ప్రాజెక్ట్ ఆదరణ పొందుతూ, ప్రజల్లో అవగాహన పెంచడమే వీరి లక్ష్యమని చెప్పారు. విద్యార్థులు ప్రాజెక్ట్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని నిరుపేదలకు ఆహార పంపిణీకి వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఈ ప్రాజెక్ట్ ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక సేవకు ప్రాధాన్యం ఇస్తూ, సామాజిక బాధ్యతకు నూతన దృక్పథాన్ని పరిచయం చేశారన్నారు. విద్యార్థుల సృజనాత్మకతను ఆయన అభినందించారు.

**ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి**

ప్రజావాణికి ప్రజల నుండి వచ్చిన విన్నపాలకు ప్రాధాన్యతనిచ్చి సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి అధికారులకు సూచించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా గ్రేటర్‌లోని వివిధ ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుండి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి కమిషనర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఆయా విభాగాల అధికారులు శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారం అనంతరం సంబంధిత అర్జీదారునికి తెలియచేయాలన్నారు. ఒకే సమస్యపై అర్జీదారులు పదే పదే ప్రజావాణికి తిరగకుండా పరిష్కరించాలని, పరిష్కారం కానట్లైతే అందుకు గల కారణాలు తెలిపాలన్నారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, ఎస్. పంకజ, గీతా రాధిక, సి.ఎన్. రఘు ప్రసాద్, అశోక్ సామ్రాట్, వేణు గోపాల్ రెడ్డి, అదనపు చీఫ్‌సిటీ ప్లానర్ గంగాధర్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, సి.ఎం.హెచ్.ఓ డాక్టర్ పద్మజ, సి.ఇ కోటేశ్వరరావు, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, డిప్యూటీ సి.ఇ.ఓ పనస రెడ్డి, రెవెన్యూ జె.సి. మహేష్ కులకర్ణి, విజిలెన్స్ ఏ.ఎస్.పి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌టిఎల్ నిర్ధారణతోనే సమస్యలకు పరిష్కారం నాలుగైదు నెలల్లో పూర్తి చేస్తాం

ప్రజావాణిలో హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంతో పాటు ఓఆర్ఆర్ పరిధిలోని చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్(ఎఫ్‌టిఎల్) నిర్ధారణ పూర్తయితే చాలావరకు సమస్యలు పరిష్కారమౌతాయని హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ తెలిపారు. నాలుగైదు నెలల్లో ఓఆర్ఆర్ పరిధిలోని అన్ని చెరువులకు ఎలాంటి సందేహాలకు ఆస్కారం లేకుండా ఎఫ్‌టిఎల్ నిర్ధారణ జరుగుతుందన్నారు. భవిష్యత్తులో చెరువుల కబ్జాకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకూ రంగనాథ్ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 89 ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. నేరుగా కమిషనర్ ఫిర్యాదులు స్వీకరించి, అక్కడికక్కడే ఆయా ప్రాంతాలకు చెందిన అధికారులకు వాటిని కేటాయించడంతో పాటు, క్షేత్ర స్థాయిలో విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. హైడ్రా వచ్చిన తర్వాత వెలసిన నిర్మాణాలను (అనుమతులు లేకుంటే) కూల్చివేస్తామన్నారు. అమీన్‌పూర్ చుట్టూ అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఆ మున్సిపాలిటీ పరిధిలో పూర్తి స్థాయి సర్వే చేయిస్తామన్నారు. మేడ్చల్ జిల్లా నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలోనే మేడికుంట చెరువు 45 ఎకరాల పరిధిలో ఉండేదని, క్రమేణ కబ్జాలు పెరిగి చెరువు కుంచించుకుపోయిందని, అక్కడ నివాసం ఉన్న వృద్ధ దంపతులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మేడికుంట చెరువుకు హద్దులు నిర్ధారించి, ప్రజా అవసరాలకు బఫర్ జోన్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి నియోజకవర్గంలోని డిఫెన్స్ కాలనీలో ప్రజావసరాలకు కేటాయించిన వెయ్యి గజాల వరకు ఉండే స్థలాన్ని స్థానిక ప్రజాప్రతినిధి కబ్జా చేసుకుంటూ వస్తున్నారని, డిఫెన్స్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. మూసాపేటలోని ఆంజనేయనగర్ రోడ్డు నెంబరు 9లో 2 వేల గజాల పార్కు స్థలం కబ్జాకు గురి అవుతోందని, అడ్డుకున్న తమపై దాడికి దిగుతున్నారని స్థానికంగా ఉండే భార్యాభర్తలు వచ్చి ఫిర్యాదు చేశారు. ఈ పార్కును అభివృద్ధి చేయడానికి రూ.50 లక్షలు ప్రభుత్వం విడుదల చేయడం, శిలాఫలకం వేయడం కూడా జరిగిందని చెప్పారు. ప్రహరీ నిర్మాణానికి జిహెచ్ఎంసి ప్రయత్నిస్తుంటే అడ్డుకున్నారని వాపోయారు.

## నేటి నుంచి కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మళ్లీ బహిరంగ విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్: తాత్కాలికంగా వాయిదాపడిన'కాళేశ్వరం'ప్రాజెక్ట్‌పైన జస్టిస్ చంద్ర ఘోష్ కమిషన్ మంగళవారం నుంచి మళ్లీ బహిరంగ విచారణ చేపట్టనుంది. ఇందులో భాగంగానే ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావుకు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి.ప్రకాష్, నీటిపారుదల శాఖ అదనపు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషిని కూడా విచారించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారులతో పాటు ప్రాజెక్ట్‌కాంట్రాక్ట్ సంస్థలకు చెందిన వారిని విచారించనున్నట్టు సమాచారం. తొలుత ఈ ప్రాజెక్ట్‌తో సంబంధం ఉన్న అధికార వర్గాలను, మాజీ ఇంజనీర్లను, ఇతర అధికారులను విచారించిన తర్వాత, చివరకు 'ప్రజాప్రతినిధులను' విచారించాలనే అభిప్రాయంలో కమిషన్ ఉన్నట్టు తెలిసింది. కాళేశ్వరం విచారణను మార్చి చివరి వారం వరకు పూర్తి చేయాలని 'జస్టిస్ చంద్ర ఘోష్ కమిషన్' లక్ష్యంగా పెట్టుకున్నది. సమగ్ర సమాచారాన్ని సేకరించి, ఒక అంచనాకు వచ్చిన తర్వాతనే ఈ ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో బాధ్యతలు నిర్వహించి, ఈ ప్రాజెక్ట్‌తో పరోక్షంగా, ప్రత్యేక్షంగా సంబంధం ఉన్న ప్రజాప్రతినిధులను (మాజీ సిఎం, మాజీ మంత్రులు) విచారిస్తే వాస్తవాలు వెలుగులోనికి వస్తాయని కమిషన్ భావిస్తుంది. ఫిబ్రవరి నెల లోపే అధికారులు, కాంట్రాక్టు సంస్థల విచారణ ప్రక్రియను పూర్తి చేయాలని, ఇందులో ఏమైనా అనుమానాలు, వారు చెప్పిన సమాధానాలలో వ్యత్యాసం, గందరగోళం ఉంటే మరోసారి విచారించాలని కమిషన్ భావిస్తుంది. విచారణ పూర్తి చేసిన తర్వాత సుమారు ఒక నెల లోపే పూర్తి స్థాయి నివేదికను రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. దీనికి అనుగుణంగానే విచారణ పక్రియను, నివేదిక రూపకల్పనను, తదితర వాటిని దృష్టిలో పెట్టుకుని సుమారు రెండు నెలలకు చెందిన షెడ్యూల్‌కు సంబంధించిన కార్యాచరణను రూపొందించుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటి వరకు జరిగిన విచారణలో వెల్లడైన అంశాలను క్రోడీకరిస్తూ కమిషన్ ఒక 'సూత్రప్రాయ' నివేదికను రూపొందించుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. మాజీ ఇఎన్‌సిలను మళ్లీ బహిరంగంగా విచారించే అవకాశాలు ఉన్నాయి. అయితే నిబంధనలకు విరుద్ధంగా, కొన్నిపనులు పూర్తి కాకుండానే బిల్లులు విడుదల చేసినట్టు కూడా కమిషన్ దృష్టికి వచ్చినట్టు తెలుస్తోంది. కొన్ని పనులకు నిధులు విడుదల చేయడం, అలాగే నిబంధనలు పాటించకుండానే కాంట్రాక్టర్లను ప్రభుత్వం మార్చినట్లు కమిషన్ గుర్తించినట్టు సమాచారం. నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై సెక్షన్ 70 ప్రకారం చర్యలు తీసుకావాలని కమిషన్ తన నివేదికలో సూచించే అవకాశాలు ఉన్నాయి.

కాగా ఇది వరకు చేపట్టిన విచారణలో 'కాళేశ్వరం' ఇంజనీర్లు, అధికారులు అప్పటి సిఎం కెసిఆర్ పేరును ప్రస్తావించిన విషయం తెలిసిందే. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కాళేశ్వరం విచారణకు తాత్కాలికంగా వాయిదా వేసిన విషయం తెలిసిందే. విచారణలో భాగంగానే కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పి.సి.పినాకిని చంద్రఘోష్ హైదరాబాద్ చేరుకున్నారు.

**దాదాపు ముగిసిన 'పాలసీవిధానాలు, ఆర్థిక, సాంకేతిక' అంశాలు**

కాళేశ్వరం విచారణలో భాగంగా ఇప్పటి వరకు దాదాపుగా పాలసీపరమైన విధానాలను, ఆర్థిక పరమైన అంశాలపై విచారణ ఒక కొలిక్కి వచ్చినట్టు సమాచారం. సాంకేతికపరమైన అంశాలు, డిజైన్లు, తదితర అంశాలపై ఇప్పటికే విచారించిన కమిషన్, పాలసీ విధానాలపై ఒక అభిప్రాయానికి వచ్చారు. దీంతో ఇక ఆర్థికపరమైన అంశాలపై ఒక అంచనాకు వచ్చినప్పటికీ దీనికి సంబంధించిన అప్పటి అధికారుల పాత్ర, నిధుల మంజూరు, విడుదల , కేటాయింపులు, బిల్లుల చెల్లింపులో తీసుకున్న జాగ్రత్తలు, నిబంధనలు తదితర అంశాలపై కమిషన్ సమగ్రంగా ఆరా తీస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి కాగ్ నివేదికను ఇప్పటికే పరిశీలించిన జస్టిస్ చంద్ర ఘోష్ కమిషన్, కాగ్ అధికారులను కూడా విచారించి, కాగ్ నుంచి మరిన్ని పత్రాలను సేకరించాలని యోచిస్తోంది.

## చైర్మన్ పదవులకు నేరుగా ఎన్నికలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపల్ చైర్మన్ పదవులకు నేరుగా ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర మునిసిపల్ ఛాంబర్స్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు కోరారు. హైదరాబాద్ హైదర్‌గూడలోని మున్సిపల్ ఛాంబర్స్ కార్యాలయంలో శనివారం కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ చైర్మన్, మేయర్ పదవులకు నేరుగా ఎన్నికలు నిర్వహించడం వల్ల మేరుగైన అభివృద్ధిని సమర్థవంతంగా విధులు నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. రాజీవ్ గాంధీ, స్థానిక సంస్థలను బలోపేతం చేయాలనే సంకల్పంతో 73,74వ రాజ్యాంగ సవరణ చేస్తే దానిక తూట్లు పోడిచే విధంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం పురపాలక, పంచాయతీ రాజ్ నూతన చట్టాలను తీసుకువచ్చి, స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు.ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పురపాలక చట్టాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు.

**రూ.2700 కోట్లు విడుదలచేసి పురపాలికలకు దిక్సూచిగా నిలిచిన సిఎం రేవంత్ రెడ్డి..**

తెలంగాణ చరిత్రలో గత ప్రభుత్వ విధానాల వల్ల పురపాలికలు చితికి పోయాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత 11 ఏండ్లుగా పేరుకుపోయిన టిడిఎస్‌ను సుమారు రూ.2700, కోట్ల విడుదల చేసి, ప్రజాపాలనకు దిక్సూచిగా నిలిచారన్నారు. ఈ నిధుల విడుదల పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ సిఎం కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధలను తక్షణం అభివృద్ధికి వెచ్చించే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ నిధులు రాష్ట్రం ద్వారా కాకుండా మున్సిపల్ సాధరణ నిధుల కింద ఖర్చు చేసే వేసులుబాటు కల్పించాలని సిఎం రేవంత్ రెడ్డిని కోరారు.

**ఇఇఎస్‌ఎల్ సంస్థకు చెల్లింపులపై విచారణ జరపాలి..**

రాష్ట్రంలో పురపాలికలు, నగరాల్లో విద్యుత్ దీపాల నిర్వహణ కాంట్రాక్టుపై ఇఇఎస్‌ఎల్ (ఎనర్జి ఎఫిసెన్సీ సర్వీసింగ్ లిమిటెడ్) సంస్థకు చెల్లింపులపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఎలాంటి సాంకేతిక శాస్త్రీయ విధానం లేకుండా చెల్లింపులు జరిగాయన్నారు. దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి ఏమి ప్రయోజనాలు ఉన్నాయో నిర్ధారించాలని కోరారు. విద్యుత్ బాధ్యత ఆ సంస్థకు ఇవ్వడం వల్ల వచ్చిన లాభం లేకపోగా పురపాలికలు తీవ్రంగా ఆర్థికంగా నష్టపోయాయని తెలిపారు.

**పట్టణ ప్రగతి నిధులు విడుదల చేయాలి..**

పట్టణ ప్రగతి నిధులు 20నెలలుగా విడుదల కాకపోవడంతో వాటిని ఆధారంగా చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించడంలో ఇబ్బందులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పన్నులు విధించే అధికారం ఒకే విధంగా ఉండకుండా పన్నులను ఖరారు చేసే అధికారాలు స్థానిక సంస్థలకు ఇవ్వాలని సిఎంను కోరారు.

# గ్రామసభలకు విస్తృత ఏర్పాట్లు

### మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రేషన్ కార్డు లు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల లబ్ధిదారుల గుర్తి ంపునకు జిల్లాలో మంగళవారం నుండి గ్రామ సభలకు నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయా లని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారు లను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ మినీ ప్రధాన సమావేశ మందిరం నుండి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు లతో కలిసి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి జిల్లాలోని నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు ఎం.డి.ఓ.లు తహశీల్దార్ లు, పంచా యతీ కార్యదర్శుల ఇతర సంబంధిత అధికారు లతో కలిసి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్ట నున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి కీలకమైన నాలుగు సంక్షేమ పథకాల అమ లును జనవరి 26న ప్రారంభించనున్న నేప థ్యంలో ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వ హించే గ్రామ సభలను షెడ్యుల్ వారీగా ఖచ్చి తంగా సమయపాలన పాటిస్తూ నిర్వహించాలని, ఎక్కడ కూడా నిర్లక్ష్యాని తావు లేకుండా అధి కారులందరూ జాగ్రత్తగా నిర్వ హించాలని పేర్కొన్నారు. గ్రామ సభల్లో రిజిస్టర్ లను ఏర్పాటు చేసి అర్జీలను స్వీకరించాలని ఆదేశించారు. గ్రామ సభల షెడ్యూల్ మండల సమాఖ్య, గ్రామ సం ఘం అధ్యక్షురాలుకు సమాచారం అందించి మహిళా సంఘాల మహిళలు పాల్గొనేలా చూడాలన్నారు. సంక్షేమ పథకాలు రోజు వారీ ప్రక్రియను నియో జకవర్గ ప్రత్యేక అధికారులు మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. కుటుంబ సభ్యులు పేర్లు, ఆధార్ నెంబర్ లు, ఫోన్ నెంబర్ లు జాగ్రత్తగా నమోదు చేసుకోవాలన్నారు.

# పత్రికలు ఎప్పుడూ 'ప్రజల పక్షమే' ఉండాలి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః పత్రికలు ఎప్పుడు ప్రజల పక్షమై ఉండాలని అప్పుడే సమాజంలో అవినీతి అక్రమాలకు చోటు ఉండదని మహ బూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. సోమ వారం చైర్మన్ గృహంలో ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వార ధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో పత్రికల కీలక పాత్ర పోషిస్తాయ న్నారు. అధికారులైన, ప్రజాప్రతినిధులైన అన్ని సమస్యలను నేరుగా చూడలే రని అందుకే ప్రజలకు పత్రికలపై విశ్వాసం పెరిగిందన్నారు. సమాజాభివృ ద్ధికి కృషి చేయడంలో పత్రికలకు కూడా భాగస్వామ్యం ఉందనే విషయాన్ని మరవకూడదన్నారు. వాస్తవాలను వెలికితీస్తూ ప్రజల్లో నమ్మకాన్ని కలిగించు కునేందుకు పత్రికలు మరింతగా కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉంద న్నారు. జిల్లా ప్రజాపక్షం ప్రతినిధి ఐలమోని శేఖర్, శామ్యూల్ సుందర్ చారి, బాలవర్ధన్ రెడ్డి లతో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 85 దరఖాస్తులు



### మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులు పరిశీలించి సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలె క్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులను సమా వేశపరిచి ప్రజావాణి నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనేపరిష్కరించాలనిలేనిపక్షంలో వారికి సూచనలు ఇవ్వాలని చెప్పారు. శాఖల వారిగా పెండింగు దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుండి 85 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ప్రజావాణి కార్య క్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అద నపు కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మొరాయిస్తున్న ధరణి పోర్టల్!



ప్రజాపక్షం/ వెల్దండ : మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ రైతాంగం ప్రభుత్వ కార్యాలయం చుట్టు తిరుగుకుండా ఒకే చోట రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ అయ్యేలా మండల కేంద్రాల్లో తహశీల్దార్ కార్యాలయాల్లో జాయింట్ సబ్ రిజిస్ట్రర్లను ఎంతో ప్రతిష్టాత్మకంగా ధరణి పోర్టల్‌ను 2019 తీసుకొచ్చారు. అప్పటి నుంచి ధరణి పోర్టల్‌లో భూక్రయ విక్రయాలు సాఫిగా సాగాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ధరణి పోర్టల్‌లో పార్ట్ బీ, ఇతర భూసమస్యలనుతో రైతులు ఇబ్బందులకు గుర్రై వారి భూములు వారికి అమలు కావడం లేదని భూ భారతి ఫోర్టల్‌ను ప్రారంభించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 25 రోజుల నుంచి ధరణి పోర్టల్ మొరాయిస్తుం డటంతో రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి.దీంతో భూ క్రయ విక్రయ దారులు వాపోతున్నారు. ప్రభుత్వం ధరణి పోర్టల్‌లో స్లాట్ బుక్ కాకుండా నిలుపుదల చేయాలని అంటున్నారు.

## రోడ్డుభద్రత నియమాలు పాటించాలి



ప్రజాపక్షం/కల్వకుర్తి : ప్రతిఒక్కరు రోడ్డుభద్రత నియమాలు పాటించాలని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. జాతీయరోడ్డుభద్రతమాసోత్సవా లలో భాగంగా సోమవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, జిల్లా ఎస్‌పి గైక్వాడ్‌వైభవ్‌రఘునాథ్, పిసిబిమెంబర్ బాలాజిసింగ్‌లు హాజర య్యారు. పట్టణంలో ర్యాలీనిర్వహించి రోడ్డు భద్రత నియమావళిపై ప్రజ లకు అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డుభ ద్రత నియమాలు పాటించినట్లయితే ప్రమాదాలను నివారించగలుగుతా మని అన్నారు. ఈసందర్భంగా గోడపత్రికలు విడుదలచేశారు. కార్యక్ర మంలో డిఎస్‌పి వెంకటేశ్వర్లు, కమీషనర్ మహ్మద్‌షేక్, ఆస్పత్రి సూపరిం డెంట్ డాక్టర్ శివరాం, సిఐలు నాగార్జున, విష్ణువర్ధన్‌రెడ్డి, మానవతాఫౌండే షన్ అధ్యక్షురాలు డాక్టర్ రమ్య, సౌజన్య, ఎస్ఐ మాధవరెడ్డి, యువజనసం ఘాల సభ్యులు, పట్టణప్రజలు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయపనులు పరిశీలన



ప్రజాపక్షం/కల్వకుర్తి : కల్వకుర్తి పట్టణపరిధిలోని హనుమాన్‌నగర్‌లోగల పోచమ్మ దేవాలయ పునర్‌నిర్మాణ పనులను ఐక్యతఫౌండేషన్‌చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కమిటిసభ్యులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటిసభ్యులు మాజీచైర్మన్ రాచోటిశ్రీశైలం, మాజీకౌన్సిలర్ దేవర్లజగదీష్, శాలివాహన సంఘం అధ్యక్షుడు నర్సింహ్మ, రాజశేఖర్, శ్రీనివాసులు, బాలసాయిలు, లక్ష్మయ్య,బాలగౌడ్, హరిష్, మహేష్, కుమార్, సంతోష్, బాలస్వామి, రాములు, శాలివాహనసంఘం సభ్యులు, మహిళలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించాలి



ప్రజాపక్షం / నారాయణపేట: నారాయణపేట కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సిక్త పట్నాయక్‌ని ప్రజావాణిలో భాగంగా కలిసి దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల రాజ్యాధికార సాధన సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అంద జేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హమీనిచ్చారు. వికలాంగుల రాజ్యాధికార సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిజ్వార్ నగేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తప్పకుండా ఐదు శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా చూడాలని కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అబ్దుల్ అజీజ్ ఖాన్ , ఆంజనేయులు, రాఘవేందర్ , గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బడి బయటి పిల్లల్ని చేర్పించాలి



ప్రజాపక్షం / వీపనగండ్ల: బడికి వెళ్ల కుండా పనిలో ఉన్న పిల్లలను, బడికి వెళ్లకుండా మధ్యలో మానివేసిన పిల్ల లను గుర్తించి బడిలో చేర్పించే విధం గా ఈ నెల 25 వరకు సర్వే నిర్వహిం చడం జరుగుతుందని మండల విద్యా ధికారి నర్సింహ తెలిపారు.సోమవారం మండల పరిధిలోని తుమ్ముకుం టలో బడి బయటి పిల్లలను గుర్తించడానికి ఇంటింటా సర్వే నిర్వహించారు. ఏ విద్యార్థి కూడా చదువును మధ్యలో ఆపివేయరాదని, ప్రభుత్వ పాఠశా లలో విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులతో పాటు ఉచితంగా ఏకరూప దుస్తులు , నాణ్యమైన మధ్యాహ్న భోజనం గుడ్లు, పండ్లు, పౌష్టికా హారం అందించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు కిరణ్ కుమార్ , సిఆర్పి నాగరాజు పాల్గొన్నారు.

# 'డబుల్ బెడ్‌రూమ్' ఇళ్ల కోసం పేదలు వినతి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః 523 సర్వే నెంబర్లో తమ ఇంటి స్థలాల పట్టా సర్టిఫి కెట్లు 2018లో ప్రభుత్వానికి స్వాధీనపరచి డబు ల్‌బెడ్‌రూమ్‌లు పొందుటకు అర్హులుగా నిర్ధారిం చబడిన వారు తక్షణం తమకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని వందలాది మంది పేదలు మహబూబ్‌నగర్ అర్బన్ తహసిల్దార్ కా ర్యాలయాన్ని ముట్టడించారు. సర్వేలని, విచారణ లని కాలయాపన చేయడం అర్హులకు అన్యాయం చేయడమేనని వారు ధ్వజమెత్తారు. గతంలో బిఆ ర్ఎస్ ప్రభుత్వంలో అప్పటిమంత్రి శ్రీనివాస్ గౌడ్ అతని అనుచరులు, అప్పటి రెవెన్యూ ఇతర అధి కారులు అర్హులకు డబుల్‌బెడ్ రూమ్ ఇవ్వకుండా అక్రమంగా అమ్ముకున్న చేదు అనుభవాలను మరువలేక పోతున్నామని బాధితులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అవినీతిప రుల పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేస్తా రని బాధితులు సంబరపడ్డారని నాయకులు తెలి పారు. తీరా సంవత్సరం గడుస్తున్నా చర్యలుతీసు కోకపోవడం వెనుక ఉన్న రహస్యం ఏమిటో బోధ పడటం లేదన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, కలె క్టర్ జోక్యం చేసుకుని ఆందోళన ఉధృతం చేయక ముందే సమస్యను పరిష్కరించాలని డిమాండు చేశారు. గత వారం రోజులుగా మహబూబ్‌నగర్ పట్టణంలోని పేదల నివాస స్థలాల వద్ద తమ సంఘం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించామని టిఎఫ్టియు నాయకులు తెలిపారు. ఈ సర్వేలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయని వారు తెలిపారు. ప్రధానంగా మహబూబ్‌నగర్ పట్టణ మూలవాసులైన వీరన్నపేట్, మదీనా మజీద్, బండ్లగిరి, పాత పాలమూరు , తిరుమల దేవుని గుట్ట, ఫైర్ స్టేషన్ శాశాబ్ గుట్ట, మొనప్పగుట్ట ప్రాంతాలలో నివాసం ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమ లులో వీరికి తీవ్రమైన అన్యాయం జరు గుతుందనితెలిందన్నారు. సమస్య లతో కూడిన వినతిపత్రాన్ని మహబూ బ్‌నగర్ అర్బన్ మండల తాహసిల్దార్ ఘూన్సీరామ్ నాయక్‌కి ఇచ్చారు. తహసీల్దార్ స్పందిస్తూ ఈ నెల 26 తర్వాత అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. టిఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ ఖలీల్, టిపిజెఏసీ రాష్ట్ర నాయకులు కె.రామకృష్ణ టిఎఫ్‌టియు జిల్లా అధ్యక్ష కార్యద ర్శులు పి.విజయ్‌కుమార్, పి.యాదగిరి, జిల్లా నాయకులు జలాల్ పాషా, జి.గట్టన్న, కే.జయ పాల్, బాలకృష్ణ, కేపీఎన్పిస్ జిల్లా నాయకులు గోవిందు, డబుల్ బెడ్ రూమ్ బాధితులుఉ బషీర్, కుమ్మరి రాజు, హనీఫా బేగం, శ్రీదేవి, ఆస్మిన్ బేగం, శంకరమ్మ, ఫర్హానా బేగం , అజీజ్ బేగం, పద్మమ్మ, తస్మిన్ బేగం, హాజీరా బేగం, కైరు న్నీసా బేగం, అబ్దుల్ అజీజ్, తదితరులున్నారు.

# నిర్భీతిగా నిజాలను వెలికితీస్తున్న 'ప్రజాపక్షం'



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః పత్రికలు నిజాలను వెలికి తీసిన ప్పుడే విశ్వసనీయత పెరుగుతుందని ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. సోమవారం ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పత్రికలు సమాజానికి కళ్ల వంటివని ఆయన అన్నారు. సమాజంలో మంచికోసం, మార్పుకోసం పనిచేస్తున్న వారం దరినీ గుర్తించడంలో పత్రికలు ప్రముఖ పాత్ర పోషించాలన్నారు.

## అర్హుల జాబితాకు ఆమోదం తెలపాలి

ప్రజాపక్షం/ జడ్చర్ల : ఈనెల 21 నుండి 52 వ తేదీ వరకు జరగనున్న గ్రామ సభల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు తప్పనిసరిగా పాల్గొని అర్హులందరికీ న్యాయం జరిగేలా చూడాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనం పల్లి అని రుధ్ రెడ్డి పిలుపునిచ్చారు. తాను కూడా కొన్ని గ్రామ సభలకు హాజరు అవుతానని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరు లో ఏ ఒక్క పేద కుటుంబానికి అన్యాయం జరగకుండా చూడాలని ఆయన అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులను కోరారు.అధికారులు ఆమోదించిన జాబితాలలో అనేక మంది అర్హులపేర్లు లేవని ఇప్పటికే ఫిర్యాదులు వెల్లువె త్తుతున్న నేపథ్యంలో ఆయా గ్రామాలకు చెందిన అర్హు లందరి పేర్లను జాబితాలో చేర్చి వాటిని గ్రామసభలలో ఆమోదించాలని సూచించారు. ఆమోదించిన జాబితా లను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి కూడా పంపా లని కోరారు. గ్రామ సభలలో అర్హులైన వారి పేర్లను జాబితాలోకి చేర్చడంలో ఇబ్బందులు ఎదురైన పక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి స్వయం గా గాని, లేదా ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు.

## లైన్‌మెన్ పోస్టులను భర్తీ చేయండి

ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం) పోస్టులను పిటిషన ర్లతో భర్తీ చేయాలని ఇటీవల హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీఎస్ఎస్పీడీసీఎల్)ను ఆదేశించింది. కోర్టుకు రాని వాళ్లను అనుమతించవద్దంది. ఇప్పటికే స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహిస్తే వాళ్లను భర్తీ చేయాలంది. ఒకవేళ ఆ పరీక్ష నిర్వహించికపోతే వెంటనే నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలని స్పష్టం చేసింది. 2019లో టీఎ స్ఎస్పీడీసీఎల్ 2,500 జేఎల్ఎం పోస్టుల భర్తీకి నోటిఫికే షన్ ఇచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వులను అమలు చేయడాన్ని సవాల్ చేసిన కేసులో సింగిల్ జడ్జి తీర్పు చెప్పారు. రాష్ట్ర పతి ఉత్తర్వులను జేఎల్ఎం పోస్టులకు వర్తింపజేయలేరని చెప్పారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ టీఎస్ఎస్పీడీసీఎల్ దాఖలు చేసిన అప్పీల్‌పై జస్టిస్ అభినందకుమార్ షావిలి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ఇటీవల తీర్పు వెలువరిం చింది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరిం చింది. ఖాళీలను పిటిషనర్లతో మాత్రమే భర్తీ చేయాలని తీర్పులో పేర్కొంది.

## లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ



ప్రజాపక్షం / నారాయణపేట : ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయడం జరిగిందని, దర ఖాస్తు తీసుకుంటామని, లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని, జిల్లా ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులం దరికి ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇంది రమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు చేరేలా పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నట్లు, అందుకు గాను ఈ నెల 16 నుండి 20 వరకు క్షేత్ర స్థాయి దరఖాస్తులు పరిశీలన చేయడం జరిగిందని, 21 నుండి 24 వరకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రజలు సహకరించాలని జిల్లా తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం నుంచి ప్రారంభించనుం దని, వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా పంట వేసినా, వేయక పోయినా అందుతుందని, రైతులు అనవసర అపోహలు పెట్టుకోవద్దని, రైతు భరోసా పథకానికి ఎటు వంటి పరిమితులు లేవని, వ్యవసాయ యోగ్య మైన ప్రతి ఎకరాకు 12వేలు పెట్టుబడి సహాయం ప్రభుత్వం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. గ్రామ సభల్లో ఇచ్చిన దరఖాస్తులను కూడా పరి గణలోకి తీసుకుంటామని ఎలిపారు. గతంలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలి స్తామన్నారు. ఇది వరకు ఎప్పుడూ దరఖాస్తు సమర్పించకపోయినా గ్రామాల్లోకి వచ్చే అధికా రులకు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రేషన్‌కార్డుల పథకాలపై సం బంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను, ఎపీ డీఓలను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసు కోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## నల్లగొండ ధర్నా కోసం హైకోర్టుకు బిఆర్ఎస్

ప్రజాపక్షం/హైదరాబాద్: నల్లగొండలో ఈ నెల 21న బీఆర్ఎస్ చేయబోయే ధర్నాకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో ఆ పార్టీ హైకోర్టులో సవాలు చేసింది. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పోలీసులు వివ రణ ఇవ్వాలని హైకోర్టు సోమవారం ఆదేశించింది. విచార ణను ఈ నెల 27కి వాయిదా వేసింది. రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామన్న ఎన్నికల హామీకి విరుద్ధంగా రూ.12 వేలనే ప్రకటించడంపై నిరసన తెలుపుతూ 21న ధర్నా చేయా లని నిర్ణయించామని, కేటీఆర్ హాజరు అవుతారని, పోలీసులు అనుమతి ఇవ్వలేదంటూ నల్లగొండ బీఆర్ఎస్ టౌన్ అధ్య క్షుడు భువనగిరి దేవేందర్ లంచ్‌మోషన్ పిటిషన్ వేశారు. ఈనెల 21న నల్గొండలోని మర్రిగూడ బైపాస్ నుంచి క్లాక్‌ట వర్ వరకు నిర్వహించే ధర్నాకు నల్గొండ డీఎస్పీ అనుమతి ఇవ్వలేదన్నారు. 24 నుంచి గ్రామ సభలు, ఆ తర్వాత రిపబ్లి క్‌డే ఏర్పాట్లలో పోలీసులు ఉన్నారని ప్రభుత్వం చెప్పింది. పోలీ సుల వివరణ నిమిత్తం విచారణ 27కి వాయిదా పడింది.

## పలుగురాళ్ల గుట్టపై కవాతు నిర్వహిస్తాం



ప్రజాపక్షం / పెబ్బేరు : గత ప్రభుత్వంలో మైనింగ్ పనులను దక్కించుకొని ప్రజలకు వ్యతిరేకంగా పనులు చేస్తున్న ఆంధ్ర కాంట్రాక్టర్లనుతరిమికొడదామని బీసీ పొలిటికల్ జేఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం పెబ్బేరు మండలం శాఖాపూర్ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఆ గ్రామ శివారులోని పలుగురాళ్ల మైనింగ్ గుట్టను ప్రజలతో కలిసి సందర్శించారు. గుట్టపై రాళ్లను తవ్వుతున్న యంత్రాలు పనులు చేస్తున్న ఎస్వీఆర్ సిబ్బందిని అనుమతులపై ఆరా తీశారు. అనుమతులు చూపించడంలో నిర్లక్ష్యం చేయడంతో మైనింగ్ అధికారులతో ఫోన్లో మాట్లాడగా అనుమతులపై సమాధానం దాటవేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనం తరం విలేకరులతో రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ పలుగురాళ్ల గుట్ట పశువులకు గొర్రెలకు, మేకలకు ఆధారంగా ఉంటుందని పనులు ప్రారంభమైనప్పుడే ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. పనులు తీసుకున్న ఎస్‌విఆర్ కాంట్రాక్టర్ గ్రామస్తుల ఆం దోళన పట్టించుకోకుండా య థేచ్ఛగా భారీ యంత్రాల సహాయంతో బ్లాస్టింగ్ చేసి గుట్టను తవ్వి సొమ్ము చేసుకుంటున్నాడన్నారు. స్పందించిన కలెక్టర్ వెంటనే తాటిపా ముల గ్రామాన్ని సందర్శించి ప్రజలకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు. బీసీ పొలిటికల్ జేఏసి జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వజగౌని వెంకటన్న గౌడ్,జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్‌గౌడ్, కొత్తకోట మండల అధ్యక్షుడు మహేందర్ నాయుడు, పెద్దమందడి మండల అధ్య క్షుడు అన్నెల రమేష్ సాగర్ , నాయకులు రాఘవేందర్‌గౌడ్, గౌతమ్ శంకర్ , దేవర శివ, మ్యాదరి రాజు, వసంతచారి, నాగరాజు యాదవ్, గ్రామస్తులు సంద కేశవులు, ఎనుముల మన్యం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థలలోనూ బిఆర్ఎస్ ఆధిపత్యం చాటాలి

### జడ్చర్ల నియోజకవర్గ నేతలు పిలుపు



ప్రజాపక్షం/జడ్చర్లః మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆయా గ్రామాలలో జరుగు స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు ఘనవిజయం సాధించే దిశగా ప్రతి ఒక కార్యకర్త నాయకులు కృషి చేయాలని మాజీ జడ్పి వైస్ చైర్మన్ కొడుకు యాదయ్య, మాజీ డిసిసిబి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదిత రులు పిలుపునిచ్చారు. సోమవారం నాడు జడ్చర్ల నియోజకవర్గంలోని ఉరు కొండ పేట మండల కేంద్రంలో బిఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకుల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅ తిథిగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో తెలంగాణ రాష్ట్రం అగమ్యగోచరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నిరు ద్యోగులకు న్యాయం చేయకుండా కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేస్తుందని వారు మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కేవలం సమావేశాలకు మాత్రమే పరిమి తమైన కాంగ్రెస్ పార్టీ నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు సరైన గుణపాఠం చెప్పాలని వారు కోరారు. ఫిబ్రవరి 3న జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి జన్మదినోత్సవాన్ని పుర స్కరించుకుని వివిధ కార్యక్రమాల నిర్వ హించిముందుకుసాగాలని కోరారు.



## ఉపాధ్యాయుల నిరసన

ప్రజాపక్షం / పెద్దమండడి : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు రాములుపై దాడిని ఖండిస్తూ భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలిపినట్లు వనపర్తి జిల్లా గెజిటెడ్ అధ్యక్షులు వరప్రసాద్ రావు తెలిపారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ పిలుపు మేరకు విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులపై దాడిని ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

**పాన్‌గల్‌లో .....** గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రాములుపై జరిగిన దాడిని నిరసిస్తూ పాన్‌గల్ ఉన్నత పాఠశాలలో ఉపా ధ్యాయులు నిరసన తెలిపారు.ఉపాధ్యాయసంఘం నాయ కులు కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం



ప్రజాపక్షం / పాన్‌గల్ : ప్రజా సమస్యల పరి ష్కారం కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తా మని సిపిఐ, ఏఐటియూసి జిల్లా నాయకులు కేతూరి శ్రీరాం అన్నారు. పాన్‌గల్ మండలం తెల్ల రాళ్లపల్లిలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మాజీ ఉప సర్పంచ్ కాకం బాలస్వామితో కలిసి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో సర్పంచ్ , ఎంపీటీసీల ఎన్ని కలు జరగనున్నాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపిస్తేనే గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ప్రజల కోసం పార్టీ చేస్తున్న కృషిని వివరించి గ్రామాల్లో గత ఏడాది కంటే ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పించాలన్నారు. బూర్జువ పార్టీల అభ్యర్థులను గెలిపిస్తే పదవిని అడ్డం పెట్టుకొని తమ స్వలాభం చూసుకుంటారని, వారు పెట్టే ప్రలోభాలకు గురికావద్దని చెప్పి చైతన్యవంతులను చేయాలన్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందని పార్టీ కార్యకర్తలు ప్రజలు అర్హులైన పేర్లను అధికారుల దృష్టికి తెచ్చి న్యాయం జరిగేలా కృషి చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కాకం బాలస్వామి, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి సహదేవ్, సీనియర్ నాయకులు ఎర్రగుంట రాముడు, కాకం రాముడు, పరంధాములు, బాల స్వామి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# యువతరంగం

# షోకేస్

## 'ఎఐ' రంగంలో మంచి భవిష్యత్తు

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఎఐ) ఏ స్థాయిలో విస్తరిస్తున్నదో గమనిస్తునే ఉన్నాం. రాబోయే ఐదేళ్ల కాలంలో ఈ రంగంలోని వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) విడుదల చేసిన 'ఫ్యూచర్ జాబ్స్ రిపోర్ట్ 2025' అంచనా వేసింది. అదే విధంగా, బిగ్ డేటా, సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ స్పెషలిస్టులకు కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా 1,000 కంటే ఎక్కువ ప్రముఖ గ్లోబల్ కంపెనీల నుండి సేకరించిన డేటా ఆధారంగా నివేదిక వెల్లడైంది. ఇందులో 22 పరిశ్రమ రంగాలు... 55 ఆర్థిక వ్యవస్థలలో 14 మిలియన్ల మంది కార్మికుల వివరాలను విశ్లేషించారు. ఈ నివేదికను అనుసరించి 2030 నాటికి ఉద్యగ అంతరాయం 23 శాతానికి చేరనుంది. 170 మిలియన్ల కొత్త ఉద్యోగాలు సృష్టి సాధ్యమవుతుంది. కనీసం 92 మిలియన్ల ఉద్యోగాలో పెనుమార్పులు సంభవం. ఫలితంగా 2030 నాటికి నికరంగా 78 మిలియన్ల ఉద్యోగాలు పెరగవచ్చు. సాంకేతికతలో వస్తున్న మార్పులు, జియోఎకనామిక్స్ ఫ్రాగ్మెంటేషన్, ఆర్థిక అనిశ్చితి, జనాభా మార్పులు, హరిత పరివర్తన తదితర అంశాల కారణంగా వచ్చే ఐదేళ్లలో ప్రపంచ కార్మిక మార్కెట్‌ను ఎఐ శాసించడం ఖాయం. ఎఐ, మెషిన్ లెర్నింగ్, సాఫ్ట్‌వేర్, అప్లికేషన్ డెవలప్‌మెంట్, ఫిన్టెక్ ఇంజనీరింగ్ వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలు. వీటిలోనే ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయన్నది డబ్ల్యుఇఎఫ్ అభిప్రాయం. ఫ్రంట్‌లైన్ ఉద్యోగాలు కూడా భారీగా పెరిగే అవకాశాలను అంచనా వేసింది. ఇందులో వ్యవసాయ కార్మికులు, డెలివరీ డ్రైవర్లు, నిర్మాణ కార్మికులు, సేల్స్‌పర్సన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ వర్కర్లు, నర్సింగ్ నిపుణులు వంటి సంరక్షణ ఆర్థిక ఉద్యోగాలు, సామాజిక పని మొదలైనవి ఉన్నాయి. కాగా, గ్రాఫిక్ డిజైనర్లు, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్లు వంటి సాంప్రదాయిక రంగాలు ఆటోమేషన్ కారణంగా బాగా గణనీయంగా క్షీణిస్తాయి. ఏ కంపెనీకైనా నైపుణ్యంగల సిబ్బంది లేకపోవతే అభివృద్ధి చెందడం సాధ్యం కాదు. ఈ అంతరాన్ని ఎవరు ముందుగా గుర్తించి, అందుకు తగిన నైపుణ్యాన్ని సంపాదించుకుంటారో, వారికి ఉపాధి, పదోన్నతి అవకాశాలు ఉంటాయి. భవిష్యత్ ఉద్యోగాలకు అవసరమైన దాదాపు 40 శాతం నైపుణ్యాలు కొత్తవి లేదా ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నది. అందుకే, మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగార్థులు కూడా మారాలి. ప్రపంచ శ్రామిక శక్తిలో 59 శాతం తీవ్రమైన పోటీకి లోబడి ఉంటుంది. కొత్త నైపుణ్యాలను పెంచుకోవడం లేదా రీస్కిల్లింగ్‌తో సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడం అత్యవసరమని డబ్ల్యుఇఎఫ్ స్పష్టం చేసింది. వచ్చే ఐదేళ్ల కాలంలో సాంకేతిక అక్షరాస్యత అనేది అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మూడో నైపుణ్యంగా నిలుస్తుంది. నాలుగో స్థానంలో సృజనాత్మకత, ఐదో స్థానంలో స్థితిస్థాపకత, చురుకుదనం తదితరాలు ఉంటాయి. ఉపాధి అవకాశాలను పునర్నిర్మిస్తూ, సాధారణ పనులను నిర్వహించడానికి కంపెనీలు ఎక్కువగా ఎఐ ఆధారిత సాధానాలవైపు మొగ్గు చూపుతున్నాయి. ఆటోమేషన్ మరింత విస్తృతంగా మారడంతో, 41 శాతం కంపెనీలు వర్క్‌ఫోర్స్‌ను తగ్గించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయని డబ్ల్యుఇఎఫ్ నివేదిక స్పష్టం చేస్తున్నది. ఈ నివేదికలోని అంశాలను గమనించి, భవిష్యత్ ప్రణాళికలను సిద్ధం చేసుకోవడం యువతీయువకులకు అత్యవసరం.



## సమస్యల ఊబిలో యువత!




ప్రపంచానికే యువ కేంద్రంగా నిలిచి భాసిల్లుతున్న భారత్‌కే సొంతమైన అపార యువశక్తి రెక్కలు విచ్చుకొని ఆకాశమే హద్దుగా ముందుకు సాగితే 2047 వందేళ్ల స్వతంత్ర దినోత్సవ వేడుక నాటికి 'వికసిత్ భారత్ 2047'గా ఎదిగి అభివృద్ధి చెందిన దేశాల జాబితాలోకి సగర్వంగా చేరుతుందని ఆశ పడుతున్న వేళ నేటి డిజిటల్ యువభారతాన్ని కొన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. భారత్‌లో 35 ఏండ్ల లోపు వయస్సు కలిగిన జనాభా 65 శాతం (దాదాపు 80 కోట్లు) ఉండడం ఒక విశేషం. ఏ దేశమైనా ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించడానికి ఆ దేశ యువత చొరవ అనివార్యం. యువత ఆలోచనలు, శక్తియుక్తులతో పాటు సృజన, విలక్షణ భావనలు పురుడు పోసుకోవడానికి యువత ప్రధాన పాత్రను నిర్వహించాలి. నేటి అత్యాధునిక భారత యువతకు అల్లంతో దూరాన అనేక అవకాశాలు కనిపిస్తున్నప్పటికీ వారిని ముందుకు సాగనివ్వకుండా కొన్ని ప్రధాన సమస్యలు వెనక్కి లాగుతున్నాయని నిపుణులు గుర్తించారు. కాగా నేడు యువభారతాన్ని పట్టి పీడిస్తున్న అత్యంత ప్రధాన సమస్య నిరుద్యోగం అని మనకు తెలుసు. భారతదేశ జనాభాలో 15–34 ఏండ్ల లోపు వయస్సు కలిగిన యువత 36 శాతం ఉంది. ఇది దేశానికి ఒక అమూల్య వనరు అని గుర్తించబడింది. నేడు ఐఐటి ముంబాయిలో చదివిన 36 శాతం యువతకు అర్హతకు తగిన ఉద్యోగాలు రాలేదని, ఉద్యోగాలకు ఎంపికైన కొందరు యువతకు రూ 10 లక్షల వార్షిక వేతనం మాత్రమే లభించిదనే విషయం తెలిస్తే మన దేశంలో ఎంత వరకు నిరుద్యోగ సమస్య ఉందో అర్థం అవుతున్నది. భారత్‌లో ఉన్న శ్రామిక శక్తిలో 80 శాతం వరకు యువత మాత్రమే నిరుద్యోగులుగా లేదా అర్హతకు తగిన ఉద్యోగం దొరక్క సమస్యలకు ఎదుర్కొంటున్నారని తెలుస్తున్నది. గత రెండు దశాబ్దాల్లో భారత్‌లో యువత నిరుద్యోగ రేటు 5.7 శాతం నుంచి 17.5 శాతానికి పెరిగినట్లు గమనించారు. దేశ యువతలో 90 శాతం వరకు అసంఘటిత రంగాల్లోనే మగ్గుతున్నారని వివరించబడుతున్నది. అధిక శాతం శ్రామిక శక్తి వ్యవసాయ/వ్యవసాయ అనుబంధ రంగాల్లో పని చేస్తున్నారని అంచనా. ఇక కాలానుగుణంగా మన విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేయడం మరిచి పోయాం. మూస పద్ధతిలో పాత పాఠాలే బోధిస్తున్నాం. ప్రయోగశాల సమయం సన్నపూస అవుతున్నది. పరిశోధన స్ఫూర్తిని నింపలేదు పోతున్నాం. విద్యకు తగిన నైపుణ్యాలను అందించలేక పోతున్నాం. నేడు అంతర్జాతీయ విద్య ప్రమాణాలు కలిగిన యువతకు ఆకర్షణీయమైన ఉద్యోగాలు ఆహ్వానిస్తున్నాయి. పరిశ్రమల అవసరాలకు విశ్వవిద్యాలయాల బోధనలకు పొంతన కుదరడం లేదు. డిగ్రీలు కాగితాలకే పరిమితం అవుతున్నా యి. విద్యకు నైపుణ్యం తోడు అవడం లేదు. నైపుణ్య విద్య కలిగిన యువతకు గిరాకీ పెరుగుతోంది. పరిశ్రమల్లో ఉద్యోగాలు ఉన్నాయి. మార్కెట్‌లో నైపుణ్య యువత కనిపించడం లేదు. మన యువభారతాన్ని నైపుణ్య భారతంగా తయారు చేయగల నూతన విద్యా విధానం కావాలి. విద్యకు నైపుణ్యం తోడవ్వాలి. విద్య, నైపుణ్యం అనబడే రెక్కలు తొడిగిన యువ తకు ప్రపంచమే ఆహ్వానం పలుకుతోంది. నేటి డిజిటల్ ప్రపంచంలో ఆత్మవిశ్వాసంతో యువత నిలబడడానికి మన విద్యా వ్యవస్థకు సత్వరమే శస్త్రచికిత్స చేసి ప్రమాణాలతో కూడిన విద్య, విద్యార్హతలకు తగిన నైపుణ్యాల ఔషధాలను అందించాలి. గోరు చుట్టలపై రోకలి పోటు వలె నిరుద్యోగ సమస్య పెరుగుతున్న వేళ నిత్యావసరాల ధరలు పెరగడంతో బడుగుల బతుకులు భారం కావడం, యువతలో నిరాశల సెగలు ఎగిసిపడడం చూస్తున్నాం. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరగడంతో పాటుగా వస్తువులు, వస్తు సేవల డిమాండ్ తగ్గడం వల్ల వ్యాపారాలు, ఉద్యోగ ఉపాధులు తగ్గుతు న్నాయని తెలుసుకోవాలి. ధరలు పెరగడంతో యువతలో పునర్వినియోగపరచలేని ఆదాయం తగ్గడం చూస్తున్నాం.

### శ్రీపాద లలిత

యూత్ ఐకాన్‌గా పేరుతెచ్చుకున్న శ్రీపాద శ్రీసాయి లలిత అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ సైంటిస్ట్ అవార్డును 2015 సెప్టెంబర్‌లో స్వీకరించింది. అప్పటికి ఆమె వయసు కేవలం 14 సంవత్సరాలు మాత్రమే. అత్యంత చౌకైన వాటర్ ప్యూరిఫయర్‌ను రూపొందించినందుకు ఆమె ఈ అవార్డుకు ఎంపికైంది. గింజలు తీసేసిన మొక్కజొన్న కంకులను ఉపయోగించి, వాటర్ ప్యూరిఫయర్‌ని ఆమె తయారు చేయడం విశేషం. ప్రపంచంలోనే అలాంటి ప్రయోగం అదే మొదటిసారి. ఆమె ప్రతిభను గుర్తించిన గూగుల్ కాలిఫోర్నియాలో ఆమెకు ఉత్తమ సైంటిస్టు అవార్డును ప్రదానం చేసింది.

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..





## ఆహ్లాదకరంగా చివరి మజిలీ..

వృద్ధాప్యం మనిషి చివరి మజిలీని గుర్తు చేస్తుంది. ఎప్పుడో ఒకసారి శాశ్వత వీడ్కోలు తీసుకొని వెళ్లక తప్పదు కాబట్టి, దానిని గురించి ఆలోచించకుండా, చివరి రోజులను ఆనందంగా, ఆహ్లాదంగా గడపడానికి హార్వర్డ్ శాస్త్రవేత్తలు కొన్ని మార్గాలను సూచించారు. వృద్ధుల్లో అత్యంత సంక్లిష్టమైన, బాధాకరమైనది అనారోగ్యం కాబట్టి, ఆ కోణంలోనే ఎక్కువ దృష్టి పెట్టారు. సాధ్యమైనంత వరకూ ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే కనీసం ఐదు అలవాట్లు తప్పనిసరిగా సూచించారు. హార్వర్డ్ మెడికల్ స్కూల్, హార్వర్డ్ టిహెచ్ చెన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ స్కూల్ ఆఫ్ హెల్త్ పరిశోధకులు 73 196 మంది మహిళల్లో అధ్యయనం చేశారు. 38,366 మంది పురుషుల ఆరోగ్య డేటాను వారి పరిశోధనలో ఉపయోగించారు. 4 నుండి 5 అలవాట్లను అనుసరించిన పురుషులు 50 సంవత్సరాల వయస్సులో కూడా మధుమేహం నుండి బయటపడ్డారని పరిశోధన వెల్లడించింది.




**గుర్తుంచుకోవలసిన ఆఐదు విషయాలు..**

### ఆరోగ్యకరమైన ఆహారం

వృద్ధాప్యం యొక్క ప్రభావాలను నివారించడంలో ఆహారం ప్రధాన పాత్ర పోషిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. యుఎస్ హెల్త్ ఏజెన్సీ సిడిసి ప్రకారం, ప్రతి 4 మరణాలలో ఒకరు గుండె జబ్బుతో మరణిస్తున్నారు. ఇది కాకుండా, ఊబకాయం, అధిక కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు, పోషకాహార లోపాలు వ్యాధులకు ప్రధాన ప్రమాద కారకాలు. ఈ ప్రమాదాలను నివారించడానికి, ఆహారంలో కూరగాయలు, పండ్ల మొత్తాన్ని పెంచాల్సిన అవసరం ఉంది.

### వ్యాయామం

రోజూ 30 నిమిషాల అవసరమైన వ్యాయామం చేయాలి. ఇది బరువును తగ్గిస్తుంది. అనేక వ్యాధుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. ఇది శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా వృద్ధాప్య ప్రభావాన్ని కూడా తగ్గిస్తుంది.

### నియంత్రణలో బరువు

నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కూడా 18.5 మరియు 24.9 మధ్య మానవ శరీర ద్రవ్యరాశి సూచిక (ఎంబిఐ) కలిగి ఉండటమే అనువైన పరిస్థితి అని చెప్పింది. 18.5 కంటే తక్కువ బీఎంఐ ఉన్నవారు తక్కువ బరువు కేటగిరీ కిందకు వస్తారు. 25 కంటే ఎక్కువ ఎంబిఐ ఉన్నవారిని ఊబకాయం అంటారు. బాడీ మాస్ ఇండెక్స్ అనేది ఒక వ్యక్తి యొక్క ఎత్తు, బరువు శరీరానికి అనుగుణంగా బరువు ఎక్కువ లేదా తక్కువగా ఉందో లేదో నిర్ణయించే కొలత. ఊబకాయం అనేక వ్యాధులకు కారణమవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలాంటి వారికి టైప్ 2 డయాబెటిస్, క్యాన్సర్, శ్వాసకోశ సమస్యలు, పిత్తాశయ రాళ్లు వచ్చే ప్రమాదం ఉంది.

### ఆల్కహాల్‌కు దూరంగా ఉండండి

ఆల్కహాల్ తాగే అలవాటు శరీరాన్ని అనేక విధాలుగా దెబ్బతీస్తుంది. ఇది మెదడు, గుండె, కాలేయం, ప్యాంక్రియాస్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. ఆల్కహాల్ తాగడం వల్ల అల్సర్, క్యాన్సర్, గుండె జబ్బు వంటి అనేక తీవ్రమైన వ్యాధులు వస్తాయి. కాబట్టి ఆల్కహాల్ కు దూరం ఉండటమే మంచిది.

### ధూమపానం చేయవద్దు

సిడిసి చెబుతున్న దాని ప్రకారం, ధూమపానం క్యాన్సర్, గుండె జబ్బులు, స్ట్రోక్, ఊపిరితిత్తుల వ్యాధి, మధుమేహం వంటి వ్యాధులకు కారణమవుతుంది. ఇది కాకుండా, క్షయ, కంటి వ్యాధి ప్రమాదాన్ని పెంచడంతో పాటు, శరీరాన్ని వ్యాధుల నుండి రక్షించే రోగనిరోధక శక్తిని కూడా బలహీనపరుస్తుంది. అందువల్ల ధూమపానానికి దూరంగా ఉండాలి.



## ప్రజా సమస్యల పరిష్కార.. పోరాటాలలో సిపిఐది ముఖ్యపాత్ర



**ప్రజాపక్షం/నల్లబెల్లి :** ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలలో సిపిఐది ముఖ్య పాత్ర అని పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ అన్నారు. పేదలకు వేల ఎకరాల భూములను పంచిన ఘనత సిపిఐకే దక్కుతుందన్నారు. సోమవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో చింతకింది కుమారస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ దేశంలో 1925 డిసెంబర్ 26న సిపిఐ పార్టీని స్థాపించి బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక భూమి పోషించిందన్నారు . తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దొరల గడీలను కూల్చేందుకు పోరాటాలు చేయడంలో ప్రజలను ముందుండి పోరాడే విధంగా చేసిన ఘనత సిపిఐదేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఉపాధి హామీ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదికి 12 వేల రూపాయలు ఏలాంటి నిబంధనలు లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామి కూలీలకు సిపిఐ పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల కోసం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మియాపురం గోవర్ధన్, బిసి హక్కుల సాధన సమితి మండల కన్వీనర్ చీకటి ప్రకాష్, బట్టు సాంబయ్య, బూస కుమారస్వామి, కోల లింగాయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుడిసెవాసులకు పట్టాలిచ్చి ప్రభుత్వమే ఇండ్ల నిర్మాణం చేపట్టాలి

ఎమ్మెల్యే నాయినికి సిపిఐ వినతి



**ప్రజాపక్షం/హనుమకొండ :** జిల్లాలో సిపిఐ ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాల నుండి గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలందరికీ పట్టాలు ఇచ్చి ప్రభుత్వమే ఇండ్ల నిర్మాణం చేపట్టాలని, కాజీపేట, న్యూ శాంపేట వివిధ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని సిపిఐ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో బాలసముద్రంలోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇండ్ల స్థలాల పట్టాలు, నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్స్ అమలు చేయాలని, స్థానిక సమస్యలను పరిష్కరించాలని సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పందిస్తూ సిపిఐ ఇచ్చిన వినతి పత్రంలో సమస్యలన్నీ పరిశీలించి తప్పనిసరిగా సాధ్యమంతవరకు పరిష్కారం చేసెందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా సమితి కార్యదర్శి కర్రే బిక్షపతి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దేల ఎలేష్, జిల్లా నాయకులు వేల్పుల సారంగపాణి , మాలోతు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆర్టిజన్' పేరుతో అన్యాయం..







### విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విద్యుత్ ఆర్టిజన్ కార్మిక సంఘం(ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు నరాటి ప్రసాద్

**ప్రజాపక్షం/పాల్వంచ :** తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ రంగంలో జెన్కో, ట్రాన్స్‌కోలో పనిచేస్తున్న 20వేల మంది ఆర్టిజన్ కార్మికులను కన్‌వర్షన్ చేయాలని కోరుతూ రాష్ట్రంలో జనవరి 20 నుండి 25వ తేదీ వరకు రిలే నిరహార దీక్షలు చేపట్టారు. అందులో భాగంగా పాల్వంచలోని కెటిపిఎస్ గేట్ ఎదుట జెఎసి ఆధ్వర్యంలో జరిగిన రిలే నిరాహార దీక్షలను సోమవారం విద్యుత్ ఆర్టిజన్ కార్మిక సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు నరాటి ప్రసాద్, జెఎసి రాష్ట్ర కన్వీనర్ ఎండి వజీర్ కార్మికులకు పూల దండలు వేసి దిక్షలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో విద్యుత్ రంగంలో పనిచేస్తున్న 20వేల మంది కార్మికులను కనవర్శన్ చేయకుండా ఆర్టిజన్ అని పేరు పెట్టి అన్యాయం చేశారన్నారు. ఆర్టిజన్ అని జిఒ వలన కార్మికుల ఉనికి ప్రశ్నర్థాకంలో ఉన్నదని, జీవితం మొత్తం రెగ్యులర్ కాకుండా వెట్టి చాకిరి చేస్తూ సమిధులు కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం 5ఏళ్లు పూర్తి సర్వీస్ చేసిన కార్మికులను ఇంక్రిమెంట్, గ్రేడ్ ప్రమోషన్ ఇవ్వాలని, కానీ 10 ఏళ్ళు దాటినా పదోన్నతి లేదని, కార్మికులతో వెట్టి చాకరి, శ్రమ దోపిడీని ప్రభుత్వం చట్టబద్దం చేశారన్నారు. తక్షణం ఆర్టిజన్ కార్మికులను కనవర్శన్ చేయాలని సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

**నల్లగొండ :** విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్స్‌ను రెగ్యులర్ పోస్ట్‌లోకి కన్వర్షన్ (మార్పు) చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వానికి కోరారు. ఆర్టిజన్స్ జెఎసి ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ విద్యుత్ ఎస్ఇ కార్యాలయం ముందు ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న నేటికి పర్మనెంట్ కాకపోవడం విచారకరమన్నారు. 2017 సంవత్సరంలో 23,667 మందిని పర్మనెంట్ చేసినామని గత ప్రభుత్వం చెప్పినప్పటికీ విద్యుత్ సంస్థ స్టాండింగ్ ఆర్డర్స్ సర్వీస్ రూల్స్ తెరపైకి తెచ్చి పెర్మినెంట్ చేయకుండా నేరుగా వేతనాలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించి ఆ ప్రక్రియ పూర్తి చేయకుం డా మధ్యలోనే ఆపేసిందని ఆరోపించారు ఉన్నత న్యాయస్థానం కార్మిక చట్టాల ప్రకారం విద్యుత్ సంస్థలో విలీనం తప్పు కాదని చెప్పిన కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వేతనాలు మాత్రమే పెంచి మిగతా డిమాండ్స్ అన్ని వదిలేసారని విమర్శించారు. ప్రస్తుతం ఆర్టిజన్ కార్మికులను ప్రభుత్వం విద్యుత్ సంస్థలో విలీనం చేయడం ద్వారా ఎన్నికల ముందు ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని కోరారు. ఇప్పటికే వివిధ సబ్ స్టేషన్లలో కార్మికుల తక్కువగా ఉండి పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో జెఎసి రాష్ట్రజాయింట్ కన్వీనర్ మురళి, జాయింట్ సెక్రెటరీ సలీం పాష, జిల్లా కన్వీనర్ పి.శేఖర్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కెవిఎస్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి వి,లెనిన్, ఆర్టిజన్స్ యూనియన్ల నాయకులు జే లింగస్వామి, లింగారెడ్డి,ఉమాదేవి, రమ, అరుణ, నాగమణి, యాదయ్య, శైలజ, సైదులు, చంద్రమౌళి, యాదగిరి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకోసం పనిచేస్తున్న ఏకైకపార్టీ సిపిఐ

పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** పేదప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఏకైకపార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ అన్నారు. సోమవారం తిమ్మాజిపేట మండల కేంద్రంలో సిపిఐ వంద సంవత్సరాల్లోకి అడుగుపెట్టిన సందర్భంగా సిపిఐ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పేద ప్రజల, బడుగు బలహీనవర్గాల కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ దున్నేవాడికి భూమి కావాలని, ఆనాడు రాజాభరణలను రద్దుచేయించిన ఘనత సిపిఐకే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వెన్నుదన్నునిలిచి ఇందిరమ్మ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు పేదలకు దున్నుకోవడానికి భూమి, పేదలు నివసించడానికి ఇండ్లస్థలాలు ఇప్పించి ఇండ్లు నిర్మించి ఇవ్వడంలో సిపిఐ ప్రధానపాత్ర వహించిందన్నారు. జాతీయ ఉపాధిహామీపథకాన్ని పేదకూలీలకు చేతినిండా పనిఉండాలని జాతీయ ఉపాధిహామీపథకం వందరోజుల పనిదినాన్ని కల్పించాలని పోరాడి సాధించిందన్నారు. నిరంతరం పేదలకోసం బడుగు బలహీనవర్గాల కార్మికులు కర్షకులకు అసంఘటితరంగ కార్మికుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ హక్కులను సాధించిపెట్టడంలో ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ తిమ్మాజిపేటమండల కార్యదర్శి షేక్‌ఖాజామైనుద్దిన్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కేశమల్లశివకృష్ణ, యాదయ్య, రాములు, ఆంజనేయులు, హమాలీ రాములు, శ్రీరాములు, జంగయ్య, గోపాల్‌నాయక్, వివిధ గ్రామాల సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోండి

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడు రూపాయల నష్టంతో మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు అందించలేమని ఎఐటియుసి గోవిందరావుపేట మండల కేంద్రంలో మండల విద్యాశాఖాధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ కార్మికులు పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచకుండా విద్యార్థులకు రెండు కూరలు, మూడు కోడిగుడ్లు ఎలా అందిస్తారన్నారు. దానితో పాటు కోడిగుడ్ల ధరలైతే కొండెక్కి కూర్చున్న సమయంలో మూడు రూపాయల నష్టంతో ఎలా అందించాలన్నారు. కోడిగుడ్లు పూర్తిగా ప్రభుత్వమే సరఫరా చేయాలని, అలా చేయలేని పక్షంలో కోడిగుడ్లు పాఠశాలలో అందించలేమన్నారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సామల రమ, పి సరోజన, ఆడెపు లక్ష్మి, గోపిదాసు నిర్మల, స్వరూప, ఉమ, సమ్మక్క, స్వరూప, భారతమ్మ, మల్లక్క, మునెమ్మ, కొమురయ్య, కుమారి, సేరి సమ్మక్క, స్వప్న, కాయితాల కుమారి, తదితరులు పాల్గొన్నారు.








**జగిత్యాల ప్రతినిధి :** మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి 25రూపాయలు మెన్ చార్జీలు చెల్లించాలని, ఇప్పుడు చెల్లిస్తున్న రేట్లతో వంట చేయలేమని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు వెన్న మహేష్ అన్నారు. ఎఐటియుసి అనుబంధ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల మండల విద్యాధికారికి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం వంట కార్మికులు శారద, బీ.లక్ష్మి , మల్లేశ్వరి,కె. లక్ష్మి ,జరిన, లత, రాధ, రజిత,జయశ్రీ, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**సుజాతనగర్ :** మధ్యాహ్న భోజన వర్కర్స్‌ను ఆదుకోవాలని సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎంఇఒకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎఐటియుసి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన మధ్యాహ్న భోజన వర్కర్స్ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇచ్చే 3000 రూపాయలు వేతనం కూడా సరైన సమయంలో అందించడంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భూక్య దసురు, కుమారి హనుమంతరావు, బొడ్డు కేశవరావు, ఎఐటియుసి యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## నేటినుంచి గ్రామ సభలు

**ప్రజాపక్షం/కొందుర్గు:** రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం నుంచి 24వరకు గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ లక్ష్మీ అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 విశ్వనాథ్‌పూర్, చెర్కుపల్లి, పులుసుమామిడి, పాత ఆగిర్యాల, లాలాపేట్, శ్రీరంగాపూర్, మహాదేవ్‌పూర్, వెంకిర్యాల, 22న రేగడి చిల్కమర్రి, ముట్పూర్, గంగన్నగూడ, పర్వతాపూర్, ఆగిర్యాల, ఉత్రాస్‌పల్లి, ఉమ్మెంత్యాల, చిన్న ఎల్కిచర్ల, భైరంపల్లి, లక్ష్మీదేవిపల్లి, 23న తంగళ్లపల్లి, అయోధ్యాపూర్‌తాండ, 24న కొందుర్గు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

# మహానగరి

## గ్రామసభలు విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/యాచారం :** గ్రామాల్లో 21 నుండి 24 వరకు నిర్వహిస్తున్న గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపిడిఒ నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం యాచారం ఎంపిపి కార్యాలయంలో అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేర వేయడంలో ముందుండి పని చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు అయ్యప్ప, వ్యవసాయాధికారి అర్ రవినాథ్, పంచాయతి రాజ్ డిఈ, ఎస్ఐ తెజంరెడ్డి,ఎంపిఒ శ్రీలత, ఎపిఒ లింగయ్య, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

## 'పెన్షనర్లకు హెల్త్‌కార్డులివ్వాలి'

టిఎస్‌జిడబ్ల్యూపిఎఫ్ విజ్ఞప్తి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు, ఉద్యోగులకు క్యాష్ లెస్ హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మహిళా పెన్షనర్ల ఫోరం (టిఎస్‌జిడబ్ల్యూపిఎఫ్) చైర్‌పర్సన్ ఆర్.ఉమాదేవి, కో–చైర్ పర్సన్ కె.ధనలక్ష్మి సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని పలువురు మంత్రులను, అధికారులను కలిసి కోరినట్టు చెప్పారు. ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి పెన్షనర్లకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని వినతిపత్రం అందజేయగా, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న సిఎం రేవంత్‌రెడ్డి హెల్త్‌కార్డులపై ప్రకటన చేసి, పెన్షనర్లకు కానుకగా అందజేస్తారని నమ్ముతున్నట్టు వారు పేర్కొన్నారు. సమావేశంలో ఫోరం కన్వీనర్ ఎస్ఎంఎల్ నాగమాంబ, వైస్‌చైర్‌పర్సన్‌లు నాగమణి రెడ్డి, జానకి , కో–కన్వీనర్‌లు భాగ్యలక్ష్మి , జి.లక్ష్మి , కోశాధికారి డి.జ్యోతిశ్రీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సఫియా సుల్తానా, సెక్రటరీలు డి.వరుధిని, గీతాంజలి పాల్గొన్నారు.

## సర్వజన సాహితీ సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడిగా అబ్దుల్ రషీద్



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** రచయితలు, కవులను ప్రోత్సహించడం, విద్యార్థులను తెలుగు భాష, కవిత్వంపై ఆకర్షింపజేయడం, పేదలకు ఆర్థిక సాయం వంటి సేవా కార్యక్రమాలు చేసే సర్వజన సాహితీ సామాజిక సేవా సంస్థ అధ్యక్షులుగా ప్రముఖ రచయిత, అనువాదకులు, కవి అబ్దుల్ రషీద్ ఎన్నికయ్యారు. నగరంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు నాళేశ్వరం శంకరం, ప్రముఖ రచయిత, కవి డి.వి. రాజగోపాల్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. సంస్థ ఉపాధ్యక్షులుగా దీపక్ న్యాతి, డాక్టర్ ఉషారాణి,డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, ప్రధానకార్యదర్శిగా మోటూరి నారాయణరావు, సహాయ కార్యదర్శులుగా మహమ్మద్ అన్వర్ పాషా, దన్నారం శ్రీనివాస్, మురళీకృష్ణ, అమీన్ రషీద్, గొర్రెపాటి శ్రీను, కోశాధికారిగా డాక్టర్ జెవి రవి కుమార్, నిర్వహణ కార్యదర్శులుగా దన్నారం శ్రీనివాస్, మొండ్రెటి సత్య వీణ, మీడియా సెక్రటరీగా వేము వందనం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## చెత్త రహిత డివిజన్‌గా తీర్చిదిద్దుతాం

కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** బియన్ రెడ్డి నగర్ డివిజన్‌ను చెత్త రహిత డివిజన్‌గా తీర్చిదిద్దుతామని బిఎన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని పలు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రతి కాలనీలో జిహెచ్‌ఎంసి కార్మికులు పనిచేసే వారు రోడ్లపై చెత్త లేకుండా ప్రతి రోడ్లు శుభ్రపరచాలని కార్మికులకు కోరారు. కాలనీ వాసులు తమ ఇంట్లో చెత్తను జిహెచ్‌ఎంసి ఆటో రిక్షాలోనే వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌ఎస్ అజీమ్ ఉద్ధీన్, స్‌ఎఫ్‌ఎ చంద్రశేఖర్, జవాన్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురం డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

మంత్రికి కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురం డివిజన్ అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేయాలని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఎల్‌బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌తో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో వీధి లైట్లు, డ్రైనేజీ పునరుద్దరణ, నూతన సీసీ రోడ్లు, పార్కుల సుందరీకరణ పలు సమస్యలు కాలనీ వాసులు తమ దృష్టికి తీసుకోచ్చారని, పలు సమస్యల పరిష్కారం కోసం నిధుల కొరత ఉందని మంత్రిని కార్పొరేటర్ వివరించారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని మంత్రి తెలిపినట్లు కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్వే శిక్షణ కార్యక్రమం




**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు,నూతన రేషన్ కార్డుల సర్వేపై శిక్షణ కార్యక్రమం హిమాయత్ సాగర్‌లోని బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ ప్రధాన కార్యలయంలో సోమవారం జరిగింది.ఈసందర్భంగా కమీషనర్ బి.శరత్ చంద్ర అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.....ఈనెల 21వ తేదీ నుంచి జరుగనున్న వార్డు సభ్యుల నియమ నిబంధనలు వార్డు ఆఫీసర్లకు వివరించారు.ఈకార్యక్రమంలో మేనేజర్ ఇ.మంజులత,డిప్యూటీ ఈఈ జి.యాదయ్య,సూపర్ వైజర్ అధికారులు,వార్డు అధికారులు మరియు మున్సిఫల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి పార్కు స్థలం అన్యాక్రాంతంపై..

# మేయర్ విజయలక్ష్మి ఆగ్రహం





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 36లో జిహెచ్‌ఎంసికి చెందిన పార్కు స్థలం కబ్జాకావడంపై నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయర్ అన్యాక్రాంతమైన పార్కు స్థలాన్ని సోమవారం డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఇతర విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ వెనుకభాగంలో గల పార్కుస్థలంలో బయట ఉన్న జిహెచ్‌ఎంసి బోర్డును ఓ ప్రైవేట్ వ్యక్తి తొలగించి, ఆ బోర్డును ఎవరికీ కనిపించకుండా పెట్టి జిహెచ్‌ఎంసి పార్కు స్థలంలో పైప్‌లైన్ వేసి కూరగాయలు పండించుకుంటున్నట్లు పరిశీలనలో మేయర్ దృష్టికి వచ్చింది. పార్కు పక్క ఫ్లాట్ వ్యక్తి తన సరిహద్దులో పెద్ద ప్రహరీగోడ నిర్మించుకోవడంతో నిచ్చెన వేసుకొని పార్కులోకి దిగి ఖాళీ స్థలంలో కూరగాయలు పండించుకుంటున్నట్లు గుర్తించారు. ప్రైవేటు వ్యక్తి పార్కు స్థలాన్ని ఆక్రమించుకొని కూరగాయలు పండించుకుంటున్న నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వే చేసి పార్కు స్థలంలో ఉన్న ప్రహరీగోడను, పార్కులోని కూరగాయల మొక్కలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని, జిహెచ్‌ఎంసి బోర్డును యథావిధిగా ఏర్పాటు చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. అన్యాక్రాంతమైన సుమారు 1500 చదరపు గజాల స్థలాన్ని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కాపాడారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి పార్కు స్థలాన్ని కానీ, ఖాళీ స్థలాలను కబ్జా చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. క్రిమినల్ కేసులు పెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థిక స్వావలంబనతో మరింత ఉన్నతంగా ఎదగాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆకాంక్షించారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను సోమవారం మేయర్ ప్రారంభించారు. ఎన్‌బిటి నగర్ ఎస్ ఎల్‌ఎఫ్ 5 గణేష్ ఎస్‌హెచ్‌జి గ్రూప్‌నకు రూ.10 లక్షల బ్యాంక్ లింకేజి రుణం మంజూరు కాగా, అందులో రూ.5 లక్షలతో ఐదు మంది మహిళలు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం మహిళా సాధికారతను ప్రోత్సహించడానికి ఏర్పాటు చేశామన్నారు. ఈ క్యాంటీన్‌లతో స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభించడానికి ప్రణాళికలు ఉన్నాయన్నారు. మహిళలు ఆర్థికం అభివృద్ధి కుటుంబ రక్షణకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, యుసిడి అదనపు కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రశాంతి, రజనీకాంత్‌రెడ్డి, యుసిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆశా వెరోనికా తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు ఆరోగ్యంపై దృష్టి

షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మీ

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** చదువుతోపాటు వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించేందుకు విద్యార్థులు కృషి చేయాలని షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మీ సూచించారు. సోమవారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కిషన్‌నగర్‌లో ఉన్న శ్రీ జగద్గురువు పంచాచార్య వీర శైవ ఆగమ పాఠశాలలోని వేద పాండిత్యం నేర్చుకుంటున్న విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ వేద పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, చిన్న ఆరోగ్య సమస్య ఉన్నా తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ పాఠశాలలో 105మంది విద్యార్థులు ఉండగా 95మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు వివరించారు. 33మంది విద్యార్థులకు సంబంధించిన రక్త నమునాలను ల్యాబ్‌కు పంపించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు, వైద్య సిబ్బంది డాక్టర్ జగదీశ్వర్, ముస్తాక్ హమ్మద్, హెల్త్ సూపర్ వైజర్ శ్రీరమ, ల్యాబ్ టెక్నిషియన్ అశోక్, ఎఎన్‌ఎం సుగుణ పాల్గొన్నారు.




## గ్రంథాలయాలతో రాజకీయ చైతన్యం





మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** గ్రామీణ గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తేనే ప్రజల్లో రాజకీయ చైతన్యం వస్తుందని పర్యాటక, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం షాద్‌నగర్ గ్రేడ్1శాఖ గ్రంథాలయాల నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. చైర్మన్‌గా కొప్పుల మదన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నక్క బాల్‌రాజ్, వీరేశంతోపాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ మహనీయులు, గొప్ప నాయకులు జీవిత చరిత్రలను గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. షాద్‌నగర్ గ్రేడ్1 శాఖ గ్రంథాలయ అభివృద్ధికి రూ.5లక్షల నిధులు తన శాఖ ద్వారా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర చరిత్రను మార్చిన ఘనత గ్రంథాలయాలకు ఉందని, నాటి స్వాతంత్ర్య ఉద్యమాలను మొదలుకొని నేటి తెలంగాణ మలిదశ ఉద్యమం వరకు గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించాయన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, జీవితాన్ని మంచి మార్గం వైపు మలుచుకోవడానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. గ్రంథాలయాల అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అంధించేందుకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.షాద్‌నగర్ గ్రేడ్1శాఖ గ్రంథాలయాన్ని డిజిటలైజేషన్ చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి వివరించారు. గ్రంథాలయాలకు మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకున్నప్పుడే ఫలితాలు వస్తాయని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి సూచించారు.

**నూతన పాలకవర్గం సభ్యులు వీరే...** షాద్‌నగర్ గ్రేడ్1శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్లు నక్క బాలరాజ్, వీరేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా క్యూసెన్ శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా కుమ్మరి చంద్రశేఖర్, సింగపాగ అనిల్‌కుమార్, కార్య నిర్వాహక కార్యదర్శిగా సుదర్శన్ గౌడ్, సభ్యులుగా ఫయాజ్, కత్తి చంద్రశేఖర్ అప్ప, కాట్న రాజేష్, కృష్ణారెడ్డి, శివరాములు యాదవ్, ఆలోనిపల్లి రాజు గౌడ్, రవి, రేకల శ్రీకాంత్ గౌడ్, జట్టు అనిల్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, శివశంకర్ గౌడ్, కొమ్ము కృష్ణ, పురుషోత్తంరెడ్డి, కావలి కృష్ణ, అందె మోహన్ ముదిరాజ్, తిరుపతిరెడ్డి, రఘునాయక్, దంగు శ్రీనివాస్ యాదవ్, మహ్మద్ ఇబ్రహీం, సీతారాములు, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని, అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు,గ్రామ సభలలో దరఖాస్తుల స్వీకరణ, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. రేషన్ కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ఫీల్డ్ వెరిఫికేషన్, గ్రామ సభలపై సోమవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జడ్‌పి సిఇఒ కృష్ణ రెడ్డి, ఆర్‌డిఒలు, తహసీల్దార్‌లు, వ్యవసాయ శాఖ, సివిల్ సప్లై అధికారులు, ఎంపిడిఒలు, వ్యవసాయ అధికారులు, ఎంపిఒలు, మున్సిపల్ కమిషనర్‌లతో టెలికాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామసభలకు ఏర్పాట్లు చేయాలని, గ్రామసభలకు హాజరయ్యే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని, సమస్యాత్మక ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డ్‌లు జారీ చేయడం జరుగుతుందని, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియ అని చివరి లబ్ధిదారుల వరకు అందించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ అధికారులు, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసా లబ్దిదారులను గుర్తించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కనీసం ఇరవై రోజుల పాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపచేయడం జరుగుతుందని తెలిపారు.



**ప్రజావాణికి ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి...**సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 87 ఫిర్యాదులు అందాయని కలెక్టర్ సి,నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత,వివిధ శాఖల జిల్లా అధికారులు,మున్సిపల్ అధికారులు,మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఐక్యత

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలతో యువతలో ఐక్యత వస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డితో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయానికి విచ్చేసిన ప్రజా ప్రతినిధులకు మాజీ సర్పంచ్ చేగూరి రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణానికి దేవునిపల్లి గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బాల్‌రాజ్ గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, బస్వం, జంగ నర్సింహ్మా, కుమారస్వామి గౌడ్, కొమ్ము కృష్ణ, ముబారక్ అలీఖాన్ పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని పలు వార్డులలో రూ.81 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు, రోడ్డు డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్‌గౌడ్‌తో కలసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి వార్డు, పట్టణాలను అభివృద్ధి చేయడమే తన ప్రాధాన్యత అన్నారు. తుర్కయాంజాల్ ప్రాంతం వేగవంతమైన అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందన్న నమ్మకంతో ఈ పనులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. చేపట్టిన అభివృద్ధి పనులు తుర్కయాంజాల్ మున్సిపాలిటీ ప్రజలకు మౌలిక సదుపాయాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. పది సంవత్సరాలు బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కనీస అభివృద్ధి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొషికే ఐలయ్య, కౌన్సిలర్లు సంగీత మోహన్ గుప్తా, వేముల అమరేందర్ రెడ్డి స్వాతి, కీర్తన విజయానంద రెడ్డి, మర్రి మాధవి మహేందర్ రెడ్డి, నక్క శివలింగంగౌడ్, అనురాధ దర్శన్, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## స్థానిక ఎన్నికల్లో విజయ దుందుభి

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**ప్రజాపక్షం/నార్సింగి :** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో హెచ్ఎండిఏ నిధులు రూ.50 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న నిర్మాణం కొనసాగుతున్న పనులకు సోమవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలను చేశారు. శంషాబాద్ మున్సిపల్ పరిధిలో 5 కోట్ల తో నిర్మిచానున్న 50 పడకల ఆస్పత్రి భవనానికి రూ.2 కోట్ల 95 లక్షలతో నిర్మించనున్న అవుట్ డోర్ స్టేడియం పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో కూడా స్థానిక ఎన్నికల్లో విజయ దుందిబి మోగించి శంషాబాద్ మండలంతో పాటు మున్సిపాలిటీని సర్వతో ముఖ అభివృద్ధికి కృషి చేసుకుందామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ మహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు, మున్సిపల్ డి ఇ సాజిద్, మున్సిపల్ ఎఇ నరేష్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ నెంబర్‌లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాప్యం లేకుండా సిసి రోడ్డు పనులు పూర్తి

### కార్పొరేటర్ గున్నాల సునీత

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఎలాంటి జాప్యం లేకుండా సిసి రోడ్డు పనులు పూర్తి చేయాలని మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీత సూచించారు. డివిజన్‌లోని సుధానగర్ ప్రాంతంలో కొనసాగుతున్న సిసి రోడ్డు పనులను ఆమె స్థానిక బిజెపి శ్రేణులు శేఖర్‌యాదవ్, సాయిబాబా, శివగౌడ్, మల్లారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, సునీల్, అనీల్, సుధీర్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిసి రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలతో పూర్తయ్యేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు.

# మహానగరి

## ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సివిల్ సర్వీసెస్ క్రీడల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా యువజన మరియు క్రీడాల శాఖాధికారి జివి గోపాలరావు సూచించారు. అథ్లెటిక్స్, క్రికెట్, క్యారమ్స్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టెన్నిస్, వాలీబాల్, వెయిల్ లిఫ్టింగ్, రెజ్లింగ్, ఖోఖో, యోగాలలో జరిగే ఈ పోటీలకు గాను ఈ నెల 21లోగా తమ కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలని, క్రీడా పోటీలు ఈ నెల 23,24 తేదీల్లో ఎల్‌బి స్టేడియంలో జరుగుతాయన్నారు. .



## కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో 'ఆర్‌ఆర్‌ఆర్' కార్యక్రమం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** స్వచ్ఛ సర్వేక్షన్ 2025లో భాగంగా రీ యూస్, రెడ్యూస్, రీసైక్లింగ్(ఆర్‌ఆర్‌ఆర్) కార్యక్రమం గూర్చి కుషాయిగూడ జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కాప్రా శానిటేషన్ విభాగం సూపర్‌వైజర్ సుదర్శన్ మాట్లాడుతూ నిరుపయోగమైన వస్తువులను జిహెచ్‌ఎంసి కాప్రా సర్కిల్ ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లకు తడి,పొడి చెత్తను, పాడైపోయిన వస్తువులను అందించాలని విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియజేయాలని అన్నారు. ప్రతి విద్యార్థులు చెత్తపై అవగాహన కల్గినప్పుడే రాష్ట్రంగానీ దేశం స్వచ్ఛతగా ఉంటుందని ఎంఇఒ బాపురెడ్డి, ప్రధానోపాధ్యాయులు అన్నారు. ఈ కార్యక్రమంలో జవాన్ రాజన్, రామకృష్ణ, ధశరథ్, కృష్ణ, ఎస్‌ఎఫ్‌ఎలు మంజుల, సుజాత, లక్ష్మి , శిరీషా, అంజలి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాల్లో బాల్‌రెడ్డిదే హల్‌చల్



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి ప్రభుత్వ విప్, శాసన మండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి కొలను బాల్ రెడ్డి హల్‌చల్ చేశారు. తనే ముందుండి పట్నం మహేందర్ రెడ్డికి ఘన స్వాగతం పలకడంతో పాటు భారీ ఎత్తున యువజనంతో హల్‌చల్ చేశారు. దీంతో కార్యక్రమంలో యువజనంలో నూతన ఉత్సాహాన్ని బాల్ రెడ్డి చూపించడం చర్చనీయాంశమైంది.



## తెలంగాణ ఉద్యమకారిణి డోలి కృష్ణవేణి మృతి

**ప్రజాపక్షం/అల్వాల్:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఉద్యమకారిణి డోలి కృష్ణ వేణి సుధీర్ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. తెలంగాణ ఉద్యమ కాలం నుండి తెలంగాణ ఉద్యమంలో భాగంగా సమైక్య పాలకుల ప్రభుత్వాల ప్రతిఘటనలు ఎదుర్కొంటూ ఉద్యమ ఆకాంక్షను ఎదుర్కొంటూ ఉద్యమ ఆకాంక్షను వినిపించారు. అల్వాల్ ప్రజలకు కృష్ణవేణి మృతి తీరని లోటు అని అన్నారు. ఆమె అభిప్రాయం మేరకు నేత్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, ఉద్యమకారులు పుట్నాల కృష్ణ, రాపర్తి చంద్రశేఖర్, ఢిల్లీ పరమేష్, ఉద్యమకారుడు, తదితరులు పాల్గొన్నారు.

## నాగారంలో రూ.3.80కోట్లతో అభివృద్ధి పనులకు తీర్మానం

**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ చంద్రారెడ్డి అధ్యక్షతన సాధారణ సమావేశంలో 3 కోట్ల 80 లక్షల రూపాయల పనులకు తీర్మానం చేశారు. మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీ పనుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి,వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్,కౌన్సిలర్లు,కోఆప్షన్ సభ్యులు,మేనేజర్ చంద్రశేఖర్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు**

నాగారం మున్సిపాలిటీ పాలకవర్గం 5 సంవత్సర కాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ పాలకవర్గం సమావేశంలో మాట్లాడుతూ పాలక వర్గం కాలం కొన్ని రోజులతో ముగుస్తున్నందున ఆయన మాట్లాడుతూ అయిదేండ్లలో నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించిన కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు, ప్రజలకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.




## లయన్స్ సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రీజియన్ చైర్మన్ పోచంపల్లి వెంకటరమణారావు చేస్తున్న సేవలు అభినందనీయమని మాజీ బ్యూరోక్రాట్, సివిల్ మెంటార్, సిఎస్‌బిఐఏఎస్ అకాడమీ అధినేత మల్లవరపు బాలలత అన్నారు. చర్లపల్లి సిఐఎ భవనంలో నిర్వహించిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 హెచ్ తిలక్ రీజియన్ చైర్మన్ పివి రమణారావు, మాధవి రమణీయం రీజియన్ మీట్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. పేద మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజియన్ అడ్వైజర్ మనోహరరాజు,పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై ఎం ధర్,సునైనా అమీనా, గంపా నాగేశ్వరరావు, సెకండ్ వైస్ గవర్నర్ విశ్వేశ్వరరావు,వెంకటేశ్వరరెడ్డి, మిరుపాల గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

# హామీలన్నింటినీ నెరవేరుస్తున్నాం

### ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నారని ప్రభుత్వ విప్, శాసన మండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా సాగాయి. కార్పొరేషన్ పాలక మండలి మరికొద్ది రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో సోమవారం సుమారు రూ.8.69 కోట్ల పై చిలుకు నిధులతో మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, శాసన మండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి విచ్చేసి స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానందతో కలిసి నిజాంపేట్ భవ్యాస్ ఆనందం అపార్ట్‌మెంట్ నుండి హిల్ కౌంటీ వరకు రూ. 2.80 కోట్లతో సిమెంటు రోడ్డు పనులను, రాజీవ్ గాంధీ నగర్‌లో రూ. 1.89 కోట్లతో సిసి రోడ్డు, డివిజన్‌లు 15, 16, 20 పరిధిలోని జయదీపిక ఎన్‌క్లేవ్ నుండి పూజిత ఎన్‌క్లేవ్ వరకు రూ. 1.20 కోట్లతో సిమెంటు రోడ్డు పనులను, తెలుగు విశ్వ విద్యాలయంలో రూ.1.20 కోట్లతో బిటి రోడ్డు పనులను, ప్రగతి నగర్ ప్రధాన రహదారిలో రూ.80లక్షలతో బిటి రోడ్డు పనులు, ప్రగతి నగర్ కమాన్ నుండి శ్రీ కృష్ణ కాలనీ మీదుగా లోహిత అపార్ట్‌మెంట్ వరకు రూ.80లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ నిధులను విడుదల చేశారని, అన్ని మున్సిపాలిటీలతో పాటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సైతం దాదాపు రూ.169 కోట్ల నిధులను విడుదల చేశారని



తెలిపారు. ఇట్టి నిధులతో ప్రణాళికలను రూపొందిస్తున్నారని, అదేవిధంగా ప్రగతినగర్ కమాన్‌ని అంబేద్కర్ చౌరస్తాగా తీర్మాణించి పరిష్కరిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల్లో భాగంగా బస్సు సౌకర్యం, విద్యుత్, గ్యాస్ సబ్సిడిలతో పాటు నియోజకవర్గానికి 3500 ఇళ్లు వచ్చాయని, నూతన రేషన్ కార్డులను సైతం ఈ నెల 26 నుండి ఇస్తామని తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు నిధులు విడుదలయ్యాయని, ప్రభు త్వ పరంగా అన్ని హామీలను నెరవేరుస్తున్నామని అన్నారు. సంవత్సర పాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్నింటిని ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని, రూరల్ ప్రాంతంలో రైతులకు కూడా రెండు లక్షల రుణమాఫీ చేయడ ం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ పూల్ సింగ్, కమిషనర్ సాబెర్ అలీ, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి, డిప్యూటీ మేయర్ దన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్‌లు చిట్ల దివాకర్, ఆగం రాజు, కాసాని సుధాకర్, కొలను వీరేందర్ రెడ్డి, సురేశ్ రెడ్డి, పాండు, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, సుజాత, సీనియర్ కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కొలను బాల్ రె డ్డి, బిఆర్ఎస్ నాయకులు, ఎన్ఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

**భారత రాజ్యాంగ పరిరక్షణ సభ పోస్టర్ విడుదల**

భారత రాజ్యాంగ పరిరక్షణ సభ పోస్టర్‌ని ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి విడుదల చేశారు. ప్రగతినగర్ లోని కెజిఆర్ గార్డెన్‌లో భారత రాజ్యాంగాన్ని ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు పాఠ్యాంశాల్లో చేర్చి బాల బాలికలకు రాజ్యాంగం యొక్క విలువలు, విశిష్టతను తెలిపే విధంగా జరగాలని అందుకోసం మార్చి ఒకటవ తేదీన సూరారంలో జరిగే సభకు పట్నం మహేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరు కావాలని దలిత సంఘం నేతలు ఆహ్వాన పత్రికలను అందజేశారు.



**సమాచారం లేకుండా రావడంపై ఎమ్మెల్యే గరంగరం**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం ఎనిమిది కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, శాసన మండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అయితే స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానందకు ప్రభుత్వ విప్ విచ్చేస్తున్న సమాచారాన్ని ఆలస్యంగా తెలిపినట్లు సమాచారం. కాగా అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేసిన పట్నం మహేందర్ రెడ్డిని స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద తన నియోజకవర్గానికి అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేస్తున్నప్పుడు కనీసం మీరైనా తనకు సమాచారం ఇవ్వాలి కదా అని మహేందర్ రెడ్డిని ప్రశ్నిం చారు. దీనిపై పట్నం మహేందర్ రెడ్డిని మీడియా ప్రశ్నించగా స్థానిక ఎమ్మెల్యేకు మేయర్, అధికారులు సమాచారం ఇచ్చారని, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం అందరిని కలుపుకుపోయి, కలిసి చేయాల్సి ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యేని వేరుచేయాలని లేదని, మేయర్, ఇతరులు కూడా సమాచారం ఇచ్చారు కాని కొంత ఆలస్యమైనట్లు తెలిసిందని, ఇకముందు ఈ విధంగా జరగకుండా చూస్తామని తెలిపారు.

**నినాదాలతో హోరెత్తిన ప్రగతినగర్ కమాన్**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ కమాన్ వద్ద జరిగిన పలు అభివృద్ధి పనుల్లో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు జై కాంగ్రెస్, జై మహేందర్ రెడ్డి అంటూ, బిఆర్ఎస్ నాయకులు జై తెలంగాణ అంటూ నినాదాలు పోటాపోటీగా చేశారు. దీం తో స్థానికంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ మేరకు ఎసిపి శ్రీనివాస రావు నేతృత్వంలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.

## స్థలాలు అమ్మి కోట్ల రూపాయలు దండుకోవడం దారుణం

### కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**ప్రజాపక్షం/కూకట్ పల్లి :** రేవంత్ రెడ్డి సర్కార్ హౌసింగ్ బోర్డు స్థలాలను అమ్మకానికి పెట్టి కోట్ల రూపాయలు దండుకోవడం దారుణమని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కెపిహెచ్‌బి కాలనీలోని ఎన్నో సంవత్సరాలుగా ఉంటున్న వేణు గోపాల స్వామి ఆలయ మండపాన్ని హౌసింగ్ బోర్డు అధికారులు సీజ్ చేసిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ మండడి శ్రీనివాస్ రావుతో కలిసి వేణు గోపాల స్వామి ఆలయాన్ని సందర్శించి పరిశీలించారు. అదే విధంగా హౌసింగ్ బోర్డులోని జీహెచ్ఎంసీ అధినంలో ఉండే రమ్య గ్రౌండ్ పార్కు స్థలాన్ని సైతం హౌసింగ్ బోర్డు అధికారులు బోర్డులు పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో ప్రజల సౌకర్యార్థం కేపీహెచ్ బీ కాలనీలో మహిళా పార్కులు, చిల్డ్రన్ పార్కులు, ఆట స్థలాలను, క్రికెట్ గ్రౌండ్‌లను ఏర్పాటు చేశామన్నారు. హౌసింగ్ బోర్డు స్థలాలలో ప్రజా ప్రయోజనార్థం 10 శాతం భూములను ఆలయాలకు, విద్యాలయాలకు, పార్కులకు కేటాయించాలన్నారు. ఎలాంటి కేటాయింపులు చేయకుండా వేలం పాటలు ఏ విధంగా వేస్తారని ప్రశ్నించారు. ఎన్నో సంవత్సరాలుగా ఉంటున్న ఆలయ మండపానికి ఎవరికి చెప్పకుండా ఎలా సీజ్ చేస్తారని ప్రశ్నించారు. ఎన్నో సంవత్సరాలుగా ఉంటున్న ఆలయ మండపానికి ఎవరికి చెప్పకుండా ఎలా సీజ్ చేస్తారని, కనీసం పంచనామా జరపకుండ ఆలయ సిబ్బందికి, కమిటీకి చెప్పకుండ అధికారులు ఎలా సీజ్ చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ధోరణిమార్చుకోకపోతే ఈ నెల 24 న జరిగే వేలం పాటను అడ్డుకోవడానికి బిఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి, శ్యామల రాజు, రాజేష్, పవన్, పి.ఎల్. ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలను ఆదుకోవడం ప్రభుత్వ ధ్యేయం : ఎంఎల్ఎ





**ప్రజాపక్షం/తాండూరు:** నిరుపేదలకు వైద్య సేవలు అందించి వారిని ఆదుకోవడానికి ఎల్ఓసిలను అందజేస్తుందని తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు బాధిత కుటుంబాలకు సోమవారం ఎంఎల్ఎ చేతుల మీదుగా ఎల్ఓసిలను అందజేశారు. తాండూరు పట్టణానికి చెందిన మక్బూల్ అహ్మద్‌కు రూ.5లక్షలు, పెద్దేముల్ గ్రామానికి చెందిన వెంకటయ్యకు రూ.75.000వేలు ఎల్ఓసిలను మంజూరు చేయించి వారి కుటుంబాలకు చెక్‌లను అందజేశారు. నిరుపేదలకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల నాయకులు ఉన్నారు.

**ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం**

ఎల్ఎన్ఆర్ యువసేన వ్యవస్థాపకులు, కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు ఆధ్వర్యాన శంకర్ ఆసుపత్రి సౌజన్యంతో సోమవారం తాండూరు మండల పరిధి కరణ్‌కోట్ గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. నిరుపేదలకు వైద్య సేవలు అందించడం ఎంతో సంతోషదాయకమని, వైద్య శిభిరాలను ఏర్పాటుచేసి ఉచితంగానే మందులు అందించి వారిని అన్ని విధాలుగా సేవలు అందించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఉచిత వైద్య శిభిరాలను మండడలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




## గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** జిల్లా కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత విభాగ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కల్సి జిల్లా అధికారులు, పోలీసు విభాగ అధికారులతో కల్సి సమీక్షా సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు గౌరవ వందన స్వీకరణ, బందోబస్తు ఏర్పాట్లను నిర్వహించాలని, వేదిక, అహ్వానితుల సీటింగ్ వ్యవస్థ, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, మంచీ నీరు. పారిశుధ్య పనుల విషయంలో అవసరమైన పనులు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించి సందేశ పుస్తకాన్ని సకాలంలో తయారయ్యేలా చూడాలని, విద్యాసంస్థలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేయాలన్నారు. దీంతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించి స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

**ప్రజావాణిలో 60 ఫిర్యాదులు :** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సత్వర పరిష్కారానికి అందించే ఫిర్యాదులను వెంటనే పరిశీలించి న్యాయం చేకూర్చాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. డిఆర్ఓ హరిప్రియ ఇతర విభాగాల అధికారులతో కల్సి అర్జీలను స్వీకరించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన 60 ఫిర్యాదులను స్వీకరించిన ఆయన అర్జీలను వెంటవెంటనే పరిష్కరిస్తూ వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయటంతో పాటు వాటి వివరాలను సంబంధిత ఫిర్యాదస్తులకు తెలియచేయాలని, పరిష్కరించలేకపోతే దానికి కారణాలను సైతం తెలియచేయాలని అధికారులను సూచించారు.

## 21నుండి 24వరకు గ్రామసభలు నిర్వహించాలి : కలెక్టర్ ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21నుండి 24వరకు గ్రామ సభలను ఖచ్చితంగా షెడ్యుల్ ప్రకారం నిర్వహించాలి అన్నారు. గ్రామ సభలకు అన్ని ఏర్పాట్లు చేయాలి ,లబ్దిదరుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంనుండి అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్ , సుధీర్‌తో కలిసి కలెక్టర్ జిల్లాలోని అధికారులతో సమిక్ష సమవేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలు ఉన్నచోట ఉదయం 9.30నుండి 12.30వరకు 1.30నుండి 3.30వరకు గ్రామసభలు నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, సమస్యాత్మక సమస్యలకు సానుకలంగా సమాధానం ఇవ్వాలని అదేశించారు. రేషన్‌కార్డులు, రైతుభరోసా , ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారులపై అభ్యంతరాలుంటే దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారుల క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, డిఎస్ఓ మోహన్‌బాబు , పిడి హౌసింగ్ కృష్ణ తదితరులు పాల్గోన్నారు.



## పాఠాలు బోధించడం లేదని కళాశాలకు తాళంవేసిన విద్యార్థులు

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పట్టణంలోని శ్రీసాయి డిగ్రీకళాశాల విద్యార్థులు భగ్గుమన్నారు. అధ్యాపకులు, కళాశాలలకు రావడం లేదని, గత రెండు మాసాలుగా పాఠాలు బొధించడం లేదంటూ కళాశాల యాజామాన్యం తీరును నిరసిస్తూ విద్యార్థులు కళాశాలలకు తాళం వేసి నిరసనకు దిగిన ఘటన సోమవారం వికారాబాద్ జిల్లా తాండూరులో చోటు చేసుకుంది. గత రెండు మాసాలుగా విద్యాబోధన లేక తాము చదువుకునేది ఎలాఅని , తమ విలువైన జీవితాలలో కళాశాల యాజమాన్యం ఆటలాడుతుందని ఆవేదన వ్యక్త పరుస్తూ నిరసన తెలిపారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించిన తమ సమస్యను పరిష్కరించాలని వారు విద్యార్థులు డిమాండ్ చేశారు.

## రూ.437 కోట్ల మున్సిపల్ బడ్జెట్

### సర్వసభ్య సమావేశంలో చైర్మన్

**ప్రజాపక్షం/కొడంగల్:** కొడంగల్ మున్సిపల్ అభివృద్ధికి రూ.437కోట్ల నిధులు మంజూ రు అయినట్లు మున్సిపల్ చైర్మెన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం కొడంగల్ మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ పాలక మండలి ఈ నెల 26వ తేదితో ముగియనుండటంతో బడ్జెట్‌ను రూపొందించారు. గత 5 ఏళ్ల పాలనలో కొడంగల్ మున్సిపల్ ఎంతో అభివృద్ది చెందిందని తెలిపారు. 15వ వార్షిక బడ్జెట్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కొడంగల్‌కు 437 కోట్ల నిధులు మంజురు అయ్యాయని అందులో భాగంగానే త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వెడల్పు, అండర్ డ్రైనేజీ పనులు, పాతకొడంగల్ పెద్ద చెరువు ట్యాంక్‌బండ్ విస్తరణ, మిని స్టేడియం తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కమిషనర్ బలరాం నాయక్, అధికారులు, తదితరులు పాల్గోన్నారు.



## వినియోగంలోకి..పనికిరాని సామాగ్రి

### విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిహెచ్ఎంసి అధికారులు

**ప్రజాపక్షం/కాప్రా :** ఇళ్లల్లో పనికి రాకుండా పడి ఉండే సామగ్రిని తిరిగి వినియోగించేందుకు జిహెచ్ఎంసి రీసైకిల్, రీయూస్, రెడ్యూస్ (RRR) సెంటర్లకు తరలించే ప్రక్రియను చేపట్టిందని కాప్రా డివిజన్ శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్ తెలిపారు. సోమవారం కుషాయిగూడలోని జిల్లా పరిషత్ హైస్కూలలో విద్యార్థినీ విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ భారత్ మిషన్ స్వచ్ఛ సర్వేక్షన్ 2024లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం పరసరాల పరిసరాల పరిశుభ్రతను అమలు చేస్తోందన్నారు. తమ ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు పనికిరాని వస్తువులను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా తమకు అప్పచెప్పటం ద్వారా వినియోగంలోకి తేగలుగుతారని, దీని వల్ల అనారోగ్యాలకు గురికాకుండా ఉంటారని తెలిపారు. తమ ఇళ్లల్లో కానీ ప్రతి రోజు వచ్చే చెత్తను తడి పొడిగా వేర్వేరుగా చేసి తమ వద్దకు ఉదయాన్నే చెత్తను తీసుకొనేందుకు వచ్చే స్వచ్ఛ భారత్ ఆటో కార్మికులకు మాత్రమే ఇవ్వాలే తప్ప ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దని కోరారు. ప్రతి రోజు బయట పడేసే ప్లాస్టిక్ బాటిల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, న్యూస్ పేపర్లు, పాత బట్టలు, పుస్తకాలు లాంటి అనేక వస్తువులను తిరిగి ఉపయోగించేందు కు రీసైకిల్, రీయూస్, రెడ్యూస్ (RRR) ప్రక్రియ కోసం మల్లాపూర్, నేరేడ్‌మెట్, మల్కాజిగిరి ప్రాంతాల్లో RRR సెంటర్లను ఏర్పాటు చేసామని తెలిపారు. ఇలాంటి వస్తువులను పౌరులందరూ తమ బాధ్యతగా గుర్తించి జిహెచ్ఎంసి నుండి వచ్చే స్వచ్ఛ ఆటో సిబ్బందికి తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని కోరారు.

# క్రీడ

## ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ రేపే షురూ..



ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌ను 1-3తో కోల్పోయిన టీమిండియా వైట్‌బాల్ సిరీస్‌లకు సిద్ధమైంది. సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌తో పాటు మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ముందుగా టీ20 సిరీస్ జరగనుండగా.. బుధవారం కోల్‌కతా వేదికగా జరిగే తొలి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఇరు జట్లు కోల్‌కతా చేరి ప్రాక్టీస్ ప్రారంభించాయి. ఆస్ట్రేలియా పర్యటనలో ఆడిన ఆటగాళ్లంతా ఈ టీ20 సిరీస్‌కు దూరంగా ఉన్నాయి. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో కుర్రాళ్లతో కూడిన జట్టు ఇంగ్లండ్‌తో తలపడనుంది. ఈ సిరీస్ కోసం బీసీసీఐ కోల్‌కతా వేదికగా 3 రోజుల ప్రాక్టీస్ క్యాంప్ ఏర్పాటు చేసింది. ఆదివారమే ఈ ప్రాక్టీస్ శిబిరం ప్రారంభమవ్వగా.. ఆటగాళ్లంతా పాల్గొని ముమ్మరంగా సాధన చేస్తున్నారు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. వెన్ను గాయంతో జస్‌ప్రీత్ బుమ్రా ఈ టీ20 సిరీస్‌కు దూరంగా ఉండగా.. శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, మహమ్మద్ సిరాజ్‌లకు విశ్రాంతినిచ్చారు. చీల మండ గాయంతో గత 14 నెలలుగా భారత జట్టుకు దూరంగా ఉన్న మహమ్మద్ షమీ.. ఈ సిరీస్‌తోనే రీఎంట్రీ ఇస్తున్నారు. ఈ సిరీస్ అతనికి కీలకంగా మారనుంది. ఈ సిరీస్‌లో సత్తా చాటి ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే అతను ఛాంపియన్స్ ట్రోఫీ 2025 జట్టులో కొనసాగనున్నాడు. మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు ప్రారంభం కానున్నాయి.

**ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ షెడ్యూల్..**
- జనవరి 22, తొలి టీ20(కోల్‌కతా)
- జనవరి 22, రెండో టీ20(చెన్నై)
- జనవరి 28, మూడో టీ20(రాజ్‌కోట్)
- జనవరి 31, నాలుగో టీ20(పుణె)
- ఫిబ్రవరి 2, ఐదో టీ20(ముంబై)

## లక్నో కెప్టెన్‌గా పంత్

అఫీషియల్ అనౌన్స్‌మెంట్!

టీమ్ ఇండియా యంగ్ ప్లేయర్ రిషభ్ పంత్ లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అతడి ఎంపికను ఫ్రాంచైజీ ఓనర్ సంజీవ్ గొయెంకా సోమవారం ఖరారు చేశారు. పంత్‌సహా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సంజీవ్ ఈ ప్రకటన చేశారు. భవిష్యత్‌లో పంత్ ఐపీఎల్ బెస్ట్ కెప్టెన్‌గా ఎదుగుతాడని సంజీవ్ నమ్మకం వ్యక్తం చేశారు.



కాగా, 2025 మెగా వేలంలో పంత్‌ను లఖ్‌నవూ రూ.27 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది. ఇక పంత్ కంటే ముందు లఖ్‌నవూ జట్టుకు కేఎల్ రాహుల్, కృనాల్ పాండ్య, నికోలస్ పూరన్ నాయకత్వం వహించారు. మరోవైపు పంత్ గతంలో 2021, 2022, 2024 సీజన్లలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు నాయకత్వం వహించాడు.

## చరిత్ర సృష్టించిన నైజీరియా

### న్యూజిలాండ్‌పై సంచలన విజయం



క్రికెట్‌లో హిస్టరీలో సంచలన విజయం నమోదైంది. వరల్డ్ క్రికెట్‌లో అత్యంత పటిష్ఠమైన న్యూజిలాండ్ జట్టును పసికూన నైజీరియా ఓడించింది. 2025 మహిళల అండర్19 వరల్డ్‌కప్‌లో భాగంగా తాజాగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో నైజీరియా అమ్మాయిల జట్టు 2 పరుగుల స్వల్ప తేడాతో నెగ్గి చరిత్ర సృష్టించింది. దీంతో నైజీరియా అమ్మాయిల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. సంతోషంతో కేరింతలు కొడుతూ మైదానం అంతటా తిరిగి సంబరాలు చేసుకున్నారు. మలేసియా వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం న్యూజిలాండ్ నైజీరియా జట్లు తలపడ్డాయి. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం తీవ్ర అంతరాయం కలిగించింది. దీంతో 20 ఓవర్లు సాగాల్సిన ఆటను నిర్వాహకులు ఇరువైపులా 13 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన నైజీరియా మహిళల జట్టు 13 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసింది. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన న్యూజిలాండ్ 13ఓవర్లు ఆడి 636 స్కోర్‌కే పరిమితమైంది. అయితే చివరి 6 బంతుల్లో కివీస్ విజయానికి 9 పరుగులు అవసరమయ్యాయి. ఆ సమయంలో లిలియన్ ఉదేహ్ బంతి అందుకుంది. ఆఖరి ఓవర్ అద్భుతంగా బౌలింగ్ చేసి తన జట్టుకు చరిత్రాత్మక విజయం అందించింది. కాగా, అండర్ 19 టీ20 వరల్డ్‌కప్ హిస్టరీలో నైజీరియా జట్టుకు ఇదే తొలి విజయం కావడం విశేషం.



## ఆకట్టుకుంటున్న 'భైరవం' టీజర్

టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న మల్టీస్టారర్ మూవీ 'భైరవం' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్‌ని క్రియేట్ చేసింది. ఈ సినిమాలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ నటిస్తుండటంతో ఈ సినిమా ఎలా ఉండబోతుందా అనే ఆసక్తి నెలకొంది. ఇక ఈ సినిమాను దర్శకుడు విజయ్ కనకమేడల డైరెక్ట్ చేస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా పోస్టర్స్, ఫస్ట్ సింగిల్ సాంగ్ ప్రేక్షకుల్లో పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేశాయి. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఆద్యంతం పవర్‌ఫుల్ మాస్ యాక్షన్‌తో ఈ టీజర్‌ను కట్ చేశారు. ముగ్గురు హీరోలు కూడా తమ పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులకు మంచి ట్రీట్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు ఈ టీజర్ చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ టీజర్‌లో కొన్ని పవర్‌ఫుల్ డైలాగులు కూడా పేలాయి. భారీ క్యాస్టింగ్‌తో దర్శకుడు విజయ్ కనకమేడల ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు టీజర్ చూస్తే తెలుస్తోంది. మొత్తంగా 'భైరవం' మూవీ ప్రేక్షకులను మెప్పించే కంటెంట్‌తో రాబోతుందని ఈ టీజర్ ప్రూవ్ చేసింది. ఇక ఈ సినిమాలో అదితి శంకర్, ఆనంది, సందీప్ రాజ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తుండగా శ్రీ సత్యసాయి ఆరట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# రీల్

## విజయ్ రంగరాజు కన్నుమూత



తెలుగు సీనియర్ నటుడు విజయ రంగరాజు గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రంగరాజు, చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఇటీవల షూటింగ్‌లో గాయపడ్డ రంగరాజు చికిత్స కోసం చెన్నైలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. అయితే సడెన్‌గా గుండెపోటుకు గురై రంగరాజు మృతి చెందారు. ఆయన మృతి పట్ల టాలీవుడ్ ఇండస్ట్రీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. కాగా, 1994లో భైరవద్వీపం సినిమాతో ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. 30 ఏళ్ల కెరీర్‌లో విలన్, సహాయ పాత్రలు పోషించారు. ముఖ్యంగా గోపిచంద్ 'యజ్ఞం' సినిమాతో రంగరాజుకు మంచి గుర్తింపు లభించింది. ఆ సినిమాలో విలన్‌గా ఆకట్టుకున్నారు.

## అమ్మ బయోపిక్ చేయాలనేదే నా కల

నరేశ్



సీనియర్ నటుడు నరేశ్ వీకే పుట్టిన రోజు నేడు. ఈ సందర్భంగా నటి పవిత్రతో కలిసి నరేశ్ తన అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ క్రమంలో విలేకర్ల సమావేశంలో నరేశ్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో ఈ 2025 గుర్తుండిపోతుంది. ఏకకాలంలో తొమ్మిది సినిమాల్లో నటిస్తున్నాను. యువ దర్శకులు నాకోసమే రాస్తున్న పాత్రలతో ఇటు థియేటర్‌లోనూ, అటు ఓటీటీ వేదికలతోనూ ప్రేక్షకుల్ని అలరించడం నేను అదృష్టంగా భావిస్తున్నాను' అని నరేశ్ తెలిపారు. నరేశ్ తన కలల సినిమాల గురించి మాట్లాడుతూ.. 'మా అమ్మ విజయనిర్మల బయోపిక్ చేయాలనేది నా కల. అది రాయగలిగితే నేనే రాస్తాను. అమ్మ కూడా ఆ మాటే చెప్పేవారు. అలాగే 'చిత్రం భళారే విచిత్రం', 'శ్రీవారికి ప్రేమలేఖ' సినిమాలకి కొనసాగింపు చిత్రాల్ని చేయాలన్నది మరో కల. కథలు రాయడం కూడా మొదలుపెట్టాను. భవిష్యత్తులో దర్శకత్వం చేయాలనే ఆలోచన కూడా ఉంది' అంటూ నరేశ్ చెప్పుకొచ్చారు.

## మృణాల్‌కి లక్కీ ఛాన్సే.. కానీ..!



సీతారామంతో సూపర్ హిట్ అందుకున్న మృణాల్ ఠాకూర్ తెలుగులో ఊహించని క్రేజ్ సొంతం చేసుకుంది. సీతారామం తర్వాత వెంటనే హాయ్ నాన్న పడటం అది కూడా హిట్ అవ్వడంతో అమ్మడికి తిరుగు లేదని అనుకున్నారు. ఐతే థర్డ్ సినిమాగా చేసిన ఫ్యామిలీ స్టార్ షాక్ ఇవ్వడంతో కాస్త డల్ అయ్యింది. ఐతే మృణాల్ ఇటు టాలీవుడ్‌లోనే కాదు బాలీవుడ్‌లో కూడా దూసుకెళ్తుంది. అక్కడ కూడా వరుస సినిమాలతో అదరగొట్టేస్తుంది. మృణాల్ ఠాకూర్ సౌత్ క్రేజ్‌ని బాలీవుడ్ మేకర్స్ కూడా వాడుకోవాలని ఫిక్స్ అయ్యారు. 2013లో రాజమౌళి డైరెక్షన్‌లో వచ్చిన మర్యాద రామన్న రీమేక్‌గా బాలీవుడ్‌లో సన్ ఆఫ్ సర్దార్ సినిమా వచ్చింది. ఆ సినిమాకు సీక్వెల్‌గా పార్ట్ 2 చేస్తున్నారు. సన్ ఆఫ్ సర్దార్ 2లో మృణాల్ ఠాకూర్‌కి ఛాన్స్ వచ్చింది. అజయ్ దేవగన్ నటిస్తున్న ఈ సినిమాలో అవకాశం రావడం పట్ల అమ్మడు సంతోషపడుతుంది. రాజమౌళికి ఈ సన్ ఆఫ్ సర్దార్ 2కి ఏమాత్రం సంబంధం లేదు. ఐతే ఈ సీక్వెల్ మాత్రం ఆడియన్స్‌ని సర్ ప్రైజ్ చేస్తుందని అంటున్నారు మేకర్స్. ముఖ్యంగా మృణాల్‌కి ఇదొక మంచి అవకాశమని అంటున్నారు. తెలుగులో సీతారామం, హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ సినిమాల్లో తన అభినయంతో మెప్పించిన మృణాల్‌కి బాలీవుడ్‌లో కూడా అలాంటి ఛాన్స్ వచ్చిందని అంటున్నారు.

## ట్రంప్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. ఈరోజు ప్రముఖ పౌరహక్కుల కార్యకర్త మార్టిన్ లూథర్ కింగ్ దినోత్సవమని గుర్తుచేశారు. జోబైడెన్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. దేశంలోకి వచ్చే అక్రమ వలసలను అరికట్టడంలో బైడెన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. అమెరికా-మెక్సికో సరిహద్దుల్లో జాతీయ ఎమర్జెన్సీ ప్రకటిస్తూ ఒక ఫైలుపై సంతకం చేస్తానని ఆయన ప్రకటించారు. మెక్సికో సరిహద్దులకు మరిన్ని సైన్యాలను పంపుతామన్నారు. తక్షణమే అక్రమ వలసలను ఆపేస్తామని అన్నారు. లక్షలాదిమంది నేరస్తులు ఏ దేశం నుండి వచ్చి అక్రమంగా అమెరికాలో ప్రవేశించారో వారందరినీ తిరిగి బయలుదేరిన చోటకే తిప్పిపంపిస్తామన్నారు. అమెరికాలో విదేశీ నేర ముఠాలను అరికట్టేందుకు 1798 నాటి ఎఇఎ (ఏలియన్స్ ఎనిమీస్ యాక్ట్)ను పునరుద్ధరిస్తామని చెప్పారు. అక్రమ ప్రవేశాలను తక్షణం ఆపేస్తామన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత చమురు, సహజవాయు నిక్షేపాలు అమెరికాలో ఉన్నాయనీ, ఇకమీదట వాటిని దేశం ఉపయోగించుకుంటుందని చెబుతూ 'డ్రిల్ బేబీ డ్రిల్...' అని హర్షధ్వానాలమధ్య ప్రకటించారు. అమెరికాలో 'నేషనల్ ఎనర్జీ ఎమర్జెన్సీ' ప్రకటిస్తానన్నారు. అమెరికా మళ్ళీ అతి సంపద్వంతమైన దేశంగా మారుతుందనీ, ఎందుకంటే మనకాళ్ళ కింద భూమిలో బంగారం చమురు నిక్షేపాల రూపంలో ఆవరించుకుని ఉందని అన్నారు. ఆటో ఇండస్ట్రీని అభివృద్ధి చేస్తామని, ఎలక్ట్రికల్ వాహనాలను పెంచుతామని అందుకు సంబంధించిన విస్తారమైన ప్రణాళిక అమలుచేస్తామన్నారు. అమెరికా మరోసారి ''తయారీరంగ దేశం''గా అవతరించబోతోందన్నారు. దేశంలో పోటీని నివారించి ధరలను నిత్యం చాలా హెచ్చుస్థాయిలో కొనసాగేందుకు ప్రయత్నం చేసే తయారీరంగ సరఫరాదారులను 'విదేశీ టెర్రరిస్టు సంస్థలు'గా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పారు. దేశంలో ఎదురయ్యే ప్రతి సమస్యను ఎంతో గౌరవ ప్రదంగా, శక్తిసామర్థ్యాలతో ఎదుర్కొంటామని, జాతి,మతం,రంగు, మతం వంటి భేదాలకు అతీతంగా అమెరికాలో ప్రతి పౌరుడికీ అభివృద్ధినీ, సంపదను చేరువచేస్తామని అన్నారు. అమెరికా ఎన్నో సవాళ్ళు ఎదుర్కొంటున్నదనీ, నేరాలు అరికట్టి దేశ విద్యారంగంలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేవుడు తన ప్రాణాలను ఒక లక్ష్యం సాధించడంకోసం కాపాడాడని ట్రంప్ మరోసారి ప్రకటించారు. ఎన్నికల ప్రచార సమయంలో ఆయన రెండుసార్లు హత్యా ప్రయత్నాలనుండి తప్పించుకున్నారు.గడచిన ఎనిమిది సంవత్సరాలలో ఏ అధ్యక్షుడూ ఎదుర్కోనన్ని పరీక్షలను తాను ఎదుర్కొన్నానన్నారు.

**హర్షధ్వానాల మధ్య ట్రంప్-జె.డి.వాన్స్ ప్రమాణం**

ఎన్ని ఆటంకాలు ఎదురైనా పట్టువదలని విక్రమార్కుడిలా పంతం పట్టి తన కల నెరవేర్చుకున్న డోనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా 47వ అధ్యక్షుడుగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యాంగాన్ని రక్షిస్తానని ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అమెరికా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేశారు. అమెరికా రాజ్యాంగాన్ని 'ప్రిజర్వ్, ప్రొటెక్ట్, డిఫెండ్ (రక్షించి, కాపాడి జాగ్రత్తగా సాకుతానని) అనే పదాలు ఉచ్చరించి ప్రమాణం చేశారు. జె.డి.వాన్స్ ఉపాధ్యక్షుడుగా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

వాషింగ్టన్‌లో ఆరుబయట గడ్డకట్టే చలిగాలులు మైనస్ 11 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలమధ్య సంప్రదాయినికి విరుద్ధంగా క్యాపిటల్ హిల్ రొటుండా భవంతి హాలులో అతిథులకు ప్రత్యేకంగా 700 సీట్లు కేటాయించారు. 20 వేల మందికిపైగా దేశ విదేశీ నాయకులు, అతిథులు, ఆత్మీయుల మధ్య భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 10.30 గంటలకు అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయనతోపాటు సహచరుడు జె.డి.వాన్స్ కూడా అమెరికా ఉపాధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం అధ్యక్ష హోదాలో సుదీర్ఘ ప్రసంగం చేశారు. అమెరికా ఫస్ట్‌లేడీ, ట్రంప్ సతీమణి మెలనియా ట్రంప్ చిరునవ్వులు చిందిస్తూ, చప్పట్లు కొడుతూ ఈ తతంగాన్ని తిలకించారు. కొత్త ప్రభుత్వంలో మంత్రులుగా బాధ్యతలు చేపట్టబోతున్న ట్రంప్ సహచరులు, పదవీ విరమణ చేస్తున్న అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలాహారిస్, అమెరికా మాజీ దేశాధ్యక్షులు బరాక్ ఒబామా, జార్జి బుష్, లారా, క్లింటన్, తదితరులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారోత్సవంలో భారత్ తరపున విదేశాంగమంత్రి జైశంకర్ పాల్గొన్నారు. భారతదేశ సంపన్నుడు ముఖేశ్ అంబానీ, ఆయన సతీమణి పాల్గొన్నడంతోపాటు ముందురోజు వారిద్దరూ ట్రంప్‌తో భేటీ అయ్యారు. ట్రంప్ విధాన నిర్ణయాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్న ఎలాన్‌మస్క్‌తోపాటు టెక్ బిలియనీర్లు మార్క్ జుకర్‌బెర్గ్, జెఫ్ బెజోస్, సుందర్ పిచాయ్ తదితరులు పాల్గొన్నారు. చైనా తరపున ఆ దేశ ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్‌సహా పలు దేశాల నాయకులు హాజరయ్యారు.

**భారీ భద్రతా ఏర్పాట్లు**

ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 48 కి.మీ మేరక భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. 25,000మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. కట్టుదిట్టంగా ఎలాంటి సమస్యలూ రాకుండా పహారా ఏర్పాటు చేశారు. అతిథులను పరిమితం చేశారు. చలిగాలులు ఉన్నప్పటికీ మెరికావ్యాప్తంగా వచ్చే అభిమానులను రాకుండా అడ్డుకోలేదు. వారి సొంత దుస్తుల ఏర్పాట్లు చేసుకుని రమ్మని సలహా ఇచ్చారు. సుమారు 2.20 లక్షల ఇనాగరేషన్ టిక్కెట్లు విక్రయించారు.

**రాత్రికి రాత్రే క్రిప్టో బిలియనీర్‌గా మారిన ట్రంప్**

డోనాల్డ్ ట్రంప్ రాత్రికి రాత్రే క్రిప్టో బిలియనీర్‌గా మారిపోయారు. క్రిప్టో-బిట్ కాయిన్‌లకు అమెరికాను ప్రపంచ రాజధానిగా మారుస్తానని అంతకుముందు విపరీతమైన చలిలో కూడా మద్దతుదారులతో జరిపిన ర్యాలీ సందర్భంగా ప్రకటించారు. ఫస్ట్ లేడీ మెలనియా ట్రంప్ స్వయంగా మెలనియా ట్రంప్ పేరుతో ఒక క్రిప్టో కరెన్సీ కాయిన్‌ను ప్రకటించారు. ట్రంప్ ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా ఆమె దీనిని పునరుద్ధరించారు. ఇంతకుముందే ఆమె ఈ కరెన్సీని విడుదల చేశారు. ఎక్స్ వేదికగా ఆమె ఆదివారంనాడు ఈ ప్రకటన చేశారు. ట్రంప్ తన ట్రంప్ క్రిప్టో కరెన్సీని విడుదల చేసిన తర్వాత అధికారికంగా మె లనియా మీమ్ ప్రకటన వచ్చింది. ఈ విధంగా మెలనియా, ట్రంప్ పేరిట రెండు క్రిప్టో కరెన్సీ కాయిన్స్ వచ్చాయి. కాయిన్ మార్కెట్ కాప్ వెబ్‌సైటు ప్రకారం ట్రంప్ టోటల్ మార్కెట్ విలువ 12 బిలియన్ డాలర్లు ఉండగా, మెలనియా మార్కెట్ విలువ 1.7 బిలియన్ డాలర్లుగా ఉంది. 2024 ఎన్నికలకు ముందు డోనాల్ ట్రంప్ క్రిప్టో కరెన్సీని పెద్ద స్కామ్‌గా అభివర్ణించారు. మూడోసారి ఎన్నికల్లో అభ్యర్థిగా ఆయన ఖరారు అయ్యాక క్రిప్టో కరెన్సీని ఆయన డొనేషన్లుగా స్వీకరించారు. క్రిప్టో కరెన్సీకి ఆయన ఇప్పుడు బ్రహ్మరథం పడుతున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్ కుటుంబం ''వరల్డ్ లిబర్టీ ఫైనాన్సియల్'' పేరుతో ఒక క్రిప్టో కరెన్సీని ప్రారంభించింది.

## సమావేశమవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

నేత సర్వన్ సింగ్ పంధే ర్ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులతో నిర్వహిం చ తలపెట్టిన సమావేశ తేదీ చాలా దూరంగా ఉందన్నారు. సమావేశమయ్యేందుకు ప్రభుత్వం చాలా సమయం తీసుకుందన్నారు. అయితే అతి తొందరగా సమావేశం నిర్వహించాలని, ఇది తమ విజ్ఞప్తి కాదని, తమ డిమాండ్ అని పంధేర్ పేర్కొన్నారు. అది కూడా ఢిల్లీలోని నిర్వహించాలన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 9వ తేదీ వరకు మోడల్ కోడ్ ఉన్నందున ఫిబ్రవరి 14వ తేదీన సమావేశ తేదీను ఖరారు చేసినట్లు రైతులు చెప్పారన్నారు. దీనిపై పంధేర్‌ను ప్రశ్నించగా రాజ్యాంగపరమైన 8వ పే కమిషన్‌ను కేంద్రం ప్రకటించినప్పటికీ ఎన్నికల కమిషన్ ఎలాంటి అభ్యంతరం చెప్పలేదుగా అని ప్రశ్నించారు. ఈ తురణంలో ఇంకా కొంచం తొందరంగా రైతులతో సమావేశమైతే ఏమవుతదన్నారు. మరో రైతు నేత ఎంఎస్ రాయ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 14వ తేదీన సమావేశం కావడమంటే పూర్తి జాప్యమేనన్నారు. తొందరగా నిర్వహిస్తారని తాము భావిస్తున్నామన్నారు. మోడల్ కోడం ఉందని సాకులు చెప్పడం రైతులను తప్పుదారి పట్టించడమేనన్నారు. ఇదిలా ఉండగా, కేంద్ర బృందం శనివారం ప్రతిపాదిత సమావేశాన్ని ప్రకటించిన తరువాత వైద్య సహాయానికి డల్లేవాల్ అంగీకరించినప్పటికీ దీక్ష విరమించేందుకు నిరాకరించారు. దీంతో డల్లేవాల్ ఆమరణ దీక్ష కూడా విరమించాలని, సమావేశంలో పాల్గొని కెఎంఎంనేత విజ్ఞప్తి చేశారు. ఆహారం తీసుకోకుండా వైద్య సహాయం పొందినా లాభం లేదని డల్లేవాల్‌కు వైద్యం అందించిన డాక్టర్ స్వాయ్‌మాన్ సింగ్ కూడా చెప్పారన్నారు. ఇది అతిపెద్ద పోరాటమన్నారు. రానున్న రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరముందని పంధేర్ పేర్కొన్నారు. ప్రభుత్వంతో పోరాటం చేస్తామని, అందుకు ప్రధాన నాయకుడు ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆహారం తీసుకోవాలని డల్లేవాల్‌ను కోరారు. తమ డిమాండ్ల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు.

## ప్రియురాలికి మరణశిక్ష

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. కుట్రపూరితంగానే అతడికి ఇచ్చిన జ్యూస్‌లో హానికారక పదార్థాలు కలిపింది. అయినా తన మోసాన్ని కప్పిపుచ్చుకునేందుకు యత్నించింది. గ్రీష్మకు షారన్ ఎన్నడు కూడా తప్పుడు మెసేజ్‌లు పంపలేదు. ఆమెపై నిందలు మోపలేదు. షారన్ రెచ్చగొట్టకపోయినా, ఘర్షణకు దిగకపోయినా అతడి ప్రాణాలను గ్రీష్మ తీయడం నేరమే' అని న్యాయస్థానం పేర్కొంది. అయితే తనకు శిక్షను తగ్గించాలని గ్రీష్మ న్యాయస్థానాన్ని కోరింది. ఉన్నత చదువులు చదివానని, ముందు కూడా తనపై ఎలాంటి నేర చరిత్ర లేదని పేర్కొంది. అంతేకాకుండా తన తల్లిదండ్రులకు ఏకైక కుమార్తె అని, ఇవన్నీ చూసి తనకు శిక్షను తగ్గించాలని కోర్టును అభ్యర్థించింది. అయితే, న్యాయస్థానం ఈ వాదనలను తోసిపుచ్చింది. కాగా, తిరువనంతపురంలోని పరశాలలో నివసించే షారన్ 2022 అక్టోబర్ 25న మృతి చెందాడు. ఆయన మృతి పట్ల అనుమానంతో అతని కుటుంబ సభ్యులు తమిళనాడులోని రామవర్మంచిరలోని అతని ప్రేయసి గ్రీష్మపై కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులకు గ్రీష్మ తన కుటుంబ సభ్యులతో కలిసి షారన్‌ను చంపినట్లు అంగీకరించింది. తనకు మరో యువకుడితో పెళ్లి కుదిరిందని, అయితే వివాహం జరిగితే మొదటి భర్త చనిపోతాడని జ్యోతిషుడు చెప్పడం వల్లే ఈ దారుణానికి పాల్పడినట్లు తెలిపింది. తాను గతంలో ఎవరికీ తెలియకుండా ఓ చర్చిలో షారన్‌ను వివాహం చేసుకున్నట్లు వెల్లడించింది. ప్రణాళిక ప్రకారం 2022 సెప్టెంబర్ 14న తమిళనాడులోని రామవర్మంచిర్‌లో ఉన్న తన ఇంటికి షారన్‌ను పిలిచింది గ్రీష్మ. అయితే అక్కడ వారు జ్యూస్ తాగే పోటీని పెట్టుకున్నారు. గ్రీష్మ షారన్‌కు ఇచ్చిన జ్యూస్‌లో కాపర్ సల్ఫేట్ కలిపి ఇచ్చింది. అది తాగిన షారన్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అనంతరం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషం తాగిన కారణంగానే షారన్ మృతి చెందినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలింది. ఈ విషయాన్ని రుజువు చేసేలా గ్రీష్మ, షారన్ మధ్య వాట్సాప్ చాటింగ్‌లు లభించాయి. ఈ కేసు విషయంలో 2023 జనవరి 25న పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2024 అక్టోబరు 15న కోర్టులో మొదలైన విచారణ ప్రక్రియ ఈ ఏడాది జనవరి 3న ముగిసింది. ఎట్టకేలకు సోమవారం(జనవరి 20) తీర్పును వెలువరించారు.

## మరింత లోతుగా విచారణ

(మొదటి పేజీ తరువాయి)

పాటు గ్రీన్‌కో సంస్థల ఎండి అనిల్‌కుమార్‌తో పాటు ఏనెనెకట్స్ జెన్ సంస్థ ప్రతినిధులను ఎసిబి విచారించింది. వీరందరు ఇచ్చిన వాంగ్మూలాలపై న్యాయ నిపుణులతో ఎసిబి అధికారులు చర్చిస్తున్నారు. అయితే ఈ కేసులో పరస్పర వాంగ్మూలాలు రావడంతో నిందితులను మరోసారి విచారించి రుడీ చేసుకోవాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. సీజన్ 10తో పాటు నాలుగు సీజన్లకు ఒప్పందం చేసుకున్నప్పటికీ ఎందుకు ఒప్పందం నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని ఏన్నెకట్స్ జెన్ కంపనీ ప్రతినిధులను ఎసిబి వివరణ కోరింది. అలాగే 10వ సీజన్ నిర్వహించాల్సి ఉండగా ఎందుకు ఒప్పందం నుంచి వైదొలగ డం వెనుక కారణాలపై ఎసిబి లోతుగా ఆరా తీశారు. 9వ సీజన్ కోసం ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంలో పేర్కొన్న అంశాలపైనా ప్రశ్నించారు. ఫార్ములాఈ రేస్ దర్యాప్తు కీలకంగా మారిన గ్రీన్‌కో అనుబంధ సంస్థల ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారంపై ఎసిబి క్విడ్ ప్రోకో కోణంలో విచారణ చేపట్టింది. ఫార్ములాఈ ఒప్పం దానికి ముందు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బిఆర్‌ఎస్‌కు రూ.41 కోట్లు చెల్లించడంపై వివరణ కోరింది. 2022 అక్టోబరు 25న రేసు నిర్వహణకు త్రైపాక్షిక ఒప్పందం జరిగితే అంత కుముందు ఆదే ఏడాది ఏప్రిల్‌లో రూ.31 కోట్లు, అక్టోబర్లో రూ.10కోట్లు గ్రీన్ అనుబంధ సంస్థలు బిఆర్‌ఎస్ ఎలక్టోరలా బాండ్లను ఎందుకు సమకూర్చారంటూ ఎసిబి ఆరా తీస్తుంది. మాదాపూర్‌లోని గ్రీన్ కో ఆఫీసు, గ్రీన్‌కో అనుబంధ సంస్థ ఎస్ నెకట్స్ జెన్ లోనూ సోదాలలో లభించిన ఆధారాలపై ఎసిబి ఆరా తీసింది. ఫార్ములా ఈ కార్ రేస్‌కు సంబంధించి నిధులు ఏ అకౌంట్ నుంచి వచ్చాయనే అంశంపైఎసిబి అధికారులు కీలక ఆధారాలు సేకరించారు. విచారణలో భాగంగాఎసిబి సోదాలలో లభించిన ఆధారాలను ఎస్ నెకట్స్ జెన్ డైరెక్టర్ చలమశెట్టి సునీల్ కు ఎదుట ఉంచి ఎసిబి కీలక ప్రశ్నలు సంధించిన విషయం తెలిసిందే.

**నష్టంతోనే తప్పుకున్నాం..**

ఫార్ములా ఈరేసు వ్యవహారంలో మొదటి ఒప్పందం ప్రకారం సీజన్ 9, 10, 11, 12 రేస్ల నిర్వహణ ఖర్చులను ఎస్ నెకట్స్ జెన్ భరిస్తామని ఒప్పందంలో పేర్కొన్న అంశాలపై ఎసిబి ఆ సంస్థ ప్రతినిధులను సూటిగా ప్రశ్నించింది. ఈ క్రమంలో 2023 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో సీజన్9 ఫార్ములా ఈరేస్లో లావాదేవీలపై వివరణ కోరింది. అలాగే 2024 ఫి బ్రవరిలో జరగాల్సిన సీజన్10 రేస్ కోసం ఫార్ములాఈ ఆపరేషన్స్ (ఎఫ్ఇఒ) సంస్థకు 2023 మే లోనే 50 శాతం సొమ్ము (రూ.30 కోట్లు) చెల్లించాల్సి ఉండగా ఏస్నెకట్స్ జెన్ కంపెనీ ఎందుకు ముందుకు రాలేదని ఎసిబి అధికారులు విచారణ చేపట్టారు. దీంతో సీజన్9 ఫార్ములా ఈరేసు నిర్వాహణతో తమకు భారీగా నష్టం వాటిల్లిందంటూ ఎస్ నెకట్స్ జెన్ కంపెనీ చేతులెత్తేసినట్లు ఎస్ నెకట్స్ జెన్ ప్రతినిధులు సమాధానం ఇచ్చినట్లు తెలియ వచ్చింది. తాము తప్పుకోవడంతో హెచ్ఎండిఎను ప్రమోటర్‌గా అప్పటి పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ చేర్చారని విచారణలో ఎస్ నెకట్స్ జెన్ ప్రతినిధులు వివరించారు. ఇందులో భాగంగానే 2023 అక్టోబరు 5, 11 తేదీల్లో రూ.45.71 కోట్లను ఎఫ్ఇవోకు హెచ్ఎండిఎ నేరుగా బదిలీ చేసిందని ఏస్ నెకట్స్ జెన్ ప్రతినిధులువాంగ్మూలం ఇచ్చారు. కాగా ఒప్పందం నుంచి అర్ధాంతరంగా తప్పుకొన్న ఎస్ నెకట్స్ జెన్ సంస్థపై అప్పటి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందన్న కోణంలోనూ ఎసిబి ఆరా తీస్తున్నారు.ఈ నేపథ్యంలోనే నిందితులను మరోసారి విచారించిన తరువాతనే నిర్ధారణకు రావాల్సి ఉంటుందని ఎసిబి అధికారులు అభిప్రాయపడుతున్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com